CENTRE FOR DISTANCE EDUCATION

# VYAKARANAM (Grammar)

## M.A. SANSKRIT

## Semester-II, Paper -II



CENTRE FOR DISTANCE EDUCATION
ACHARYA NAGARJUNA UNIVERSITY
NAGARJUNA NAGAR-522510

# VYAKARANAM (Grammar)

## M.A. SANSKRIT

## Semester-II, Paper -II

**Director**

**Dr.Nagaraju Battu**

M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Phone No.0863-2346208, 0863-2346222,

0863-2346259 (Study Material)

Website: www.anucde.info

e-mail: anucdedirector@gmail.com

## విభక్త్యర్థ ప్రకరణమ్

Paper - II
Sem - II

### 1. ప్రాతిపదికార్థలిఙ్గపరిమాణవచనమాత్రే ప్రథమా (2-3-46)

**నియతోపస్థితికః ప్రాతిపదికార్థః, మాత్రశబ్దస్య ప్రత్యేకం యోగః. ప్రాతిపదికార్థమాత్రే లిఙ్గమాత్రాద్యాధిక్యే సంఖ్యామాత్రే చ ప్రథమా స్యాత్. ఉచ్చైః, నీచైః, కృష్ణః, శ్రీః, జ్ఞానమ్. అలిఙ్గా నియతలిఙ్గాశ్చ ప్రాతిపదికార్థమాత్ర ఇత్యస్యోదాహరణమ్. అనియతలిఙ్గాస్తు లిఙ్గమాత్రాద్యాధిక్యస్య. తటః, తటీ, తటమ్. పరిమాణమాత్రే - ద్రోణో వ్రీహిః. ద్రోణరూపం యత్పరిమాణం తత్పరిచ్ఛిన్నో వ్రీహిరిత్యర్థః. ప్రత్యయార్థే పరిమాణే ప్రకృత్యర్థోఽభేదేన సంసర్గేణ విశేషణమ్, ప్రత్యయార్థస్తు పరిచ్ఛేద్యపరిచ్ఛేదకభావేన వ్రీహౌ విశేషణమితి వివేకః. వచనం-సంఖ్యా. ఏకః, ద్వౌ, బహవః. ఇహోక్తార్థత్వాద్విభక్తేరప్రాప్తౌ వచనమ్.**

## ప్రథమా విభక్తి :

ప్రాతిపదికార్థలింగ పరిమాణ వచనమాత్రే ప్రథమా - ప్రాతిపదికార్థలింగ - పరిమాణ వచనమాత్రే, ప్రథమా అని పదచ్ఛేదము.

ప్రాతిపదికార్థశ్చ, లింగం చ, పరిమాణం చ, వచనం చ ప్రాతిపదికార్థలింగ పరిమాణ వచనాని. ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచనాన్యేవ ప్రాతిపదికార్థలింగ పరిమాణవచన మాత్రం. తస్మిన్ ప్రాతిపదికార్థ లింగపరిమాణవచనమాత్రే అని విగ్రహవాక్యము.

సూత్రమున ప్రాతిపదికార్థ, లింగ, పరిమాణ, వచన అనునది ద్వంద్వ సమాసము. " ద్వంద్వాంతే శ్రూయమాణం పదం ప్రత్యేకమభి సంబధ్యతే " అను నియమానుసారముగ మాత్రశబ్దము అన్ని శబ్దములతో సమసించును. కావున ప్రాతిపదికార్థ మాత్రే, లింగమాత్రే, పరిమాణ మాత్రే, సంఖ్యామాత్రే అను అర్థము. ఈ విధంగా మాత్ర శబ్దము ప్రత్యేకముగా అన్వయించి ప్రాతిపదికార్థమాత్రమందు, లింగమాత్రాధిక్యమందు, పరిమాణమాత్రాధిక్యమందు, వచనమాత్రాధిక్యమందు ప్రథమా విభక్తి వచ్చునని అర్థము.

**1. ప్రాతిపదికార్థమాత్రమందు ప్రథమా విభక్తి :** నియతోపస్థితికము ప్రాతిపదికార్థము. అనగా ప్రాతిపదికమును వినగానే నియతముగా ఏ అర్థము స్ఫురించునో అది ప్రాతిపదికార్థము. అలింగములు అనగా పుంస్త్వాది లింగ రహితములు అని అర్థము.



నియత లింగములనగా పుంస్త్వాదులలో ఏదో ఒకే లింగమందు మాత్రమే ఉండు శబ్దములు అని అర్థము. ఈ రెండు విధములగు శబ్దములు " **ప్రాతిపదికార్థే ప్రథమా** " అను దానికి ఉదాహరణములు. ఉచ్చైః, నీచైః మొదలగు అవ్యయముల వలన పుంస్త్వాది లింగములేవియూ ఉపస్థితములు కావు. కావున అవి అలింగములు. వాటికి ప్రథమా విభక్తి ప్రకృత సూత్రముచే వచ్చును. కృష్ణః, శ్రీః జ్ఞానమ్ మొదలగు నియత లింగములు కూడా ప్రకృత (ప్రస్తుత) సూత్రమునకు ఉదాహరణములు. కృష్ణశబ్దము నిత్య పుంలింగము. శ్రీ శబ్దము నిత్య స్త్రీలింగము, జ్ఞానశబ్దము నిత్యనపుంసకలింగము కావున ఆ శబ్దములకు ప్రకృత సూత్రముచే ప్రథమా విభక్తి వచ్చును.

**2. లింగమాత్రమందు ప్రథమా విభక్తి :** పుంస్త్వాది (పుంలింగం, స్త్రీలింగం మరియు నపుంసకలింగము) లింగమాత్రాధిక్యమందు ప్రథమా విభక్తి వచ్చును. తటః, తటీ, తటమ్ అనునవి ఉదాహరణములు. తట శబ్దము మూడు లింగములలో ఉండును. తట శబ్దము అనియత లింగము. కావున ప్రాతిపదికార్థముతో పాటు పుంస్త్వాది లింగములు గూడ అధికముగా భాసించుచున్నవి. ఇక్కడ తటః, తటీ, తటమ్ అని ప్రథమా విభక్తి ప్రవర్తించును.

**3. పరిమాణమాత్రమందు ప్రథమా విభక్తి :** ద్రోణశబ్దమునకు పరిమాణ విశేషము అర్థము. కావున పరిమాణమాత్రాధిక్యమున ప్రథమా విభక్తి వచ్చును. " ద్రోణో వ్రీహిః " అనునది ఉదాహరణ. ప్రత్యయార్థమందు అనగా పరిమాణ సామాన్యమందు అభేద సంబంధముతో అన్వయించును. పరిమాణ సామాన్యరూప ప్రత్యయార్థము పరిచ్ఛేద్య పరిచ్ఛేదక భావము అను సంబంధముతో వ్రీహియందు అన్వయించును. (వ్రీహి పరిచ్ఛేద్యము, ద్రోణము పరిచ్ఛేదకము) పరిచ్ఛేద్యమనగా కొలువదగినది. పరిచ్ఛేదకమనగా కొలుచునట్టిది. కనుక ద్రోణో వ్రీహిః అనుచోట ద్రోణరూప పరిమాణముచే పరిచ్ఛిన్నమగు వ్రీహి అను బోధ కలుగును. ద్రోణరూపము ఏ పరిమాణము గలదో దానితో పరిచ్ఛిన్నము వ్రీహి యని ద్రోణో వ్రీహిః అను పదద్వయమునకు అర్థము.

**4. వచనమాత్రమందు ప్రథమా విభక్తి :** ఏకః, ద్వౌ, బహవః అను సంఖ్యావాచక పదములు " **వచనమాత్రే ప్రథమా** " అను అంశమునకు ఉదాహరణములు. ఇక్కడ వచ్చు ప్రథమావిభక్త్యర్థములు క్రమముగా ఏకత్వ, ద్విత్వ, బహుత్వ రూపార్థములను తెలుపుచున్నవి. కాని ఇక్కడ, ఏక, ద్వి, బహు అను ప్రాతిపదికములే ప్రత్యయార్థముల ఏకత్వ-ద్విత్వ-బహుత్వములను వచనము (సంఖ్య) లను తెలుపుటచే " ఉక్తార్థానామ

ప్రయోగః " అను న్యాయము (మరల చెప్పబడినవానికి ప్రయోగము లేదు) ద్వారా తిరిగి ఏకత్వాది బోధకములగు - ప్రత్యయములు వచ్చుటకు వీలులేదు. విభక్తి ప్రత్యయము రాని పక్షమున ఏక, ద్వి ఇత్యాదులకు పరత్వము సిద్ధింపదు. కావున ఏకత్వాది సంఖ్యాబోధకములగు ఏక, ద్వి, బహు అను శబ్దములపై ప్రథమా విభక్తి ప్రత్యయములు చెప్పుటచే సూత్రమున " వచన " శబ్దము చెప్పబడినది.

## 2. సంబోధనే చ (2-3- 47)

**ఇహ ప్రథమా స్యాత్. హే రామ.**

సంబోధనే, చ అని పదచ్ఛేదము. సంబోధనమనగా ఎదుటనున్న లేదా దూరముగా ఉన్నవానిని పిలుచుట. అట్టి అర్థమున ప్రథమా విభక్తి వచ్చును. పూర్వసూత్రము నుండి ప్రథమా అను పదము అనువర్తించును. హే రామ అనునది ఉదాహరణ.

**ప్రథమా విభక్తి సంపూర్ణము**

# అథ ద్వితీయా విభక్తిః

## 3. కారకే (1-3-23)

**ఇత్యధికృత్య**

కారకమనగా క్రియాజనకము అని అర్థము. కరోతి = క్రియాం నిర్వర్తయతి అని కారక శబ్దమునకు వ్యుత్పత్తి. క్రియను నిర్వర్తింపజేయునది అని అర్థము. ఇది అధికార సూత్రము.

## 4. కర్తురీప్సితతమం కర్మ (1-4-49)

**కర్తుః క్రియయా ఆప్తుమ్ ఇష్టతమం కారకం కర్మసంజ్ఞం స్యాత్. " కర్తుః " కిమ్? మాషేష్వశ్వం బధ్నాతి. కర్మణ ఈప్సితా మాషాః, నతు కర్తుః. తమబ్ గ్రహణం కిమ్ ? పయసా ఓదనం భుఙ్క్తే. 'కర్మ' ఇత్యనువృత్తౌ పునః కర్మగ్రహణమాధారనివృత్త్యర్థమ్. అన్యథా " గేహం ప్రవిశతి " ఇత్యత్రైవ స్యాత్.**

కర్తుః ఈప్సితతమం, కర్మ అని ఈ సూత్రము యొక్క పదచ్ఛేదము. "కారకే" అను అధికార సూత్రము అనువర్తించును.

కర్తకు స్వక్రియచే ఏది ఈప్సితతమమో ఆ కారకము కర్మ సంజ్ఞకమగును అని సూత్రార్థము. ధాతువునకు ఫలము, వ్యాపారము అని రెండర్థములుండును. దానిలో



వ్యాపారమునకాశ్రయమైనవాడు కర్త. ఆప్తుం ఇష్టం - ఈప్సితమ్, అతిశయేన ఈప్సితమ్ - ఈప్సితతమమ్. అనగా తత్ ప్రాప్తికై ఎక్కువగా అభిలషింపబడినదని భావము. కర్త యందలి క్రియతో సంబంధించుటకు ఇష్టతమమగు కారకము కర్మ సంజ్ఞ కలిగినది అగునని సూత్రార్థము.

ఈ సూత్రమందు " కర్తుః " అనుపదము లేనిచో " మాషేషు అశ్వం బధ్నాతి " (మాషములను ధాన్యముపై అభిలషించిన గుర్రమును వేరొకచోట కట్టుచున్నాడు) అను ఉదాహరణమందు మాషములకు కూడా కర్మ సంజ్ఞ రావలసి వచ్చును. కర్తృపదము వేసినచో ప్రకృత స్థలమందు మాషములు కర్మసంజ్ఞకమగు అశ్వమునకే ఈప్సితములు (ఇష్టములు) గాని కర్తకు గాదు కావున కర్మసంజ్ఞ వారించును.

కాని " తండులాన్ పచతి " అను ఉదాహరణమందు (బియ్యమును వండుచున్నాడు) కర్త యందలి క్రియతో సంబంధించుటకు ఇష్టతమమగు కారకము తండుల శబ్దము కర్మ సంజ్ఞ కలది యగును. కర్మ సంజ్ఞ కలదగుటచే ద్వితీయా విభక్తి కూడ వచ్చును.

ఈ సూత్రమందు తమబ్ గ్రహణము అనగా " ఈప్సితతమమ్ " అను పదము లేనిచో " కర్తురుద్దేశ్యం కర్మ " అను సూత్రమును చేసినచో " పయసా ఓదనం భుఙ్క్తే " (పాలతో అన్నమును తినుచున్నాడు) అను ఉదాహరణమందు కర్తకు ఉద్దేశ్యమగు పయస్సునకు కూడా కర్మ సంజ్ఞ రావలసి వచ్చును. ఈ ప్రత్యుదాహరణకు భోజనము చేసి కూడా పాలయందలి కోరికతో మరల భోజనమందు ప్రవర్తించుచున్నాడని అర్థము. ఈప్సితతమ శబ్దమును వేసినచో ఓదనమే ఈప్సితతమముగాని గుణభూతమగు పయస్సు కాదు కావున దానికి కర్మ సంజ్ఞ రాదు.

" అధిశీఙ్ స్థాసాం కర్మ " అను సూత్రము నుండి కర్మపదము అనువర్తించుచుండగా ఈ సూత్రములో మరల కర్మపదము అధారపదమునకు అనువృత్తి లేకుండా ఉండుటకై ఉపాత్తమైనది. అట్లుకాక ఈ సూత్రములో ఆధారపదము కూడా అనువర్తించినచో " గేహం ప్రవిశతి " మున్నగు ఉదాహరణలందు ఆధారభూతములగు గేహాదులకే కర్మ సిద్ధించునుగాని తండులాన్ పచతి, హరిం భజతి ఇత్యాదులందు తండులము, హరి మొదలగు శబ్దములకు కర్మసంజ్ఞ సిద్ధించక పోవును.

## 5. అనభిహితే (2-3-1)

**ఇత్యధికృత్య.**

అభిహితమనగా చెప్పబడినదని అర్థము. అనభిహితమనగా చెప్పబడనిది అని అర్థము. ఇది అధికార సూత్రము.

## 6. కర్మణి ద్వితీయా (2-3-2)

**అనుక్తే కర్మణి ద్వితీయా స్యాత్. హరిం భజతి. అభిహితే తు కర్మణి " ప్రాతిపదికార్థమాత్రే " ఇతి ప్రథమైవ. అభిధానం చ ప్రాయేణ తిఙ్ కృత్తద్ధితసమాసైః. తిఙ్ - హరిః సేవ్యతే. కృత్ - లక్ష్మ్యా సేవితః. తద్ధితః - శతేన క్రీతః శత్యః. సమాసః -ప్రాప్తః ఆనందో యం సః - ప్రాప్తానందః. క్వచిన్నిపాతేనాభిధానమ్. యథా-విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తుమసామ్ప్రతమ్, సాంప్రతమిత్యస్య హి యుజ్యత ఇత్యర్థః.**

కర్మణి ద్వితీయాః - కర్మణి, ద్వితీయా అని పదచ్ఛేదము. "అనభిహితే" అను పూర్వ సూత్రము అనువర్తించును. కర్మ తిఙ్గాదులచే కాకుండా మరియు దేనిచేతను కూడా చెప్పబడనప్పుడు ప్రాతిపదికకు ద్వితీయా విభక్తి వచ్చునని సూత్రార్థము.

హరిం భజతి (హరిని భజించుచున్నాడు లేక సేవించుచున్నాడు) "భజ్" ధాతువునకు సంతుష్ట్యనుకూల పూజాది వ్యాపారమర్థము. భజతి అను క్రియాపదముచే కర్త చెప్పబడదు కావున హరి శబ్దమునకు కర్మ సంజ్ఞ వచ్చును అనగా ద్వితీయా విభక్తి వచ్చును. " హరిః సేవ్యతే " (హరి సేవింపబడుచున్నాడు) అనునపుడు " సేవ్యతే " అను కర్మ చెప్పబడుట వలన ద్వితీయా విభక్తి రాదు. " ప్రాతిపదికార్థమాత్రే " అను సూత్రముచే ప్రథమా విభక్తియే వచ్చును. " భజతి " అనుచోట తిఙ్ ప్రత్యయము కర్తను మాత్రమే చెప్పును. కాని కర్మను చెప్పుట లేదు. కనుక కర్మ అనభిహితమగుటచే కర్మ సంజ్ఞకమగు హరిశబ్దమునకు ఈ సూత్రముచే ద్వితీయా విభక్తి రాగా "హరిమ్" అని యగును. కర్మ అభిహితే అని చెప్పినచో ప్రథమా విభక్తియే వచ్చును.

కర్మ సాధారణముగా తిఙ్, కృత్, తద్ధితములచే చెప్పబడును.

(1) "హరిః సేవ్యతే" అను ఉదాహరణమందు కర్మార్థకమగు "సేవ్యతే" అను తిఙంతముతోపాటు కర్మయగు హరి శబ్దము చెప్పుటచే హరి శబ్దమునకు కర్మ సంజ్ఞ ఉన్నను దానికి ద్వితీయా విభక్తి రాదు.

(2) "లక్ష్మ్యా హరిః సేవితః" (లక్ష్మిచే హరి సేవింపబడినాడు) అను ఉదాహరణలో కర్మార్థక కృత్ ప్రత్యయము ("క్త" ప్రత్యయము) " సేవిత " శబ్దముచే కర్మయగు హరి శబ్దమునకు ద్వితీయా కాకుండా ప్రథమా విభక్తియే వచ్చును.



(3) "శతేన క్రీతః శత్య అశ్వః" (నూరు రూపాయలచే కొనబడినది శత్యము, గుఱ్ఱము) అను స్థలమందు తద్ధిత ప్రత్యయమగు "యత్" ప్రత్యయము చేత అశ్వరూప కర్మ చెప్పబడుటచే ద్వితీయా విభక్తి రాదు.

(4) "ప్రాప్త ఆనందః యం సః - ప్రాప్తానందః దేవదత్తః" (ఎవరికి ఆనందానుభవము ప్రాప్తించినదో అతడు ప్రాప్తానందుడు దేవదత్తుడు) అను ఉదాహరణమందు సమాసము (బహువ్రీహి) చేతను కర్మ చెప్పబడుటచే దేవదత్త శబ్దముపై ప్రస్తుత సూత్రముచే ద్వితీయా రాదు. ప్రథమా విభక్తియే వచ్చును.

కొన్నిచోట్ల నిపాతములచేత కర్మ అభిహితమగును. " విషవృక్షోఽపి ......." మొ॥ ఉదాహరణములలో పెంచి పెద్దచేయబడిన విషవృక్షమైననూ స్వయముగా ఛేదించుటకు యోగ్యము కాదని అర్థము. "విషవృక్షోఽపి" అను శబ్దము "అసాంప్రతమ్" అను పదముతో అన్వయించును. "సాంప్రతమ్" అను నిపాతమునకు యుక్తమగునని అర్థము. అసాంప్రతమ్ అనగా యుక్తముకాదని అర్థము. ఇచ్చట సాంప్రతమ్, అపి అను నిపాతములచే విషవృక్షరూప కర్మ చెప్పబడిపోవుటచే ద్వితీయా విభక్తి రాదు.

## 7. తథాయుక్తం చానీప్సితమ్ (1-4-50)

**ఈప్సితతమవత్క్రియయా యుక్తమనీప్సితమపి కారకం కర్మసంజ్ఞం స్యాత్. గ్రామం గచ్ఛన్ తృణం స్పృశతి. ఓదనం భుఞ్జానో విషం భుఙ్క్తే.**

"తథాయుక్తం, చ, అనీప్సితమ్" అని పదచ్ఛేదము. ఈప్సితతమమువలె క్రియతో కూడుకొన్న అనీప్సితమగు (ఇష్టముకాని) కారకము కూడా కర్మసంజ్ఞ కలదియగును. "గ్రామం గచ్ఛన్ తృణం స్పృశతి" (గ్రామమునకు వెడుతూ గడ్డిపరకను స్పృశించుచున్నాడు) అను ఉదాహరణమందు స్పృశధాత్వర్థ క్రియతో కూడుకొన్న అనీప్సితమగు తృణము (గడ్డిపరక) ఈప్సితతమము కాకపోయిననూ, ఈ సూత్రముచేత కర్మసంజ్ఞ వచ్చి "తృణం" అను రూపం ఏర్పడింది. అలాగే " విషం భుఙ్క్తే " అను ఉదాహరణమందు (భోజనము చేస్తూ ఇష్టము కాకపోయిననూ ప్రస్తుత సూత్రముచేత కర్మసంజ్ఞ వచ్చును.

## 8. అకథితం చ (1-4-51)

**అపాదానాది విశేషైరవివక్షితం కారకం కర్మసంజ్ఞం స్యాత్.**
**దుహ్ యాచ్ పచ్ దణ్డ్ రుధి ప్రచ్ఛిచిబ్రూ శాసుజిమథ ముషామ్ ।**
**కర్మయుక్ స్యాదకథితం తథా స్యాన్నీహృకృష్వహామ్ ॥**

**దుహ్యాదీనాం ద్వాదశానాం. తథా నీప్రభృతీనాం చతుర్ణాం కర్మణా యద్యుజ్యతే తదేవాకథితం కర్మేతి పరిగణనం కర్తవ్యమిత్యర్థః. గాం దోగ్ధి పయః. బలిం యాచతే వసుధామ్. అవినీతం వినయం యాచతే. తణ్డులానోదనం పచతి. గర్గాన్ శతం దణ్డయతి. వ్రజమవరుణద్ధి గామ్. మాణవకం పన్థానం పృచ్ఛతి. వృక్షమవచినోతి ఫలాని. మాణవకం ధర్మం బ్రూతే శాస్తి వా. శతం జయతి దేవదత్తమ్. సుధాం క్షీరనిధిం మథ్నాతి. దేవదత్తం శతం ముష్ణాతి. గ్రామమజాం నయతి హరతి కర్షతి వహతి వా. అర్థనిబన్ధనేయం సంజ్ఞా. బలిం భిక్షతే వసుధామ్. మాణవకం ధర్మం భాషతే - అభిధత్తే-వక్తీత్యాది. కారకం కిమ్ ? మాణవకస్య పితరం పన్థానం పృచ్ఛతి.**

**(వా)"అకర్మకధాతుభిర్యోగే దేశః కాలో భావో గన్తవ్యోఽధ్వా చ కర్మసంజ్ఞక ఇతి వాచ్యమ్". కురూన్ స్వపితి మాసమాస్తే. గోదోహమాస్తే. క్రోశమాస్తే.**

**అకథితం చ** : అకథితం చ అని పదవిభాగము. అకథితం అనగా చెప్పబడనిది అని అర్థము. అపాదానాది విశేషములతో చెప్పబడని కారకము కర్మ సంజ్ఞ కలది అగునని సూత్రార్థము. అనగా అపాదానము, సంప్రదానము, అధికరణము మున్నగు విశేషములచే అకథితము అవివక్షితమగు కారకము కూడ కర్మసంజ్ఞకమగును. అపాదానత్వాదులును ఆయా విశేషరూపమున కాక సామాన్య సంబంధ మాత్రముగ వివక్షితములయినచో ఆయా కారకములు కర్మ సంజ్ఞకములగునని భావము. అపాదానాదులుగనే వివక్షించినచో వానికి కర్మసంజ్ఞ రాక అపాదానాది సంజ్ఞలే వచ్చును.

ఏయే ధాతువులు ప్రయోగించినపుడు అపాదానాదులు ఆపాదానాదులుగా వివక్షింపబడవో అట్టి పదహారు ధాతువులను వార్తికకారులు చెప్పియున్నారు. ఆ ధాతువులే " దుహ్యాచ్ ........ " అను శ్లోకమున సంగ్రహింపబడినవి.

దుహ్ (పితుకుట), యాచ్ (యాచించుట), పచ్ (వండుట), దండ్ (శిక్షించుట), రుధ్ (అడ్డుపెట్టుట), ప్రఛ్ (అడుగుట), చి (ఎంచుట), బ్రూ (పలుకుట), శాస్ (అనుశాసించుట), జి (జయించుట), మథ్ (చిలుకుట), ముష్ (దొంగిలించుట), నీ (తీసుకొనిపోవుట), హృ (తీసుకొనుట), కృష్ (గుంజుట, దున్నుట), వహ్ (తీసుకొనుట), మోయుట) ఈ పదహారు ధాతువుల కర్మతో ఏ అపాదానాదికము సంబంధము కలిగియుండునో అది అకథిత కర్మ అగును అని శ్లోకార్థము.

ఉదాహరణ : గాం దోగ్ధి పయః - గోవును పాలు పితుకుతున్నాడు అని అర్థము. దుహ్ ధాతువునకు పితుకుట అని అర్థము. ఇచట గోవు అపాదానము. గోవు నుండి



అని అర్థము. కాని గోవునందలి అపాదానత్వము వివక్షచేయనప్పుడు ప్రస్తుత సూత్రముచే అపాదానమగు గోశబ్దమునకు కర్మసంజ్ఞ రాగా " కర్మణి ద్వితీయా " అను సూత్రము చేత ద్వితీయా విభక్తి వచ్చి " గామ్ " అను రూపమేర్పడింది. అపాదానత్వమును వివక్ష చేసినట్లయితే " అపాదానే పంచమీ " అను సూత్రముచే గోశబ్దమునకు పంచమీ విభక్తి వచ్చి "గోః" అని ఉండును.

బలిం యాచతే వసుధామ్ - బలి నుండి భూమిని యాచించుచున్నాడు అని అర్థము. బలి యందలి అపాదానత్వము అవివక్షితము అగుటచే ప్రస్తుత సూత్రముచే బలి శబ్దమునకు కర్మ సంజ్ఞ రాగా " బలిం " అని ద్వితీయా విభక్తి వచ్చును.

తండులాన్ ఓదనం పచతి - బియ్యముతో అన్నము వండుచున్నాడు. ఇచట తండులములందలి అపాదానత్వము వివక్షితము కానందున ప్రస్తుత సూత్రముచే తండుల శబ్దమునకు కర్మసంజ్ఞ రాగా ద్వితీయ వచ్చినది.

గర్గాన్ శతం దండయతి - గర్గుల నుండి నూరు నాణెములను గ్రహించుచున్నాడు. ఇచట గర్గుల యందలి అపాదనత్వము చెప్పబడనందున గర్గశబ్దమునకు ప్రస్తుత సూత్రముచే కర్మసంజ్ఞ రాగా ద్వితీయా విభక్తి (గర్గాన్) వచ్చును.

వ్రజం అవరుణద్ధి గామ్ - పశువుల మందలో గోవును నిరోధించుచున్నాడు. వ్రజమునందలి అధికరణము (వ్రజమనగా పశువులలో) వివక్షితముకానందున వ్రజశబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చి ద్వితీయా విభక్తి వచ్చును.

మాణవకం పన్థానం పృచ్ఛతి - మాణవకునిచే మార్గమునకు తెలిసికోదలచుకున్నాడు. ఇట మాణవక శబ్దమునకు కర్మసంజ్ఞ, ద్వితీయా వచ్చును.

వృక్షమ్ అవచినోతి ఫలాని - వృక్షము నుండి ఫలములను కోయుట అను అపాదానత్వము వివక్షకానిచో వృక్షశబ్దమునకు కర్మసంజ్ఞ రాగా ద్వితీయా వచ్చినది.

మాణవకం ధర్మం బ్రూతే, శాస్తి - మాణవకుని కొరకు ధర్మము బోధించుచున్నాడు. ఇచ్చట మాణవక శబ్దమున సంప్రదానత్వము వివక్షితము కానందున కర్మసంజ్ఞ రాగా ద్వితీయా వచ్చును.

శతం జయతి దేవదత్తమ్ - దేవదత్తుని నుండి వంద నాణెములను గెలుచుచున్నాడు. దేవదత్త శబ్దమున అపాదానత్వము వివక్షితము కానందున కర్మసంజ్ఞ వచ్చి ద్వితీయా విభక్తి రూపమేర్పడును.

సుధాం క్షీరనిధిం మథ్నాతి – పాలసముద్రము నుండి అమృతమును చిలుకుచున్నాడు. క్షీరనిధిశబ్దమునకు కర్మసంజ్ఞ రాగా ద్వితీయా వచ్చును. దేవదత్తం శతం ముష్ణాతి – దేవదత్తుని నుండి వంద నాణెములను అపహరించుచున్నాడు. దేవదత్తశబ్దమునకు అపాదానత్వము వివక్షితం కానందున కర్మసంజ్ఞ వచ్చి ద్వితీయ రూపమేర్పడును.

గ్రామం అజాం నయతి – మేకను గ్రామమునకు తీసుకొనిపోవుచున్నాడు. ఇక్కడ గ్రామశబ్దమునకు కర్మసంజ్ఞ రాగా ద్వితీయా విభక్తి వచ్చును. అదేవిధముగా, హరతి, కర్షతి, వహతి అను క్రియారూపముల ప్రయోగమందు కూడ అపాదానాదులు వివక్షితముకానిచో గ్రామాది శబ్దములకు కర్మసంజ్ఞ మఱియు ద్వితీయా విభక్తి వచ్చును.

ఈ విధంగా దుహ్, యాచ్ అను పదహారు ధాతువులేగాక వాని సమాన అర్థములు గల పర్యాయ ధాతువులును ప్రయోగించినపుడు కూడ అపాదానాదులు అవివక్షితమైనచో కర్మసంజ్ఞ వచ్చును. ఉదాహరణకు " బలిం భిక్షతే వసుధామ్ " భిక్షధాతువు యాచ్ ధాతువునకు పర్యాయవాచకముగావున బలి శబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చును.

అలాగే మాణవకం ధర్మం భాషతే, అభిదత్తే అను ఉదాహరణములయందు బ్రూఞ్ ధాతువునకు సమానమైన భాష్, అభిధా, వచ్ ఇత్యాది ధాతువులు ప్రయోగింపబడినవి కావున మాణవకుని యందలి అపాదానత్వము అవివక్షితమగుటచే మాణవక శబ్దమునకు కర్మసంజ్ఞ విధింపబడును.

ఈ సూత్రముచేత కారకమునకే కర్మసంజ్ఞ విధింపబడుటచే "మాణవకస్య పితరం పన్థానం పృచ్ఛతి" అను ఉదాహరణమందు మాణవకునికి కర్మసంజ్ఞ ప్రవర్తించదు.

" అకర్మక ధాతుభిర్యోగే .......... " అను వార్తికము ఆధారంగా అకర్మకధాతువులతో సంబంధము ఉన్నప్పుడు దేశము, కాలము, భావము, గంతవ్య అధ్వ (చేరదగు మార్గము) కర్మసంజ్ఞ కలిగినవి అగును. స్వప, ఆస ధాతువులు అకర్మకములు. కనుక వాటితో సంబంధము ఉన్నప్పుడు " కురూన్ స్వపితి " అను ఉదాహరణమందు దేశవాచక కురు శబ్దమునకు, " మాసమాస్తే " అనుచోట భావ కాల వాచక మాస శబ్దమునకు, "క్రోశమాస్తే" అనుచోట గన్తవ్యాధ్వవాచక క్రోశ శబ్దమునకు ఈ వార్తికము చేత కర్మసంజ్ఞ సిద్ధించును.

## 9. గతిబుద్ధిప్రత్యవసానార్థశబ్దకర్మాకర్మణామణికర్తా స ణౌ (1-4-52)

**గత్యాద్యర్థానాం శబ్దకర్మణామకర్మకాణాం చాణౌ యః కర్తా స ణౌ కర్మ స్యాత్.**



**శత్రూనగమయత్స్వర్గం వేదార్థం స్వానవేదయత్ ।**
**ఆశయచ్చామృతం దేవాన్వేదమధ్యాపయద్విధిమ్ ॥**
**ఆసయత్సలిలే పృథ్వీం యః స మే శ్రీహరిర్గతిః ॥**

**' గతి ' ఇత్యాది కిమ్ ? పాచయత్యోదనం దేవదత్తేన. అణ్యన్తానాం కిమ్ ? గమయతి దేవదత్తో యజ్ఞదత్తం, తమపరః ప్రయుఙ్క్తే, గమయతి దేవదత్తేన యజ్ఞదత్తం విష్ణుమిత్రః.**

**(వా) నీవహ్యోర్న . నాయయతి, వాహయతి వా భారం భృత్యేన.**
**(వా) నియన్తృకర్తృకస్య వహేరనిషేధః. వాహయతి రథం వాహాన్సూతః.**
**(వా) ఆదిఖాద్యోర్న. ఆదయతి ఖాదయతి వా అన్నం వటునా.**
**(వా) భక్షేరహింసార్థస్య న. భక్షయత్యన్నం వటునా. " అహింసార్థస్య " కిమ్ ? భక్షయతి బలీవర్దాన్ సస్యమ్.**
**(వా) జల్పతిప్రభృతీనాముపసంఖ్యానమ్. జల్పయతి భాషయతి వా ధర్మం పుత్రం దేవదత్తః.**
**(వా) దృశేశ్చ. దర్శయతి హరిం భక్తాన్. సూత్రే జ్ఞానసామాన్యార్థానామేవ గ్రహణం, నతు తద్విశేషార్థానామిత్యనేన జ్ఞాప్యతే. తేన 'స్మరతి' 'జిఘ్రతి' ఇత్యాదీనాం న. స్మారయతి ఘ్రాపయతి వా దేవదత్తేన.**

**(వా) శబ్దాయతేర్న . శబ్దాయయతి దేవదత్తేన. ధాత్వర్థసంగృహీతకర్మత్వేనాకర్మకత్వాత్ప్రాప్తిః. యేషాం దేశకాలాదిభిన్నం కర్మ న సంభవతి తేఽత్రాకర్మకాః, న త్వవివక్షితకర్మాణోఽపి. తేన ' మాసమాసయతి దేవదత్తమ్ ' ఇత్యాదౌ కర్మత్వం భవతి. ' దేవదత్తేన పాచయతి' ఇత్యాదౌ తు న.**

**గతిబుద్ధిప్రత్యవసానార్థ శబ్దకర్మాకర్మాకాణామణికర్తా స ణౌ :-**

గతి-బుద్ధి-ప్రత్యవసానార్థ-శబ్ద కర్మాకర్మకాణామ్, అణికర్తా, సః, ణౌ అని పదవిభాగము.

**గతి బుద్ధి ప్రత్యవసానార్థాశ్చ శబ్దకర్మాణశ్చ అకర్మకాశ్చ గతిబుద్ధి ప్రత్యవసానార్థ శబ్దకర్మాకర్మకాః తేషాం గతిబుద్ధి ప్రత్యవసానార్థ శబ్దకర్మాకర్మకాణాం అని ద్వంద్వసమాసము. అణౌ కర్తా అణికర్తా అని సప్తమీతత్పురుష సమాసము.**

గతి అనగా గమనము. బుద్ధి, ప్రత్యవసానము అనగా భక్షణము. ఈ అర్థములు కలిగిన ధాతువులు, శబ్దము కర్మగా కలిగిన ధాతువులు, అకర్మకధాతువులు వీటితో

సంబంధము ఉండగా అణ్యంతావస్థలో (ణి ప్రత్యయము లేనిచో) ఏది కర్తో అది ణ్యంతావస్థలో (ణి ప్రత్యయము చేసినచో) కర్మసంజ్ఞ కలిగినది అగును.

1. **గత్యర్థకధాతువు** : 'శత్రవః స్వర్గమ్ అగచ్ఛన్' అని ణి ప్రత్యయము లేనప్పుడు శత్రు శబ్దార్థము కర్త. దానికి ణి ప్రత్యయావస్థ యందు అనగా 'అగమయన్' అను దానితో సంబంధము ఉన్నప్పుడు కర్మసంజ్ఞ వచ్చి, ద్వితీయ వచ్చి 'శత్రూన్' అని ఏర్పడి "శత్రూన్ అగమయత్ స్వర్గమ్" అని సిద్ధించును. ఇచ్చట "గమ్" గత్యర్థక ధాతువు.

2. **బుద్ధ్యర్థక ధాతువు** : 'స్వాన్ వేదార్థమ్ అవేదయత్' అను స్థలమందు విద్–ధాతువు జ్ఞానార్థక ధాతువు. స్వాన్ అనుచోట స్వశబ్దార్థమునకు కర్మసంజ్ఞ వచ్చినది.

3. **ప్రత్యవసానార్థక ధాతువు** : 'దేవాన్ అమృతమ్ ఆశయత్' అను స్థలమందు అశ్ ధాతువు భక్షణార్థక ధాతువు. ఇచ్చట దేవ శబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చినది.

4. **శబ్దకర్మక ధాతువు** : " విధిం వేదం అధ్యాపయత్ " అనుచోట అధిపూర్వక ఇఙ్ ధాతువును అధ్యయనము చేయుట అని అర్థము (ఇఙ్–అధ్యయనే). కావున ఆ ధాతువు శబ్దకర్మము. విధి శబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చినది.

5. **అకర్మకధాతుయోగము** : " పృథ్వీం సలిలే ఆసయత్ " అనుచోట ఆస ధాతువునకు 'ఉండుట' అని అర్థము. కావున ఇది అకర్మకము. పృథ్వీ శబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చినది.

" దేవదత్తేన ఓదనం పాచయతి " అను ప్రత్యుదాహరణమందు పచ ధాతువు గత్యాద్యర్థక ధాతువులలో చేరలేదు. కావున దేవదత్త శబ్దమునకు కర్మసంజ్ఞ రాదు.

అణ్యంతావస్థలో కర్తకే ణ్యంతావస్థలో ఈ పై సూత్రముచే కర్మసంజ్ఞ చెప్పబడినది. కావున "దేవదత్తః యజ్ఞదత్తం గమయతి" అని ణ్యంతావస్థలో కర్తయగు దేవదత్తునికి "దేవత్తేన యజ్ఞదత్తం గమయతి విష్ణుమిత్రః" అను ణ్యంతావస్థ గల ఉదాహరణ యందు కర్మసంజ్ఞ ప్రవర్తించదు.

**(వా) నీ వహ్యోర్న** : నీ, వహ్ అను ఈ రెండు ధాతువులతో సంబంధమునప్పుడు "గతి బుద్ధి .......... " అను సూత్రముచేత కర్మసంజ్ఞ రాదు.

నీ, వహ అనునవి ధాతువు గత్యర్థక ధాతువులు. కావున వాటితో సంబంధమున్నప్పుడు "నాయయతి వాహయతి వా భారం భృత్యేన " అను ఉదాహరణ మందు భృత్యునికి కర్మసంజ్ఞ " గతి బుద్ధి .......... " అను సూత్రముచే విధింపబడవలసి



యుండగ ప్రస్తుత వార్తికముచే నిషేధము చెప్పబడినది. అయితే "నియన్తృ" అనగా సారథి కర్తగా కల్గిన వహ ధాతువుతో సంబంధమున్నప్పుడు మాత్రము ఈ కర్మసంజ్ఞ నిషేధింపబడదు. " నియన్తృ కర్తృకస్య ........... " అను వార్తికము చేత పై నిషేధమునకు నిషేధము విధింపబడుచున్నది. దీనినే శాస్త్రములో ప్రతిప్రసవము అందురు. కావున " వాహాన్ రథం వాహయతి సూతః " అను ఉదాహరణమందు వాహ్ మొదలగు ధాతువులకు " నీ వహ్యోర్న " అనే వార్తికముచే నిషేధం చెప్పకుండ " గతి బుద్ధి ........... " అను సూత్రముచే కర్మసంజ్ఞ విధింపబడును.

**(వా) ఆదిఖాద్యోర్న** : అద, ఖాద అను ధాతువులతో సంబంధమున్నప్పుడు " గతి బుద్ధి ...." అను సూత్రముచే కర్మసంజ్ఞ రాదు. కావున " ఆదయతి ఖాదయతి వా అన్నం వటునా " అను స్థలమందు వటువు శబ్దమునకు "గతి బుద్ధి ........ " అను సూత్రముచే కర్మసంజ్ఞ ప్రసక్తమయినది. కాని ప్రస్తుత వార్తికము చేత నిషేధింపబడుచున్నది.

**(వా) భక్షేరహింసార్థస్య న** : అహింస అను అర్థాన్ని చెప్పే భక్ష అను ధాతువుతో సంబంధమున్నప్పుడు " గతి బుద్ధి ......... " అను సూత్రముచే కర్మ సంజ్ఞ ప్రవర్తించదు. కావున "భక్షయతి అన్నం వటునా" అను ఉదాహరణమందు వటువు అను శబ్దమునకు కర్మసంజ్ఞ విధింపబడదు. హింసార్థక భక్షధాతువుతో సంబంధమున్నప్పుడు మాత్రము "గతి బుద్ధి ..........." అను సూత్రముచే కర్మసంజ్ఞ ప్రవర్తించును. అందువల్లనే " బలీవర్దాన్ సస్యం భక్షయతి " అనుచోట హింసార్థకము కావడం చేత కర్మసంజ్ఞ వచ్చును.

**(వా) జల్పతిప్రభృతీనాముపసంఖ్యానమ్**: జల్పతి మొదలగు ధాతువులతో సంబంధమున్నప్పుడు అణ్యంతావస్థలో కర్త ణ్యంతావస్థలో కర్మసంజ్ఞ కలది యగును. " పుత్రం ధర్మం జల్పయతి భాషయతి వా దేవదత్తః " అను ఉదాహరణమందు పుత్ర శబ్దమునకు కర్మసంజ్ఞ విధించగ ద్వితీయా విభక్తి వచ్చినది.

**(వా) దృశేశ్చ** : దృశ ధాతువుతో సంబంధమున్నప్పుడు కూడా అణ్యంతావస్థలో కర్త ణ్యంతావస్థలో కర్మసంజ్ఞ కలది యగును. "దర్శయతి హరిం భక్తాన్" అను స్థలమందు భక్త శబ్దమునకు కర్మసంజ్ఞ మఱియు ద్వితీయా విభక్తి ప్రవర్తించినది. దృశిర్ – ప్రేక్షణే అను ధాతువు బుద్ధి విశేషమును తెలుపుతుంది. కావున " గతి బుద్ధి ...... " సూత్రముచేత కర్మ సంజ్ఞ ప్రవర్తించుచుండగా " దృశేశ్చ " అను వార్తికముచే మరల కర్మసంజ్ఞా విధానము వ్యర్థమయి ఈ విధముగా గుర్తుచేయును.

" గతి బుద్ధి ....... " సూత్రమందు బుద్ధ్యర్థక ధాతువులనగా జ్ఞాన సామాన్యార్థక ధాతువులనే గ్రహించవలెను కాని విశేషార్థక ధాతువులుగా కాదని భావము. అందువలన జ్ఞాన విశేషార్థకములైన స్మృ, ఘ్రా మొదలగు ధాతువులతో సంబంధమున్నప్పుడు "స్మారయతి ఘ్రాపయతి వా దేవదత్తేన " ఇత్యాదులందు దేవదత్తాది శబ్దమునకు కర్మసంజ్ఞ రాదు.

**(వా) శబ్దాయతేర్న** : శబ్దం కరోతి అను అర్థమందు క్యఙ్ ప్రత్యయాన్త శబ్దాయ ధాతువుతో సంబంధమున్నప్పుడు "గతి బుద్ధి .......... " అను సూత్రము రాదు. అందువలన "దేవదత్తేన శబ్దాయయతి " అను స్థలమందు దేవదత్త శబ్దమునకు కర్మసంజ్ఞ రాదు. ఇచ్చట శబ్దరూప కర్మ ధాత్వర్థముచే సంగ్రహింపబడుటవలన మరొక కర్మ ఏమీ లేకపోవుటచే శబ్దాయ ధాతువు అకర్మక ధాతువు. కావున అకర్మక ధాతు యోగమును పురస్కరించుకొని ఇచ్చట " గతి బుద్ధి ........ " సూత్రముచే కర్మసంజ్ఞ ప్రవర్తించినది.

" గతి బుద్ధి ....... " సూత్రమందు అకర్మక ధాతువులనగా వేటికి దేశము, కాలము మొదలగు వానికంటే కర్మ వేరే ఏదీ సంభవించదో ఆ ధాతువులే అని అర్థము. అంతేకాని కర్మ వివక్ష చేయబడని ధాతువులు కూడా అకర్మక ధాతువులని అర్థము కాదు. అందువలన " మాసమాసయతి దేవదత్తం " అను ఉదాహరణ యందు మాసరూప (కాలము) కర్మ కలిగిన ఆసధాతువుతో కూడ చెప్పబడినప్పుడు దేవదత్త శబ్దమునకు కర్మసంజ్ఞ విధింపబడినది. ఎందువలననగా ఆసధాతువు మనము వర్ణించినట్లుగా అకర్మక ధాతువు అయినది. ఓదనాది కర్మ వివక్ష చేయబడకపోయినప్పటికిని పచధాతువును అకర్మక ధాతువుగా గ్రహించకపోవుటచే "దేవదత్తేన పాచయతి" మొదలగు స్థలమందు కర్మసంజ్ఞ చెప్పబడలేదు.

## 10. హృక్రోరన్యతరస్యామ్ (1-4-53)

**హృక్రోరణౌ యః కర్తా స ణౌ వా కర్మసంజ్ఞః స్యాత్. హారయతి కారయతి వా భృత్యం - భృత్యేన వా కటమ్.**

(వా) **అభివాదిదృశోరాత్మనేపదే వేతి వాచ్యమ్. అభివాదయతే దర్శయతే దేవం భక్తం భక్తేన వా.**



**హృక్రోరన్యతరస్యామ్** : హృక్రోః, అన్యతరస్యామ్ అని పదచ్ఛేదము. అన్యతరస్యామ్ అనగా వికల్పము అని అర్థము. హృ, కృ అను ఈ రెండు ధాతువులతో సంబంధము ఉన్నప్పుడు అణ్యంతావస్థలో కర్త ణ్యంతావస్థలో వికల్పముగా కర్మసంజ్ఞ కలది యగును. " హారయతి కారయతి వా భృత్యం భృత్యేన వా కటమ్ " అను స్థలమందు భృత్య శబ్దమునకు కర్మసంజ్ఞ ప్రవర్తించినది. కర్మసంజ్ఞ వచ్చినప్పుడు ద్వితీయా విభక్తి, కర్మసంజ్ఞ రానప్పుడు కర్తృ అర్థంలో తృతీయా విభక్తి ప్రవర్తించినవి.

**(వా) అభివాది దృశోరాత్మనేపదే వేతి వాచ్యమ్** : ఆత్మనేపదులగు అభిపూర్వక వద ధాతువు, దృశ ధాతువులతో సంబంధమున్నప్పుడు అణ్యంతావస్థలో కర్తృణ్యంతావస్థలో వికల్పముగా కర్మసంజ్ఞ కలది యగును. " అభివాదయతే దర్శయతే దేవం భక్తం భక్తేన వా " అను స్థలమందు ప్రస్తుత వార్తికముచే భక్త శబ్దమునకు వికల్పముగా కర్మసంజ్ఞ విధింపబడును.

## 11. అధిశీఙ్స్థాసాం కర్మ (1-4-46)

**అధిపూర్వాణామేషామాధారః కర్మ స్యాత్. అధిశేతే, అధితిష్ఠతి, అధ్యాస్తే వా వైకుంఠం హరిః.**

**అధిశీఙ్స్థాऽऽసాం కర్మ** : అధిశీఙ్ స్థాసాం, కర్మ అని పదచ్ఛేదము. "ఆధారోఽధికరణమ్" అను సూత్రము నుండి " ఆధారః " అనుపదము అనువర్తించును. అధి అను ఉపసర్గ పూర్వకమైన శీఙ్, స్థా ఆస అనే మూడు ధాతువులకు ఆధారమైన శబ్దమునకు కర్మసంజ్ఞ వచ్చును. "అధిశేతే వైకుంఠం హరిః, అధితిష్ఠతి వైకుంఠం హరిః, అధ్యాస్తే వైకుంఠం హరిః" అనునవి క్రమముగా ఉదాహరణములు. వైకుంఠము ఆధారము గావున దానికి కర్మసంజ్ఞ వచ్చి ద్వితీయా విభక్తి వచ్చినది.

## 12. అభినివిశశ్చ (1-4-47)

**అభినీత్యేతత్సంఘాతపూర్వస్య విశతేరాధారః కర్మ స్యాత్.**

**అభినివిశతే సన్మార్గమ్. " పరిక్రయణే సంప్రదానమ్ " ఇతి సూత్రాదిహ మణ్డూకప్లుత్యా అన్యతరస్యాం గ్రహణమ్ అనువర్త్య వ్యవస్థితవిభాషాశ్రయణాత్ క్వచిన్న. పాపేऽభినివేశః.**

**అభినివిశశ్చ** : అభినివిశః, చ అని పదచ్ఛేదము. అభి, ని అను ఉపసర్గ ద్వయపూర్వకమైన విశధాతువు యొక్క ఆధారమునకు కర్మసంజ్ఞ వచ్చును. " అభినివిశతే సన్మార్గమ్ " అను నపుడు సన్మార్గమనే ఆధారమునకు కర్మసంజ్ఞ వచ్చినది. " పరిక్రయణే సంప్రదానమన్యతరస్యామ్ " అను సూత్రము నుండి మండూకప్లుతితో అన్యతరస్యాం అను పదము అనువర్తించినది. (మండూకప్లుతి అనగా కప్పగంతు అని అర్థము. అనగా మధ్యలో కొన్ని సూత్రములలో అనువృత్తి లేక తదనంతర సూత్రములలో అనువర్తించుట అని చెప్పవచ్చును.)

అన్యతరస్యాం అనగా వికల్పము అని అర్థము. ఈ వికల్పము కూడా వ్యవస్థిత విభాషగా ఆశ్రయింపబడినది. (వ్యవస్థిత విభాష అనగా కొన్నిచోట్ల ప్రవర్తించకపోవుట అని అర్థము) ప్రస్తుత " అభినివిశశ్చ " అను సూత్రము కొన్నిచోట్ల ప్రవర్తించకుండుటచే " పాపే అభినివేశః " అను నపుడు పాపశబ్దమునకు కర్మసంజ్ఞ రాలేదు.

## 13. ఉపాన్వధ్యాఙ్వసః (1-4-48)

**ఉపాదిపూర్వస్య వసతేరాధారః కర్మ స్యాత్. ఉపవసతి, అనువసతి, అధివసతి, ఆవసతి వా వైకుంఠం హరిః.**

**(వా) అభుక్త్యర్థస్య న. వనే ఉపవసతి.**

**(వా) ఉభసర్వతసోః కార్యా ధిగుపర్యాదిషు త్రిషు ।**
**ద్వితీయాఽఽమ్రేడితాన్తేషు తతోఽన్యత్రాపి దృశ్యతే ॥**

**ఉభయతః కృష్ణం గోపాః. సర్వతః కృష్ణమ్. ధిక్ కృష్ణాభక్తమ్. ఉపర్యుపరి లోకం హరిః. అధ్యధిలోకమ్. అధోఽధో లోకమ్.**

**(వా) అభితః పరితః సమయా నికషా హాప్రతియోగేఽపి. అభితః కృష్ణమ్. పరితః కృష్ణమ్. గ్రామం సమయా. నికషా లఙ్కామ్. హా కృష్ణాభక్తమ్. తస్య శోచ్యతే ఇత్యర్థః. బుభుక్షితం న ప్రతిభాతి కించిత్.**

**ఉపాన్వధ్యాఙ్వసః** : ఈ సూత్రము ఏకపదము. ఉప, అను, అధి, ఆఙ్ అను నాలుగు ఉపసర్గలు పూర్వముగా గల వసధాతువు యొక్క ఆధారమునకు కర్మసంజ్ఞ వచ్చును. "ఉపవసతి వైకుంఠం హరిః, అనువసతి వైకుంఠం హరిః అధివసతి వైకుంఠం హరిః ఆవసతి వైకుంఠం హరిః" అను ఉదాహరణములందు వైకుంఠరూప ఆధారమునకు కర్మసంజ్ఞ వచ్చినది.



**(వా) అభుక్త్యర్థస్య న.** భోజన నివృత్తి వాచక వసధాతువు యొక్క ఆధారమునకు కర్మసంజ్ఞ రాదు. " వనే ఉపవసతి " అనగా వనమందు ఉపవాసము చేయుచున్నాడు, అనగా నిరాహారుడు అని అర్థము. కావున ఈ ఉదాహరణమందు కర్మసంజ్ఞకు బదులు అధికరణసంజ్ఞ మరియు సప్తమీ విభక్తి ప్రవర్తించినవి.

**ఉభసర్వతసోః కార్యా ధిగుపర్యాదిషు త్రిషు** : ఉపపద – విభక్తులు చెప్పబడు చున్నాయి.

1. **ఉభసర్వతసోః కార్యా** : " తస్ " ప్రత్యయాంతములగు ఉభ, సర్వ శబ్దములను ప్రయోగించినపుడు ద్వితీయా విభక్తి వచ్చును. ఉభయతః, సర్వతః అనునవి ఉభ, సర్వశబ్దములకు " తస్ " ప్రత్యయము చేర్చగా ఏర్పడినవి. కావున ఉభయతః కృష్ణం గోపాః, సర్వతః కృష్ణమ్ అను ఉదాహరణములయందు కృష్ణశబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చి కృష్ణం అను రూపమేర్పడినది.

2. **ధిక్** : ధిక్ శబ్దమును ప్రయోగించినప్పుడు ద్వితీయా విభక్తి వచ్చును. " ధిక్ కృష్ణాభక్తం " అనునది ఉదాహరణము. ధిక్ శబ్దము నిందావాచకము. కృష్ణభక్తుడు కాని వానియందు నిందయని అర్థము.

3. **ఉపర్యాదిషు త్రిషు ద్వితీయాఽమ్రేడితాన్తేషు** : ఉపరి, అధి, అధస్ అను మూడు ఆమ్రేడితములు అన్తమందుగా కలిగినపుడు అనగా ద్వివచనము చేయబడిన పై మూడు శబ్దములు ప్రయోగింపబడినప్పుడు ద్వితీయా విభక్తి వచ్చును. "తస్య పరమామ్రేడితమ్" అను సూత్రము చేత ద్విరుక్తము (మరల మరల చెప్పబడినచో) యొక్క పరరూపమునకు అనగా రెండవ పదమునకు ఆమ్రేడిత సంజ్ఞ విధింపబడును. అదే విధంగా " ఉపర్యుపరి లోకం హరిః " అను ఉదాహరణమందు " ఉపరి " శబ్దము రెండుసార్లు ఉచ్చరించబడినది. కావున లోకశబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చి లోకం అను రూపమేర్పడినది. అదేవిధంగా "అధ్యధిలోకమ్, అధోఽధో లోకమ్" అను ఉదాహరణములందు కూడా లోక శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

**అభితః పరితః సమయా నికషా హాప్రతియోగేఽపి** : అభితః, పరితః, సమయా, నికషా, హా, ప్రతి, మొదలగు వాటితో సంబంధము ఉన్నప్పుడు కూడా ద్వితీయా విభక్తి వచ్చును. "అభితః కృష్ణమ్, గ్రామం సమయా, నికషా లఙ్కామ్, హా కృష్ణాభక్తమ్" అను ఉదాహరణములందు అభితః, సమయా, నికషా మొదలగు వాని సంబంధము చేత కృష్ణ, గ్రామ, లఙ్కా మొదలగు శబ్దములకు ద్వితీయా విభక్తి వచ్చినది. 'హా' అను అవ్యయమ్ము ఖేదము (విచారము) అను అర్థము గలది. కనుక హా కృష్ణాభక్తమ్ అను ప్రయోగమందు కృష్ణభక్తుడు కాని వాని గూర్చి అన్వయించే శోకము అని అర్థము.

## 14. అన్తరాఽన్తరేణ యుక్తే (2-3-4)

**అభ్యాం యోగే ద్వితీయా స్యాత్. అన్తరా త్వాం మాం హరిః. అన్తరేణ హరిం న సుఖమ్.**

ఏకపదమీ సూత్రము. అన్తరా, అన్తరేణ ఈ రెండు అవ్యయములతో యోగము ఉండగా ద్వితీయా విభక్తి వచ్చును. " అన్తరా త్వాం మాం హరిః " అను ఉదాహరణమందు అన్తరాయోగముచేత యుష్మద్, అస్మద్ శబ్దములకు ద్వితీయా విభక్తి వచ్చినది. అట్లే "అన్తరేణ హరిం న సుఖమ్" అను ఉదాహరణమందు అన్తరేణ అను పదముతోనున్న హరి శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

## 15. కర్మప్రవచనీయాః (1-4-83)

**ఇత్యధికృత్య.**

ఇది అధికార సూత్రము. " అధిరీశ్వరే " అను సూత్రము వరకు ఈ సూత్రము అధికృతమగును.

## 16. అనుర్లక్షణే (1-4-84)

**లక్షణే ద్యోత్యేఽనురుక్తసంజ్ఞః స్యాత్. గత్యుపసర్గసంజ్ఞాపవాదః.**

**అనుర్లక్షణే** : అనుః, లక్షణే అని పదచ్ఛేదము. లక్షణమనగా లక్ష్య లక్షణ భావ సంబంధము. అది ద్యోత్యమయినప్పుడు " అను " శబ్దము కర్మ ప్రవచనీయసంజ్ఞ కలది అగును. గతి సంజ్ఞ, ఉపసర్గ సంజ్ఞలను బాధించి ఈ సూత్రము ప్రవర్తించును.

## 17. కర్మప్రవచనీయయుక్తే ద్వితీయా (2-3-8)

**ఏతేన యోగే ద్వితీయా స్యాత్. "పర్జన్యో జపమను ప్రావర్షత్". హేతుభూత జపోపలక్షితం వర్షణమిత్యర్థః. పరాపి " హేతౌ " తృతీయా అనేన బాధ్యతే. "లక్షణేత్థంభూత" ఇత్యాదినా సిద్ధే పునః సంజ్ఞావిధానసామర్థ్యాత్.**

**కర్మప్రవచనీయయుక్తే ద్వితీయా** : కర్మ ప్రవచనీయ యుక్తే, ద్వితీయా అని పదచ్ఛేదము. కర్మ ప్రవచనీయములతో సంబంధము ఉన్నప్పుడు ద్వితీయా విభక్తి వచ్చును. " పర్జన్యో జపమనుప్రావర్షత్ " అని ఉదాహరణము. (జపమునననుసరించి మేఘము వర్షించినది అని అర్థము) జపము లక్షణము వర్షమునకు కారణమయినందున వర్షము లక్ష్యము.



లక్షణము (చిహ్నము) ద్యోత్యమయినందున అను శబ్దమునకు " అనుర్లక్షణే " అను సూత్రము చేత కర్మ ప్రవచనీయ సంజ్ఞ వచ్చి, జప శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది. వర్షణ మందు జపము హేతువు గావున " హేతౌ " అను సూత్రము చేత తృతీయా విభక్తి ప్రాప్తించినది. అది ప్రస్తుత కర్మ ప్రవచనీయ సంజ్ఞా ప్రయుక్త ద్వితీయా విభక్తి చేత బాధింపబడును. ఈ విషయములో ప్రమాణము " లక్షణేత్థం భూత " అను సూత్రము చేతనే కర్మ ప్రవచనీయ సంజ్ఞ సిద్ధించుచుండగా మరల "అనుర్లక్షణే" అను సూత్రము చేత సంజ్ఞా విధానమే.

## 18. తృతీయార్థే (1-4-85)

**అస్మిన్ ద్యోత్యే అనురుక్త సంజ్ఞః స్యాత్. నదీమన్వవసితా సేనా. నద్యా సహ సంబద్ధేత్యర్థః. ' షిఞ్ బన్ధనే ' క్తః.**

**తృతీయార్థే** : తృతీయార్థము ద్యోత్యమయినపుడు " అను " శబ్దము కర్మప్రవచనీయ సంజ్ఞ కలది యగును. " నదీమన్వవసితా సేనా " అని ఉదాహరణ. అనగా, నదితో కూడుకొన్నది సేన అని అర్థము. అను, అవ అను ఉపసర్గద్వయపూర్వక " షిఞ్ బన్ధనే " అను ధాతువునకు క్త ప్రత్యయముచేర్చగా అన్వవసితా అను శబ్దమేర్పడినది. ఇచ్చట తృతీయార్థము ద్యోత్యమయినందున " అను " శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ మఱియు నదీ శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

## 19. హీనే (1-4-86)

**హీనే ద్యోత్యే అనుః ప్రాగ్వత్. అను హరిం సురాః, హరేర్హీనా ఇత్యర్థః.**

**హీనే** : హీనార్థము ద్యోత్యమయినప్పుడు " అను " శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చును. " అను హరిం సురాః " హరికంటే హీనులని అర్థము. ' అను ' శబ్దమునకు కర్మ ప్రవచనీయ సంజ్ఞ వచ్చి దానితో కూడ ఉన్న హరి శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

## 20. ఉపోఽధికే చ (1-4-87)

**అధికే హీనే చ ద్యోత్యే ఉపేత్యవ్యయం ప్రాక్సంజ్ఞం స్యాత్. అధికే సప్తమీ వక్ష్యతే. హీనే – ఉప హరిం సురాః.**

**ఉపోఽధికే చ :** అధికము, హీనము ఈ అర్థములు ద్యోత్యమయినప్పుడు " ఉప " అను అవ్యయమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చును. ఆధిక్యార్థమందు సప్తమీ విభక్తి చెప్పబడును. ఉప హరిం సురాః అనునది హీనార్థమునకు ఉదాహరణము. హరి కంటే హీనులని అర్థము.

## 21. లక్షణేత్థంభూతాఖ్యానభాగవీప్సాసు ప్రతిపర్యనవః (1-4-90)

**ఏష్వర్థేషు విషయభూతేషు ప్రత్యాదయ ఉక్తసంజ్ఞాః స్యుః. లక్షణే-వృక్షం ప్రతి, పరి, అను వా విద్యోతతే విద్యుత్. ఇత్థంభూతాఖ్యానే – భక్తో విష్ణుం ప్రతి, పరి, అను వా. భాగే – లక్ష్మీర్హరిం ప్రతి, పరి, అను వా. హరేర్భాగ ఇత్యర్థః. వీప్సాయాం – వృక్షం వృక్షం ప్రతి, పరి, అను వా సిఞ్చతి. అత్రోపసర్గత్వాభావాన్న షత్వమ్. ఏషు కిమ్ ? పరిషిఞ్చతి.**

**లక్షణేత్థంభూతాఖ్యానభాగవీప్సాసు ప్రతిపర్యనవః :** ఈ సూత్రము లక్షణము, ఇత్థంభూతాఖ్యానము అని పదచ్ఛేదము. అయినప్పటికి భాగము, వీప్స (ద్విరుక్తి) అర్థములలో ప్రతి, పరి, అను ఈ మూడు కర్మప్రవచనీయ సంజ్ఞ కలవి అగును.

**లక్షణము :** " వృక్షం ప్రతి పరి అను వా విద్యోతతే విద్యుత్ " అనునది వృక్ష ప్రకాశము చేత విద్యుత్ (మెరుపు) జ్ఞానము కల్గుచున్నది. లక్షణార్థమందు ప్రతి, పరి, అను లకు కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చి, వృక్ష శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

**ఇత్థంభూతాఖ్యానము :** ఇత్థంభూతాఖ్యానము అనగా ఈ విధంగా అయినట్లు చెప్పడమే అని అర్థము." భక్తో విష్ణుం ప్రతి, పరి, అను వా " అను ఇత్థంభూతాఖ్యానమందు ప్రతి, పరి, అనులకు కర్మ ప్రవచనీయ సంజ్ఞ వచ్చి, విష్ణు శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

**భాగము :** " లక్ష్మీః హరిం ప్రతి, పరి, అను వా" అనగా లక్ష్మీ దేవి హరి యొక్క భాగమని అర్థము. భాగార్థమునందు ప్రతి, పరి, అనులకు కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చి, హరి శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

**వీప్సము :** వీప్సము అనగా ద్విరుక్తి అని (రెండుసార్లు చెప్పుట) అర్థము. వృక్షం వృక్షం ప్రతి, పరి, అను వా సిఞ్చతి. అనగా ఒక్కొక్క వృక్షమును తడుపుచున్నాడు అని అర్థము. ఇచ్చట వృక్ష శబ్దము ద్విరుక్తము. కావున వీప్సార్థమందు ప్రతి, పరి, అను లకు కర్మ ప్రవచనీయ సంజ్ఞ వచ్చి, వృక్ష శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

కర్మ ప్రవచనీయ సంజ్ఞ చేత ఉపసర్గ సంజ్ఞ బాధింపబడుటచే పైఉదాహరణములలో ప్రతి సిఞ్చతి. అను సిఞ్చతి అను రూపములందు ఉపసర్గయోగమందు విధింపబడిన 'షత్వము' ప్రవర్తించలేదు.



లక్షణము మొదలగు అర్థములు భాసించినప్పుడు ఈ కర్మప్రవచనీయ సంజ్ఞ ప్రవర్తించదు. కావున పరిషిఞ్చతి మొదలగు ఉదాహరణములందు ఉపసర్గసంజ్ఞా ప్రయుక్తమున ' షత్వము' ప్రవర్తించును. కేవలము 'పరిషిఞ్చతి' అని ఉన్నప్పుడు పరి ఉపసర్గము కావున షత్వము వచ్చును.

## 22. అభిరభాగే (1-4-91)

**భాగవర్జే లక్షణాదౌ అభిరుక్తసంజ్ఞః స్యాత్. హరిమ్ అభివర్తతే. భక్తో హరిమభి. దేవం దేవమభి సించతి. అభాగే కిమ్ ? యదత్ర మమాభిష్యాత్తద్దీయతామ్.**

**అభిరభాగేః –** అభిః, అభాగే అని పదచ్ఛేదము. భాగము తప్ప మిగిలిన మూడు అర్థములందు " అభి " అనునది కర్మప్రవచనీయ సంజ్ఞ కలది అగును. " హరిమభివర్తతే ", " భక్తో హరిమభి ", " దేవం దేవమభిషించతి " అనునవి ఉదాహరణములు. పైన పేర్కొన్నట్లుగా భాగార్థమందు ఈ సూత్రము ప్రవర్తించదు. కావున " యదత్ర మమాభిష్యాత్ తత్ దీయతామ్ " (నా భాగము ఏది ఇచ్చట కలదో అది ఇవ్వవలసినది) అను ఉదాహరణమందు " అభి " అను దానికి కర్మప్రవచనీయసంజ్ఞ రాదు. ఉపసర్గ సంజ్ఞ ఉండును గావున తత్ప్రయుక్త షత్వము వచ్చును.

## 23. అధిపరీ అనర్థకౌ (1-4-93)

**ఉక్తసంజ్ఞౌ స్తః. కుతోఽధ్యాగచ్ఛతి, కుతః పర్యాగచ్ఛతి. గతిసంజ్ఞాబాధాత్ గతిర్గతావితి నిఘాతో న.**

**అధిపరీ అనర్థకౌ :** ద్విపదము ఈ సూత్రము. ప్రత్యేకముగా (ధాత్వర్థము తప్ప) అర్థమేమీలేని అధి, పరి అనునవి కర్మప్రవచనీయసంజ్ఞ కలవి అగును. కుతః అధ్యాగచ్ఛతి, కుతః పర్యాగచ్ఛతి అనునవి అధి, పరి అనువానికి వరుసగా ఉదాహరణములు. కర్మప్రవచనీయ సంజ్ఞ చేత గతిసంజ్ఞ బాధింపబడుట వలన " గతిర్గతౌ " అను సూత్రము చేత విధింపబడిన అనుదాత్త స్వరము రాదు.

## 24. సుః పూజాయామ్ (1-4-94)

**సుసిక్తమ్. సుస్తుతమ్. అనుపసర్గత్వాన్న షః. పూజాయాం కిమ్ ? సుషిక్తం కింస్యాత్ తవాత్ర. క్షేపోऽయమ్.**

**సుః పూజాయామ్** : ద్విపదమీ సూత్రము. పూజార్థమందు " సు " కర్మప్రవచనీయసంజ్ఞ కలది యగును.

సుసిక్తమ్ (బాగుగా తడుపబడినది), సుస్తుతమ్ (బాగుగా స్తుతింపబడినది) అను ఉదాహరణముల యందు " సు " అను దానికి కర్మప్రవచనీయ సంజ్ఞ చేత ఉపసర్గ సంజ్ఞ బాధింపబడుటచే ధాతుగత సకారమునకు షత్వము రాదు. పూజార్థమందే ఈ సూత్రము ప్రవర్తించును. కావున " సుషిక్తం కిం స్యాత్ తవాత్ర " (నీవు బాగా తడిపినను, నీకు ప్రయోజనమేమి ?) అను ఉదాహరణమందు క్షేపమే (నిందయే) గమ్యమానమగుటచే కర్మప్రవచనీయ సంజ్ఞ ప్రవర్తించదు. ఉపసర్గ సంజ్ఞనే ఉండును కనుక షత్వము సిద్ధించును.

## 25. అతిరతిక్రమణే చ (1-4-95)

**అతిక్రమణే పూజాయాం చాతిః కర్మప్రవచనీయసంజ్ఞః స్యాత్. అతి దేవాన్ కృష్ణః.**

**అతిరతిక్రమణే చ** : అతిః, అతిక్రమణే, చ అని పదచ్ఛేదము. చకారముచేత పూజార్థమును కూడా గ్రహించవలెను. అతిక్రమణము, పూజ ఈ అర్థములయందు " అతి " అనునది కర్మప్రవచనీయసంజ్ఞ కలది యగును. " అతిదేవాన్ కృష్ణ " అనునది. ఉదాహరణము. ప్రపంచసంరక్షణ మందు దేవతల కంటే కృష్ణుడు అధికుడు అనిలేదా దేవతలకు పూజ్యుడు కృష్ణుడు అని అర్థము. " అతి " అనుదానికి ఈ సూత్రముచే కర్మప్రవచనీయసంజ్ఞ చెప్పబడుటచే దేవ శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది.

## 26. అపిః పదార్థసంభావనాऽన్వవసర్గగర్హాసముచ్చయేషు (1-4-96)

**ఏషు ద్యోత్యేష్వపిరుక్తసంజ్ఞః స్యాత్. సర్పిషోऽపి స్యాత్. అనుపసర్గత్వాన్న షః. సంభావనాయాం లిఙ్. తస్యా ఏవ విషయభూతే భవనే కర్తృదౌర్లభ్యప్రయుక్తం దౌర్లభ్యం ద్యోతయన్నపిశబ్దః స్యాదిత్యనేన సంబధ్యతే. సర్పిష ఇతి షష్ఠీ తు అపి శబ్ద బలేన గమ్యమానస్య బిన్దోరవయవావయవిభావసంబంధే. ఇయమేవ హ్యపిశబ్దస్య పదార్థ ద్యోతకతా నామ.**



**ద్వితీయా తు నేహ ప్రవర్తతే. సర్పిషో బిన్దునా యోగో న త్వపినేత్యుక్తత్వాత్. అపి స్తుయాద్విష్ణుమ్. సంభావనం శక్త్యుత్కర్షమావిష్కర్తు మత్యుక్తిః. అపి స్తుహి. అన్వవసర్గః. కామచారానుజ్ఞా. ధిగ్దేవదత్తమ్. అపి స్తుయాత్ వృషలమ్. గర్హా అపి సిఞ్చ, అపి స్తుహి. సముచ్చయే.**

**అపిః పదార్థసంభావనాऽన్వవసర్గగర్హాసముచ్చయేషు** : ద్విపదమీసూత్రము. "అపిః" మొదటి పదము, " పదార్థసంభావనాऽన్వవసర్గగర్హాసముచ్చయేషు" అనునది రెండవ పదము.

పదార్థము, సంభావనము, అన్వవసర్గము, గర్హ, సముచ్చయము ఈ అర్థములు ఉన్నప్పుడు " అపిః " అనుదానికి కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చును.

1. **పదార్థమందు** : ఉచ్చరింపబడని పదము యొక్క అర్థము పదార్థము. "సర్పిషోऽపి స్యాత్" అనునది ఉదాహరణ. నేతిబొట్టయినా కలదా అని అర్థము. మిక్కిలి దుర్లభమగుటచే చాలా కొద్దిగా నెయ్యి భోజనము చేయువారికి వడ్డించు సందర్భంలో పరిహాసము కొరకు ప్రయోగింపబడినది ఈ వాక్యము.

ఈ ప్రయోగ మందు " అపి " అనుదానికి కర్మప్రవచనీయ సంజ్ఞచే ఉపసర్గ సంజ్ఞ బాధింపబడుటచే షత్వము రాదు. సంభావనార్థమందు "లిఙ్" లకారము వచ్చి "స్యాత్ " రూపము ఏర్పడినది. అసధాతువునకు భవనము (ఉండుట) అర్థము. సంభావనము యొక్క విషయమగు భవనమందు కర్తృ (నేతిబొట్టు కర్త) దౌర్లభ్య ప్రయుక్త దౌర్లభ్యమును అపి శబ్దము ద్యోతన చేయుచూ స్యాత్ అను లిఙన్త క్రియతో సంబంధించును. అపి శబ్దముచేత సర్పిస్సు యొక్క బిందువు గమ్యమానమగును. " సర్పిష : " అని షష్ఠీ విభక్తికి అవయవావయవిభావ సంబంధము అర్థము. సర్పిస్సుకు బిందువుతోనే సంబంధము కాని అపి శబ్దముతో సంబంధము లేనందున సర్పిష్ శబ్దమునకు ద్వితీయ విభక్తి రాదు.

2. **సంభావనాయందు** : "అపి స్తుయాత్ విష్ణుమ్" అనునది ఉదాహరణ. వాఙ్మనోగోచరుడు కాని విష్ణువు కూడా స్తుతింపశక్యుడని అర్థము. వాఙ్మనోగోచరుడు గాని విష్ణువును స్తుతించుట ఎవరికీ శక్యము గాదు. కావున శక్త్యుత్కర్షను ఆవిష్కరించుటకు అత్యుక్తియే సంభావనము.

**3. అన్వవసర్గమందు** : అన్వవసర్గమనగా కామాచారానుజ్ఞ అని అర్థము. "అపి స్తుహి" అనునది ఉదాహరణ. స్తుతించు లేక స్తుతించకు నీ ఇష్టానుసారము చేయుమని అర్థము.

**4. గర్హార్థమందు** : " ధిగ్దేవదత్తమ్ అపిస్తుయాత్ వృషలమ్ " అనునది ఉదాహరణ, వృషలుడు అనగా శూద్రుడు. శూద్రుని స్తుతించుట నింద్యమను అర్థమును 'అపి ' శబ్దము తెలుపును. " ధిగ్దేవదత్తమ్ " అనునది ఆ నిందకు అనువాదకము.

**5. సముచ్చయమందు** : "అపి సిఞ్చ, అపి స్తుహి" అనునది ఉదాహరణ. తడుపుము, స్తుతించుము అని అర్థము. ఇచ్చట క్రియాద్వయసముచ్చయము భాసించుట వలన అపి శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞచేత ఉపసర్గ సంజ్ఞ బాధించబడినది. అందువలన ధాతుద్వయగత సకారమునకు షత్వము రాలేదు.

## 27. కాలాధ్వనోరత్యన్తసంయోగే (2-3-5)

**ఇహ ద్వితీయా స్యాత్. మాసం కల్యాణీ. మాసమధీతే. మాసం గుడధానాః. క్రోశం కుటిలా నదీ. క్రోశమధీతే. క్రోశం గిరిః. అత్యన్తసంయోగే కిమ్ ? మాసస్య ద్విరధీతే. క్రోశస్యైకదేశే పర్వతః.**

**కాలాధ్వనోరత్యన్త సంయోగే** : కాలాధ్వనోః అత్యన్త సంయోగే అని పదచ్ఛేదము. కాలము మరియు అధ్వము (మార్గము) ల యొక్క అత్యన్త సంయోగరూపమను అర్థమందు కాలాధ్వవాచక శబ్దములకు ద్వితీయా విభక్తి వచ్చును. "మాసం కల్యాణీ మాసమధీతే" మొదలగు ఉదాహరణములందు కాలవాచకమగు " మాసము " అను శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది. "క్రోశం కుటిలా నదీ". " క్రోశమధీతే" మొదలగు ఉదాహరణములందు అధ్వవాచకమగు క్రోశ శబ్దమునకు ద్వితీయా విభక్తి వచ్చినది. అత్యన్త సంయోగమందే ఈ ద్వితీయా విధించబడుటచే " మాసస్య ద్విః అధీతే " (నెలలో రెండుసార్లు మాత్రమే అధ్యయనము చేస్తాడు) అను ఉదాహరణమందు ద్వితీయా విభక్తి చెప్పబడదు.

**ఇతి ద్వితీయా విభక్తిః.**
**(ద్వితీయా విభక్తి సమాప్తము)**



# అథ తృతీయా విభక్తిః

## 28. స్వతంత్రః కర్తా (1-4-54)

**క్రియాయాం స్వాతన్త్ర్యేణ వివక్షితోఽర్థః కర్తా స్యాత్.**

**స్వతంత్రః కర్తా** : స్వతంత్రః, కర్తా అని పదచ్ఛేదము. క్రియయందు స్వతంత్రముగా (ప్రధానముగా) వివక్షింపబడునది ' కర్త ' యను సంజ్ఞ కలది యగును. పాచకః పచతి (వంటవాడు వండుచున్నాడు) అను ఉదాహరణములో పాకక్రియ యందు వివక్షింపబడినవాడు " పాచకుడు " అగుటచే పాచకుడు కర్త.

## 29. సాధకతమం కరణమ్ (1-4-42)

**క్రియాసిద్ధౌ ప్రకృష్టోపకారకం కారకం కరణసంజ్ఞం స్యాత్. తమబ్గ్రహణం కిమ్? గఙ్గాయాం ఘోషః.**

**సాధకతమం కరణమ్** : సాధకతమం, కరణమ్ అని పదచ్ఛేదము. క్రియాసిద్ధి యందు ఎక్కువగా ఉపకరించు సాధనము కరణ సంజ్ఞక మగునని అర్థము. అనగా క్రియ ఉత్పన్నమగుటకు ఎక్కువగ ఉపకారకమగు కారకము కరణసంజ్ఞ కలది అగును. ఈ సూత్రమున ' తమప్ ' గ్రహణం చేత ఈ కారకప్రకరణమందు ఈ సూత్రమున తప్ప మరెక్కడా కూడా ' గౌణముఖ్య ' న్యాయము ప్రవర్తించదని తెలుపబడినది. కావున " గంగాయాం ఘోషః " అను స్థలమందు గౌణాధారమైన గంగాశబ్దమునకు "ఆధారోఽధికరణమ్ " అను సూత్రము చేత అధికరణ సంజ్ఞ సిద్ధించినది.

ఉదాహరణకు కరణమనగా " బాణేన హతో వాలీ " అను హనన క్రియయందు ఎక్కువగా ఉపకరించే సాధనము బాణమే. కావున బాణము కరణము.

## 30. కర్తృకరణయోస్తృతీయా (2-3-18)

**అనభిహితే కర్తరి, కరణే చ తృతీయా స్యాత్. రామేణ బాణేన హతో వాలీ.**

**(వా) " ప్రకృత్యాదిభ్య ఉపసంఖ్యానమ్ " ప్రకృత్యా చారుః. ప్రాయేణ యాజ్ఞికః గోత్రేణ గార్గ్యః, సమేనైతి. విషమేణైతి. ద్విద్రోణేన ధాన్యం క్రీణాతి. సుఖేన దుఃఖేన వా యాతి. ఇత్యాది.**

**కర్తృకరణయోస్తృతీయా:** కర్తృః, కరణయోః తృతీయా అని పదచ్ఛేదము.'అనభిహితే ' అని అధికార సూత్రము అనువర్తించును. కర్త మరియు కరణము అభిహితములు

కానప్పుడు కర్త సంజ్ఞకము, కరణసంజ్ఞకమునకు కూడ తృతీయా విభక్తి వచ్చును. " రామేణ బాణేన హతో వాలీ " (రామునిచే బాణముచే వాలి చంపబడినాడు) ఇచ్చట హనన క్రియలో రాముడు కర్త, బాణము కరణము. అవి అభిహితములు కాలేదు. కావున తృతీయా విభక్తి వచ్చి రామేణ, బాణేన అను రూపమేర్పడినది.

**(వా) ప్రకృత్యాదిభ్య ఉపసంఖ్యానమ్**

ప్రకృతి మొదలగు శబ్దములకు కూడ తృతీయా విభక్తి వచ్చును. " ప్రకృత్యా చారుః" మొదలగు ఉదాహరణల యందు ప్రకృతి మొదలగు శబ్దములకు తృతీయా విభక్తి విధింపబడును.

## 31. దివః కర్మ చ (1-4-43)

**దివః సాధకతమం కారకం కర్మసంజ్ఞం స్యాత్. చాత్కరణసంజ్ఞమ్. అక్షైరక్షాన్వా దీవ్యతి.**

**దివః కర్మ చ** : దివః, కర్మ, చ అని పదచ్ఛేదము. దివ్ ధాత్వర్థమందలి సాధకతమమగు కారకము కర్మసంజ్ఞ మరియు కరణ సంజ్ఞ కూడ కలిగినది యగును. "అక్షైః అక్షాన్ వా దీవ్యతి" (పాచికలతో ఆడుచున్నాడు) అనునది ఉదాహరణ. ఇచ్చట దివ్ ధాతువు క్రీడార్థకము. ఆ అర్థమున ప్రకృష్టోపకారకము అక్షములు. వాటికి కర్మసంజ్ఞ వచ్చినపుడు ద్వితీయా విభక్తి కరణసంజ్ఞ వచ్చినపుడు తృతీయా విభక్తి విధింపబడును.

## 32. అపవర్గే తృతీయా (2-3-19)

**అపవర్గః - ఫలప్రాప్తిః, తస్యాం ద్యోత్యాయాం కాలాధ్వనోరత్యన్తసంయోగే తృతీయా స్యాత్. అహ్నా క్రోశేన వా అనువాకోऽధీతః. అపవర్గే కిమ్ ? మాసమధీతో నాయాతః.**

**అపవర్గే తృతీయా** : అపవర్గే, తృతీయా అని పదచ్ఛేదము. అపవర్గ మనగా ఫలప్రాప్తియని యర్థము. అది గమ్యమానమయినపుడు కాలాధ్వ వాచక శబ్దములకు అత్యంత సంయోగ మందు తృతీయా విభక్తి వచ్చును. " అహ్నా క్రోశేన వా అనువాకోऽధీతః " ( ఒకరోజు యందు, క్రోశమందు నిరంతరము అధ్యయనము చేయుటచే అనువాకము గ్రహింపబడినది) అను ఉదాహరణ మందు కాలవాచక అహన్ శబ్దమునకు అధ్వవాచక క్రోశ శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చినది. " మాసమధీతో నాయాతః "



(మాసమంతా అధ్యయనము చేసినా గ్రహింపబడలేదు) అను ఉదాహరణ మందు అపవర్గః = ఫలప్రాప్తి లేకపోవుటచే మాసశబ్దమునకు తృతీయా విభక్తి రాలేదు.

## 33. సహయుక్తేऽప్రధానే (2-3-19)

**సహార్థేన యుక్తే अప్రధానే తృతీయా స్యాత్. పుత్రేణ సహాగతః పితా. ఏవం సాకం సార్ధం సమం యోగేऽపి. వినాపి తద్యోగం తృతీయా, " వృద్ధో యూనా......... " ఇత్యాది నిర్దేశాత్.**

**సహయుక్తేऽప్రధానే** : సహయుక్తే , అప్రధానే అని పదచ్ఛేదము. సహ అను శబ్దమునకు " కూడా " అని అర్థము. సహార్థక శబ్దములతో సంబంధము ఉండగా అప్రధాన వాచక శబ్దములకు తృతీయా విభక్తి వచ్చునని సూత్రార్థము. " పుత్రేణ సహాగతః పితా " (పుత్రునితో కూడా తండ్రి వచ్చినాడు) అను ఉదాహరణ యందు సహార్థక సహ శబ్దముతో యోగమున్నందున అప్రధానవాచక పుత్ర శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చినది. ఇట్లే సహార్థకములగు సాకం, సార్ధం, సమం శబ్దములతో యోగమున్నప్పుడు కూడా తృతీయా విభక్తి వచ్చును.

" వృద్ధో యూనా ........... " మొదలగు సూత్రమందు సహార్థక శబ్దమేమియూ ప్రయోగింపబడకపోయినప్పటికిని " యూనా " అని తృతీయా విభక్తిని ప్రయోగించుటచే, సహార్థక శబ్దము లేకపోయినను, సహార్థకము గమ్యమానము అయిననూ అక్కడ కూడా తృతీయా విభక్తి వచ్చును.

## 34. యేనాఙ్గవికారః (2-3-20)

**యేనాఙ్గేన వికృతేనాఙ్గినో వికారో లక్ష్యతే తతస్తృతీయా స్యాత్. అక్ష్ణా కాణః. అక్షి సంబంధికాణత్వవిశిష్ట ఇత్యర్థః, " అఙ్గ వికారః " కిమ్ ? అక్షి కాణమస్య.**

**యేనాఙ్గవికారః** : యేన, అఙ్గవికారః అని పదచ్ఛేదము. ఏ అంగము (అవయవము) వికృతమయినందున అంగికి (అవయవి యగు శరీరమునకు) వికారము తెలియబడునో అట్టి అంగవాచక శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చును. ' అక్ష్ణా కాణః ' (కన్నుచే గుడ్డివాడు) అనునది ఉదాహరణ. అక్షి వికారము వలన కాణత్వము (గ్రుడ్డి) గలిగినవాడు అని అర్థము. అంగవాచక శబ్దమైన అక్షి శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చి అక్ష్ణా అను సిద్ధించినది. అంగ వికారము అనగా అంగ విశిష్ట శరీర వికారము గమ్యమానము అయినపుడే ఈ సూత్రము ప్రవర్తించును. కావున " అక్షి కాణమస్య " (ఇతనికి కన్ను గ్రుడ్డిది) అను ఉదాహరణమందు అక్షి శబ్దమునకు తృతీయా విభక్తి చెప్పబడలేదు.

## 35. ఇత్థంభూతలక్షణే (2-3-21)

**కంచిత్ప్రకారం ప్రాప్తస్య లక్షణే తృతీయా స్యాత్. జటాభిస్తాపసః. జటాజ్ఞాప్యతాపసత్వ విశిష్ట ఇత్యర్థః.**

**ఇత్థంభూతలక్షణే** : ఏకపదమీ సూత్రము. ఏదేని ఒక ప్రకారము అంటే ధర్మమును తెలుపు లక్షణ వాచక శబ్దమునకు తృతీయా విభక్తి విధింపబడును. లక్షణమనగా ఇచ్చట జ్ఞాపకము అని అర్థము.

"జటాభిస్తాపసః" (జడల వలన తాపసుడు) అనునది ఉదాహరణము. తాపసత్వ ధర్మమును తెలుపునవి జటలు కావున ఆ శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చి బహువచనములో " జటాభిః " అను రూపమేర్పడినది.

## 36. సంజ్ఞోఽన్యతరస్యాం కర్మణి (2-3-22)

**సంపూర్వస్య జానాతేః కర్మణి తృతీయా వా స్యాత్. పిత్రా పితరం వా సంజానీతే.**

**సంజ్ఞోఽన్యతరస్యాం కర్మణి** : సంజ్ఞః, అన్యతరస్యాం, కర్మణి అని పదచ్ఛేదము. సంపూర్వక జ్ఞా ధాతువు షష్ఠీ విభక్తి ఏకవచనము నందు సంజ్ఞః అని ఏర్పడును. సమ్ అనే ఉపసర్గ పూర్వక జ్ఞా - జ్ఞానే ధాతువు యొక్క కర్మ వాచక శబ్దమునకు తృతీయా విభక్తి వైకల్పికముగా వచ్చును. తృతీయా విభక్తి రానప్పుడు " కర్మణి ద్వితీయా " అను సూత్రముచేత ద్వితీయా విభక్తి వచ్చును. " పిత్రా పితరం వా సంజానీతే " (తండ్రిని బాగుగా తెలుసుకొనుచున్నాడు) అనునది ఉదాహరణ. ఇచ్చట సంపూర్వక జ్ఞా ధాతువు కర్మ వాచకమగు పితృశబ్దముతో ఉపయోగింపబడినది కావున ఈ సూత్రముచేత తృతీయా విభక్తి వైకల్పికముగా వచ్చినది.

## 37. హేతౌ (2-3-23)

**హేత్వర్థే తృతీయా స్యాత్. ద్రవ్యాదిసాధారణం నిర్వ్యాపారసాధారణం చ హేతుత్వమ్. కరణత్వం తు క్రియామాత్రవిషయం వ్యాపారనియతం చ. దణ్డేన ఘటః. పుణ్యేన దృష్టో హరిః. ఫలమపీహ హేతుః. అధ్యయనేన వసతి.**

**(వా) గమ్యమానాపి క్రియా కారకవిభక్తౌ ప్రయోజికా. "అలం శ్రమేణ". శ్రమేణ సాధ్యం నాస్తీత్యర్థః. ఇహ సాధనక్రియాం ప్రతి శ్రమః కరణమ్. "శతేన శతేన వత్సాన్ పాయయతి పయః". శతేన పరిచ్ఛిద్యేత్యర్థః.**



**(వా) అశిష్ట వ్యవహారే దాణః ప్రయోగే చతుర్థ్యర్థే తృతీయా "దాస్యా సంయచ్ఛతే కాముకః". ధర్మ్యే తు భార్యాయై సంయచ్ఛతి.**

**హేతౌ** : హేత్వర్థమందు హేతువాచక శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చునని సూత్రార్థము. ద్రవ్యాది సాధారణం అనగా ద్రవ్యగుణక్రియా నిరూపితము హేతుత్వము. అట్లే "నిర్వ్యాపారసాధారణం " వ్యాపారము కల్గిన వానియందు, వ్యాపారము లేని వానియందు కూడా హేతుత్వము ఉండును అని అర్థము. కారణత్వము క్రియాజనకమందు, వ్యాపారము కలవాని యందు మాత్రమే ఉండును. ఇదియే హేతుత్వ కారణత్వములకు భేదము.

" దండేన ఘటః " అను స్థలమందు ఘటరూప ద్రవ్యమునకు దండము హేతువు. కావున హేతువాచకమైన దండ శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చినది.

" పుణ్యేన దృష్టో హరిః " అను ఉదాహరణమున హరిదర్శన రూపక్రియకు హేతువు పుణ్యము, కావున పుణ్య శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చినది.

ఈ సూత్రమున హేతుశబ్దముచే ఫలమును కూడా గ్రహించవలెను. " అధ్యయనేన వసతి " అనునపుడు గురుకులవాసమునకు అధ్యయనమే ఫలము, కావున అధ్యయన శబ్దమునకు తృతీయా విభక్తి వచ్చినది.

**(వా) గమ్యమానాఽపి క్రియా కారక విభక్తౌ ప్రయోజికా** : శ్రూయమాణ క్రియయే కాక గమ్యమాన ( పదాబోధ్యమగు ) క్రియ కూడా కారక విభక్తి ప్రవర్తించుటలో ప్రయోజకమగునని ఈ వార్తికము తెలుపుచున్నది. అందువల్లనే " అలం శ్రమేణ " అనునపుడు శ్రమ శబ్దమునకు తృతీయా విభక్తి చెప్పబడినది. శ్రమతో సాధించదగినది లేదని అర్థము. ఇచ్చట సాధన క్రియ గమ్యమానము. అట్టి సాధన క్రియ యందు శ్రమ కరణము.

అట్లే " శతేన శతేన వత్సాన్ పాయయతి పయః " (నూరు నూరుగా విభజించి దూడలను పాలు త్రాగించుచున్నాడు ) అను ఉదాహరణమున " పరిచ్ఛిద్య " అను క్రియను అధ్యాహారముచేసి పరిచ్ఛేదక్రియ యందు కరణమైన శతశబ్దమునకు తృతీయా విభక్తి సిద్ధించినది.

**(వా)అశిష్టవ్యవహారే దాణః ప్రయోగే చతుర్థ్యర్థే తృతీయా** : అశిష్ట వ్యవహార విషయమున దాణ్ ధాతువు ప్రయోగించునప్పుడు చతుర్థీ విభక్త్యర్థమున అనగా సంప్రదానమున తృతీయా విభక్తి వచ్చునని వార్తికము సూచించుచున్నది. " దాస్యా సంయచ్ఛతే కాముకః " దాసి యందు రతిధర్మం శాస్త్ర నిషిద్ధము. అది అశిష్ట వ్యవహారము. కావున సంప్రదాన వాచకము అగు " దాసీ " శబ్దమునకు ప్రకృత వార్తికముచే తృతీయావిభక్తి విధింపబడినది. ధర్మ్య వ్యవహారమందు మాత్రము ఈ వార్తికము ప్రవర్తించదు. కావున " భార్యాయై సంయచ్ఛతి " అనునపుడు చతుర్థీ విభక్తి ప్రయోగము సాధువగును.

**తృతీయా విభక్తి సమాప్తము.**

# అథ చతుర్థీ విభక్తిః

## 38. కర్మణా యమభిప్రైతి స సమ్ప్రదానమ్ (1-4-32)

**దానస్య కర్మణా యమభిప్రైతి స సంప్రదానసంజ్ఞః స్యాత్.**

**కర్మణా యమభిప్రైతి స సంప్రదానమ్** : కర్మణా, యం, అభిప్రైతి, సః, సంప్రదానమ్ అని పదచ్ఛేదము. దానక్రియ యొక్క కర్మతో ఎవరిని లేదా దేనిని ఉద్దేశించి చేసెదమో అట్టి కారకము సంప్రదాన సంజ్ఞ కలది యగును. దేయద్రవ్యము యొక్క ఉద్దేశ్యము సంప్రదానమని అర్థము అనగా దేనిని ఉద్దేశించి ఒక వస్తువు ఈయబడునో అది సంప్రదానమగునని భావము.

## 39. చతుర్థీ సంప్రదానే (2-3-13)

విప్రాయ గాం దదాతి. ' అనభిహిత ' ఇత్యేవ. దీయతేఽస్మై దానీయో విప్రః.

**(వా)క్రియయా యమభిప్రైతి సోఽపి సంప్రదానమ్.** పత్యే శేతే.

**(వా)యజేః కర్మణః కరణసంజ్ఞా సంప్రదానస్య చ కర్మసంజ్ఞా.** పశునా రుద్రం యజతే. పశుం రుద్రాయ దదాతీత్యర్థః.



**చతుర్థీ సంప్రదానే** : చతుర్థీ, సంప్రదానే అని ద్విపద సూత్రము. " అనభిహితే " అను అధికార సూత్రము అనువర్తించును. సంప్రదానము అభిహితము కానప్పుడు సంప్రదాన వాచకమునకు చతుర్థీ విభక్తి వచ్చును. అనగా సంప్రదానార్థమునందు సంప్రదాన సంజ్ఞకమైన శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చునని అర్థము.

" విప్రాయ గాం దదాతి " ( బ్రాహ్మణుని కొరకు గోవును దానము చేయు చున్నాడు) దానక్రియ యందు కర్మ గోవు. అది విప్రుని ఉద్దేశించి ఈయబడుచున్నది కావున విప్ర శబ్దమునకు సంప్రదాన సంజ్ఞ విధించి, ఈ సూత్రము చేత చతుర్థీ విభక్తి చెప్పబడినది.

" అనభిహితే " అధికారమున్నందున " దీయతే అస్మై దానీయో విప్రః " అను ఉదాహరణయందు అనీయర్ అను కృత్ ప్రత్యయము చేత సంప్రదానము అభిహితమైనందున, విప్ర శబ్దమునకు చతుర్థీ విభక్తి రాదు.

**(వా)క్రియయా యమభిప్రైతి సోఽపి సంప్రదానమ్** : క్రియతో ఎవరిని అభిప్రేతము చేసెదమో లేదా క్రియ యందు ఉద్దేశ్యమేది కలదో అట్టి దానికి కూడా సంప్రదాన సంజ్ఞ వచ్చును. " పత్యే శేతే " అను ఉదాహరణమున శయన క్రియ యందు ఉద్దేశ్యము పతి గావున పతి శబ్దమునకు సంప్రదాన సంజ్ఞ ఈ వార్తికము ద్వారా చెప్పబడినది.

**(వా)కర్మణః కరణ సంజ్ఞా సంప్రదానస్య చ కర్మ సంజ్ఞా** : ఒక వాక్యమందు కర్మ మరియు సంప్రదానముల సమవాయము కలిగినపుడు కర్మకు కరణ సంజ్ఞ, సంప్రదానమునకు కర్మ సంజ్ఞ విధింపబడును. " పశునా రుద్రం యజతే " (రుద్రుని కొరకు పశువును దానము చేయుచున్నాడు) అను ఉదాహరణమున యజ ధాత్వర్థ మందు కర్మయైన పశువుకు కరణ సంజ్ఞ వచ్చి తృతీయా విభక్తి, సంప్రదానమగు రుద్రునికి కర్మ సంజ్ఞ మఱియు ద్వితీయా విభక్తి వచ్చినవి.

## 40. రుచ్యర్థానాం ప్రీయమాణః (1-4-33)

**రుచ్యర్థానాం ధాతూనాం ప్రయోగే ప్రీయమాణోఽర్థః సంప్రదానం స్యాత్. హరయే రోచతే భక్తిః. అన్యకర్తృకో అభిలాషో రుచిః. హరినిష్ఠప్రీతేర్భక్తిః కర్త్రీ. ప్రీయమాణః కిమ్? దేవదత్తాయ రోచతే మోదకః పథి.**

**రుచ్యర్థానాం ప్రీయమాణః** : రుచ్యర్థానాం, ప్రీయమాణః అని పదవిభాగము. రుచ్యర్థక ధాతువులను ప్రయోగించినపుడు ప్రీయమాణమగు అర్థము సంప్రదాన సంజ్ఞ కలది అగును.

'హరయే రోచతే భక్తిః' అనునది ఉదాహరణ. హరి యందు ప్రీతిని = భక్తి పుట్టించుచున్నదని లేదా భక్తి హరిని సంతోష పెట్టుచున్నదని అర్థము. అన్యకర్తృక అభిలాషయే రుచ ధాతువు యొక్క అర్థము. ప్రీతికి ఆశ్రయుడు హరి, తదన్యము భక్తి, తత్ కర్తృకము ప్రీతి. హరి యందలి ప్రీతికి కర్త ఎవరనగా భక్తి యని భావము. అందువలననే హరి శబ్దమునకు ఈ సూత్రముచే సంప్రదాన సంజ్ఞ వచ్చి చతుర్థీ విభక్తి వచ్చును. ప్రీయమాణమునకే ఈ సూత్రము చేత సంప్రదాన సంజ్ఞ విధింపబడుటచే "దేవదత్తాయ రోచతే మోదకః పథి" (మోదకము దేవదత్తుని మార్గమందు సంతోషపెట్టుచున్నది) అనునపుడు పథిన్ శబ్దార్థము ప్రీయమాణము కాదు గావున సంప్రదాన సంజ్ఞ రాదు.

## 41. శ్లాఘహ్నుఙ్‌స్థాశపాం జ్ఞీప్స్యమానః (1-4-34)

**ఏషాం ప్రయోగే బోధయితుమిష్టః సంప్రదానం స్యాత్. గోపీ స్మరాత్ కృష్ణాయ శ్లాఘతే, హ్నుతే, తిష్ఠతే శపతే వా. జ్ఞీప్స్యమానః కిం ? దేవదత్తాయ శ్లాఘతే పథి.**

శ్లాఘహ్నుఙ్‌స్థాశపామ్ జ్ఞీప్స్యమానః అని పదచ్ఛేదము. జ్ఞీప్స్యమానమనగా ఎవరికి తెలియపరచవలెనని కోరుతామో ఈ వ్యక్తి అని అర్థము. 'శ్లాఘ' ధాతువునకు 'చెప్పుట' అని, 'హ్నుఙ్' ధాతువునకు 'తొలగించుట' అని, 'స్థా' ధాతువునకు 'నిలుచుట' అని, 'శప' ధాతువునకు 'నిందించుట' అని అర్థము. ఈ నాలుగు ధాతువులను ప్రయోగించినప్పుడు జ్ఞీప్స్యమానమునకు సంప్రదాన సంజ్ఞ వచ్చును. "గోపీ స్మరాత్ కృష్ణాయ శ్లాఘతే, హ్నుతే, తిష్ఠతే, శపతే వా" అని ఉదాహరణ.

జ్ఞీప్స్యమానమునకే ఈ సూత్రము చేత సంప్రదాన సంజ్ఞ విధింపబడుటచే "దేవదత్తాయ శ్లాఘతే పథి" అనునపుడు పథిన్ శబ్దార్థమునకు సంప్రదాన సంజ్ఞ రాదు.

## 42. ధారేరుత్తమర్ణః (1-4-35)

**ధారయతేః ప్రయోగే ఉత్తమర్ణః ఉక్తసంజ్ఞః స్యాత్. భక్తాయ ధారయతి మోక్షం హరిః. ఉత్తమర్ణః కిమ్ ? దేవదత్తాయ శతం ధారయతి గ్రామే.**

**ధారేరుత్తమర్ణః** : ధారేః, ఉత్తమర్ణః అని పదచ్ఛేదము. ఋణమును తీసుకొన్నవాడు అధమర్ణుడు. ఋణమును ఇచ్చినవాడు ఉత్తమర్ణుడు. ణిచ్ ప్రత్యయాన్త ధారి ధాతువును ప్రయోగించినపుడు ఉత్తమర్ణునికి సంప్రదాన సంజ్ఞ వచ్చును. "భక్తాయ ధారయతి మోక్షం హరిః" (భక్తునికి మోక్షమును హరి కలిగింపజేయుచున్నాడు) అనునపుడు



'ణ్యన్తమైన' 'ధారి' ధాతువు ప్రయోగింపబడుట వలన ఉత్తమర్ణుడగు భక్తునికి సంప్రదాన సంజ్ఞ వచ్చినది. ఇచ్చట ఋణమును ఇచ్చినవాడు భక్తుడు ఉత్తమర్ణుడు, ఋణమును తీసుకొన్నవాడు అధమర్ణుడను హరి అని భావము. సూత్రమున 'ఉత్తమర్ణ' శబ్దము ప్రయోగించుట వలన "దేవదత్తాయ శతం ధారయతిగ్రామే" అను చోట గ్రామ శబ్దమునకు సంప్రదానము రాదు.

## 43. స్పృహేరీప్సితః (1-4-36)

**స్పృహయతేః ప్రయోగే ఇష్టః సంప్రదానం స్యాత్. పుష్పేభ్యః స్పృహయతి. ఈప్సితః కిమ్ ? పుష్పేభ్యో వనే స్పృహయతి. ఈప్సితమాత్రే ఇయం సంజ్ఞా. ప్రకర్షవివక్షాయాం తు పరత్వాత్కర్మసంజ్ఞా, పుష్పాణి స్పృహయతి.**

**స్పృహేరీప్సితః** : స్పృహేః, ఈప్సితః అని పదచ్ఛేదము. స్పృహ ధాతువును ప్రయోగించినప్పుడు ఈప్సితమగు పదార్థమునకు సంప్రదాన సంజ్ఞ ప్రవర్తించును. 'పుష్పేభ్యో స్పృహయతి ' (పుష్పములను కోరుచున్నాడు) అను ప్రయోగ మందు ఈప్సితమగు పుష్పములకు సంప్రదాన సంజ్ఞ వచ్చి చతుర్థీ విభక్తి వచ్చినది.

ఈప్సితమునకు సంప్రదాన సంజ్ఞ విధింపబడుటచే 'పుష్పేభ్యో వనే స్పృహయతి' అను ప్రయోగమందు వన శబ్దమునకు సంప్రదాన సంజ్ఞ రాదు. పుష్పములకు ఈప్సితతమత్వమునకు వివక్షచేసినపుడు ఈ సంప్రదాన సంజ్ఞను బాధించి 'కర్తురీప్సితతమం కర్మ' అను సూత్రముచేత కర్మ సంజ్ఞ, తత్ప్రయుక్త ద్వితీయా విభక్తి వచ్చి 'పుష్పాణి స్పృహయతి' అను ప్రయోగమేర్పడును.

## 44. క్రుధద్రుహేర్ష్యాసూయార్థానాం యం ప్రతి కోపః (1-4-37)

**క్రుధాద్యర్థానాం ప్రయోగే యం ప్రతి కోపః స ఉక్తసంజ్ఞః స్యాత్. హరయే క్రుధ్యతి, ద్రుహ్యతి, ఈర్ష్యతి, అసూయతి వా. యం ప్రతి కోపః కిమ్ ? భార్యామీర్ష్యతి, మైనామన్యోऽద్రాక్షీదితి. క్రోధోఽమర్షః. ద్రోహోఽపకారః. ఈర్ష్యాఽక్షమా. అసూయా గుణేషు దోషావిష్కరణమ్. ద్రోహాదయోఽపి కోపప్రభవా ఏవ గృహ్యన్తే. అతో విశేషణం సామాన్యేన 'యం ప్రతి కోపః' ఇతి.**

**క్రుధద్రుహేర్ష్యాసూయార్థానాం యం ప్రతి కోపః** : క్రుధద్రుహేర్ష్యాసూయార్థానాం, యం, ప్రతి, కోపః అని పదచ్ఛేదము. క్రుధ, ద్రుహ, ఈర్ష్య, అసూయా అను నాలుగు

ధాతువులను ప్రయోగించినపుడు ఎవరిని గూర్చి కోపాదులు ప్రకటింపబడునో ఆ వ్యక్తికి సంప్రదాన సంజ్ఞ వచ్చును. క్రోధమనగా అమర్ష, ద్రోహము అనగా అపకారము, ఈర్ష్య అనగా క్షమాగుణము లేకుండుట అని, అసూయ అనగా ఇతరుల గుణములయందు దోషారోపణము చేయుట అని అర్థము. ద్రోహదులు కూడా కోపము నుండే ఉద్భవించును గావున "యం ప్రతికోపః " అను విశేషణము సామాన్యముగా ప్రయోగింపబడినది.

" హరయే క్రుధ్యతి, ద్రుహ్యతి, ఈర్ష్యతి, అసూయతి వా " అని క్రమముగా నాలుగు ధాతువులకు ఉదాహరణము.

1. హరయే క్రుధ్యతి – హరిని కోపగించుచున్నాడు.
2. హరయే ద్రుహ్యతి – కోపముతో హరికి అపకారము చేయుచున్నాడు.
3. హరయే ఈర్ష్యతి – కోపముతో హరిని సహించుట లేదు.
4. హరయే అసూయతి – కోపముతో హరిని దుర్గుణునిగా తలచుచున్నాడు అని భావము.

ఈ ఉదాహరణములలో కోపాదులు హరినుద్దేశించి ప్రకటింపబడినవి కావున హరి శబ్దమునకు సంప్రదానము విధింపబడినది.

## 45. క్రుధద్రుహోరుపసృష్టయోః కర్మ (1-4-38)

**సోపసర్గయోరనయోర్యోగే యం ప్రతి కోపస్తత్కారకం కర్మసంజ్ఞం స్యాత్. క్రూరమభి క్రుధ్యతి, అభిద్రుహ్యతి.**

**క్రుధద్రుహోరుపసృష్టయోః కర్మ** : క్రుధద్రుహోః, ఉపసృష్టయోః, కర్మ అని పదచ్ఛేదము. ఉపసర్గతో కూడుకొన్న క్రుధ, ద్రుహ ధాతువులను ప్రయోగించినప్పుడు, ఎవరిని గూర్చి కోపము ప్రకటితమగునో ఆ వ్యక్తికి కర్మసంజ్ఞ వచ్చును. పూర్వసూత్రముచేత ప్రాప్తించిన సంప్రదాన సంజ్ఞకు బాధకము ఈ సూత్రము. "క్రూరమభిక్రుధ్యతి, క్రూరమభిద్రుహ్యతి", అని రెండు ధాతువులకు క్రమముగా ఉదాహరణములు. క్రూరునికి కర్మసంజ్ఞ, ద్వితీయా విభక్తి కూడ విధింపగ ' క్రూరం ' అను రూపము ఏర్పడినది.

## 46. రాధీక్ష్యోర్యస్య విప్రశ్నః (1-4-39)

**ఏతయోః కారకం సంప్రదానం స్యాత్. యదీయో వివిధః ప్రశ్నః క్రియతే. కృష్ణాయ రాధ్యతి ఈక్షతే వా. పృష్టో గర్గః శుభాశుభం పర్యాలోచయతీత్యర్థః.**



**రాధీక్ష్యోర్యస్య విప్రశ్నః** : రాధీక్ష్యోః, యస్య, విప్రశ్నః అని పదచ్ఛేదము. వివిధ ప్రశ్న చేయబడునప్పుడు ఉపయోగింపబడిన రాధ, ఈక్ష ధాతువుల యొక్క కారకమునకు సంప్రదానసంజ్ఞ వచ్చును.

' కృష్ణాయ రాధ్యతి, ఈక్షతే వా ' అను వాక్యములో కృష్ణునికి శుభము జరుగునా లేక అశుభము జరుగునా అని గర్గుని అడగగా గర్గుడు కృష్ణ విషయకమైన శుభా శుభములను పర్యాలోచన చేయుచున్నాడని అర్థము చెప్పబడినది. కావున ' కృష్ణ ' శబ్దమునకు సంప్రదాన సంజ్ఞ, చతుర్థీ విభక్తి విధింపబడినవి.

## 47. ప్రత్యాఙ్భ్యాం శ్రువః పూర్వస్య కర్తా (1-4-40)

**ఆభ్యాం పరస్య శృణోతేర్యోగే పూర్వస్య ప్రవర్తనారూపస్య వ్యాపారస్య కర్తా సంప్రదానం స్యాత్. విప్రాయ గాం ప్రతిశృణోతి ఆశృణోతి వా. విప్రేణ మహ్యం దేహీతి ప్రవర్తితః ప్రతిజానీతే ఇత్యర్థః.**

**ప్రత్యాఙ్భ్యాంశ్రువః పూర్వస్య కర్తా** : ప్రత్యాఙ్భ్యాం, శ్రువః, పూర్వస్య, కర్తా అని పదచ్ఛేదము ప్రతి, ఆఙ్ అను ఉపసర్గలు పూర్వమందు కలిగిన శ్రుధాతువు ప్రయోగించినపుడు పూర్వకాలమందున్న ప్రవర్తనారూప వ్యాపారము యొక్క కర్తకు సంప్రదాన సంజ్ఞ వచ్చును. " విప్రాయ గాం ప్రతిశృణోతి ఆశృణోతి వా " ఉదాహరణమున నాకు గోవుని ఇమ్ము అని విప్రుని చేత అడగబడిన దేవదత్తుడు అట్లే ఇచ్చెదనని ఒప్పుకొనుచున్నాడని అర్థము. ఇచ్చట ప్రేరేపించువాడు విప్రుడు. కావున విప్ర శబ్దమునకు సంప్రదాన సంజ్ఞ చెప్పబడినది.

## 48. అనుప్రతిగృణశ్చ (1-4-41)

**ఆభ్యాం గృణాతేః కారకం పూర్వవ్యాపారస్య కర్త ృభూతముక్తసంజ్ఞం స్యాత్. హోత్రేఽనుగృణాతి, ప్రతిగృణాతి వా. హోతా ప్రథమం శంసతి, తమధ్వర్యుః ప్రోత్సాహయతీత్యర్థః.**

**అనుప్రతిగృణశ్చ** : అనుప్రతిగృణః, చ అని పదచ్ఛేదము. అను, ప్రతి అను ఉపసర్గలతో కూడిన గౄ ధాతువు యొక్క కారకము పూర్వ వ్యాపారము యొక్క కర్త రూపము అయినది సంప్రదాన సంజ్ఞ కలది అగును. ఉదా ॥ " హోత్రే అనుగృణాతి ప్రతిగృణాతివా " శంసనము అనగా మంత్రోచ్చారణ చేయుచున్న హోతను తదనంతర

మంత్రోచ్చారణ మందు అధ్వర్యువు ప్రోత్సాహించుచున్నాడని అర్థము. ఇచ్చట పూర్వతన వ్యాపారము శంసమందు కర్తయగు హెూతకు సంప్రదాన సంజ్ఞ వచ్చినది.

## 49. పరిక్రయణే సంప్రదానమన్యతరస్యామ్ (1-4-44)

**నియతకాలం భృత్యా స్వీకరణం పరిక్రయణం, తస్మిన్ సాధకతమం కారకం సంప్రదానసంజ్ఞం వా స్యాత్. శతేన శతాయ వా పరిక్రీతః.**

(వా) **తాదర్థ్యే చతుర్థీ వాచ్యా.** ముక్తయే హరిం భజతి.

(వా) **క్లృపి సంపద్యమానే చ** భక్తిః జ్ఞానాయ కల్పతే, సంపద్యతే, జాయతే, ఇత్యాది.

(వా) **ఉత్పాతేన జ్ఞాపితే చ** వాతాయ కపిలా విద్యుత్.

(వా) **హితయోగే చ** బ్రాహ్మణాయ హితమ్.

**పరిక్రయణే సంప్రదానమన్యతరస్యామ్ :** పరిక్రయణే, సంప్రదానం, అన్యతరస్యాం అని పదచ్ఛేదము. నియతకాలం (పరిమితమైన) వేతనమిచ్చి స్వీకరించుటను పరిక్రయణ మందురు. పరిక్రయణమందు సాధకతమకారకమునకు వికల్పముగా సంప్రదాన సంజ్ఞ వచ్చును. సంప్రదాన సంజ్ఞ రానప్పుడు కరణ సంజ్ఞ విధించబడును. " శతేన శతాయ వా పరిక్రీతః " (నూరు రూపాయలతో కొనబడినవాడు) అను వాక్యమున శత శబ్దమునకు ప్రకృత సూత్రము చేత వికల్పముగా సంప్రదాన సంజ్ఞ వచ్చినది. అందుకే "శతేన, "శతాయ" అని రెండు విభక్తులు ఉపయోగింపబడినవి.

**తాదర్థ్యే చాతుర్థీ వాచ్యా :** తాదర్థ్యమందు (దాని కొరకు అను అర్థమందు) చతుర్థీ విభక్తి చెప్పవలెను. ' ముక్తయే హరిం భజతి ' (ముక్తికై హరిని సేవించుచున్నాడు) అను ప్రయోగమందు ముక్తి శబ్దమునకు చతుర్థీ విభక్తి విధింపబడినది.

**క్లృపి సంపద్యమానే చ :** క్లృపి ధాతువు అర్థముగల ధాతువులను ప్రయోగించినప్పుడు సంపద్యమానార్థవాచక శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును. ' భక్తిః జ్ఞానాయ కల్పతే ' ఇత్యాది ఉదాహరణమందు భక్తి జ్ఞానాకారముగా పరిణమించుచున్నదని అర్థము. కావున సంపద్యమాన అర్థము జ్ఞానము. తద్వాచక జ్ఞాన శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చి జ్ఞానాయ అను రూపము ఏర్పడును.

**ఉత్పాతేన జ్ఞాపితే చ :** అశుభాన్ని సూచించే ఆకస్మిక భూతవికారము ఉత్పాతము, ఉత్పామును సూచించబడిన అర్థముగల శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును.

' వాతాయ కపిలా విద్యుత్ ' (మహావాతమునకు అనగా పెనుగాలికి కపిల విద్యుత్తు సూచకము) అను ఉదాహరణమందు వాత శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చినది.

**హితయోగే చ :** హిత శబ్దముతో సంబంధము ఉన్నప్పుడు చతుర్థీ విభక్తి చెప్పవలెను. 'బ్రాహ్మణాయ హితమ్ ' అనునది ఉదాహరణము.

## 50. క్రియార్థోపపదస్య చ కర్మణి స్థానినః (2-3-14)

**క్రియార్థా క్రియా ఉపపదం యస్య తస్య స్థానినోఽప్రయుజ్యమానస్య తుమునః కర్మణి చతుర్థీ స్యాత్. ఫలేభ్యో యాతి. ఫలాన్యాహర్తుం యాతీత్యర్థః. నమస్కుర్మో నృసింహాయ. నృసింహమనుకూలయితుమిత్యర్థః. ఏవం స్వయంభువే నమస్కృత్య ఇత్యాదావపి.**

**క్రియార్థోపపదస్య చ కర్మణి స్థానినః :** క్రియార్థోపపదస్య, చ, కర్మణి, స్థానినః అని పదచ్ఛేదము. క్రియార్థమైన క్రియ (ఒక క్రియ కొరకు మరొక క్రియ) ఉపపదము దేనికో అట్టి ప్రయోగింపబడని తుమున్ ప్రత్యయాంతపు కర్మవాచక శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును. క్రియార్థమైన క్రియ ఉపపదముగా ఉండగా తుమున్ ప్రత్యయం విధింపబడినది.

" ఫలేభ్యో యాతి " అనునది ఉదాహరణ " ఫలాని ఆహర్తుం యాతి " (ఫలములను తీసుకువచ్చుటకు వెళ్ళుచున్నాడు) ఈ వాక్యమున ఫలాహరణ క్రియ (ఫలములను తీసుకువచ్చుట), మఱియు యానక్రియ (వెళ్ళుట) అని రెండు క్రియలు ఉన్నవి.

ఫలాహరణక్రియ కొరకు క్రియ అనగా యానక్రియ. అది ఉపపదముగా గల అప్రయుజ్యమాన తుమున్నంతము " ఆహర్తుమ్ " అను శబ్దము ఆహరణక్రియలో కర్మ ఫలములు. కావున కర్మవాచక ఫలశబ్దమునకు చతుర్థీ విభక్తి విధించగ " ఫలేభ్యః " అని ఏర్పడినది.

అట్లే " నమస్కుర్మః నృసింహాయ " అను ఉదాహరణలో నృసింహశబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చినది. " నృసింహమ్ అనుకూలయితుం నమస్కుర్మః " నృసింహుని అనుకూలపరచుటకు నమస్కారము చేయుచున్నాము అని అర్థము.

అదే విధంగా " స్వయంభువే నమస్కృత్య " అను వాక్యము నందు " స్వయంభు" శబ్దమునకు కూడా చతుర్థీ విభక్తి వచ్చినది.

**51. తుమర్థాచ్చ భావవచనాత్ (2-3-15)**

**" భావవచనాశ్చ " ఇతి సూత్రేణ యో విహితః తదన్తాత్ చతుర్థీ స్యాత్. యాగాయ యాతి. యష్టుం యాతీత్యర్థః.**

**తుమర్థాచ్చ భావవచనాత్** : తుమర్థాత్, చ, భావవచనాత్ అని పదచ్ఛేదము. 'భావవచనాశ్చ' అను సూత్రము ద్వారా విధింపబడిన ప్రత్యయాంతము (ఘఞ్) పై చతుర్థీ విభక్తి వచ్చునని సూత్రార్థము. 'యాగాయ యాతి ' అనునపుడు ' యాగ ' శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును. "యష్టుం యాతి " = యాగము చేయుటకు వెళుచున్నాడని అర్థము.

**52. నమః స్వస్తి స్వాహాస్వధాలంవషడ్యోగాచ్చ (2-3-16)**

**ఏభిర్యోగే చతుర్థీ స్యాత్. హరయే నమః. (వ) " ఉపపదవిభక్తేః కారక విభక్తిః బలీయసీ " నమస్కరోతి దేవాన్. ప్రజాభ్యః స్వస్తి. అగ్నయే స్వాహా. పితృభ్యః స్వధా (వా) అలమితి పర్యాప్త్యర్థగ్రహణమ్ తేన దైత్యేభ్యో హరిరలం, ప్రభుః, సమర్థః, శక్తః ఇత్యాది. ప్రభ్వాదియోగే షష్ఠ్యపి సాధుః. "తస్మైప్రభవతి " "స ఏషాం గ్రామణీః" ఇతి నిర్దేశాత్. తేన ప్రభుర్బుభూషుర్భువనత్రయస్యేతి సిద్ధమ్. వషడిన్ద్రాయ. చకారః పునర్విధానార్థః. తేనాశీర్వివక్షాయాం పరామపి చతుర్థీ చాశిషీతి షష్ఠీం బాధిత్వా చతుర్థ్యేవ భవతి. స్వస్తి గోభ్యో భూయాత్.**

**నమః స్వస్తి స్వాహాస్వధాలం వషడ్యోగాచ్చ** : నమః స్వస్తిస్వాహాస్వధాలం వషడ్యోగాత్, చ అని పదచ్ఛేదము. నమః, స్వస్తి, స్వాహా, స్వధా, అలం, వషట్ అను శబ్దములతో యోగమున్నప్పుడు వీనితో సంబంధముగల శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును. హరయే నమః (విష్ణువుకు నమస్కారము) ఇచ్చట నమస్ శబ్ద సంయోగముచేతనున్న హరి శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చును. ఉపపదవిభక్తి కంటే కారకవిభక్తి బలవత్తరము. (పరిభాష) "నమః స్వస్తి ............. " అను ఈ ప్రస్తుత సూత్రము చేత విధింపబడిన చతుర్థీవిభక్తి ఉపపద విభక్తి. ' కర్మణి ద్వితీయా " అను సూత్రముచే విధింపబడిన ద్వితీయావిభక్తి కారకవిభక్తి.

" నమస్కరోతి దేవాన్ " అను ఉదాహరణమున చతుర్థీ మఱియు ద్వితీయా విభక్తి కూడ చెప్పడమునకు అవకాశమున్నది కాని ఉపపద విభక్తి కంటే కారక విభక్తియే బలవత్తరము అని పరిభాష చెప్పుచున్నది కావున ఇక్కడ ద్వితీయా విభక్తి మాత్రమే వచ్చును.



"ప్రజాభ్యః స్వస్తి" ( ప్రజలకు క్షేమమగుగాక ), "అగ్నయే స్వాహా" (అగ్నికి సమర్పించుచున్నాను), "పితృభ్యః స్వధా" (పితృ దేవతలకు సమర్పించుచున్నాను) అను ఉదాహరణములలో క్రమముగా స్వస్తి, స్వాహా, స్వధా అను శబ్దముల సంయోగముతో నున్న ప్రజా, అగ్ని, పితృ శబ్దములకు చతుర్థీవిభక్తి వచ్చినది.

**(వా) అలమితి పర్యాప్త్యర్థగ్రహణమ్** : ప్రస్తుత సూత్రములో నున్న ' అలమ్ ' అను శబ్దము " పర్యాప్తము " అనే అర్థమున గ్రహించవలెనని అర్థము. అందులకే " దైత్యేభ్యః హరిః అలమ్ " అనుచోట ' అలమ్ ' శబ్దయోగముతో నున్న దైత్యశబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చి ' దైత్యేభ్యః ' అని ఏర్పడును. అదే విధంగా " దైత్యేభ్యః హరిః ప్రభుః ", "దైత్యేభ్యః హరిః సమర్థః ' , " దైత్యేభ్యః హరిః శక్తః " అను ప్రయోగములలో కూడ పర్యాప్త్యర్థక ' అలం ' శబ్దము, మఱియు దాని పర్యాయములతో యోగముండుటచే 'దైత్య' శబ్దమునకు చతుర్థీ వచ్చినది. " ప్రభు " మొదలగు శబ్దములతో సంబంధమున్నప్పుడు చతుర్థీ విభక్తితో బాటు, షష్ఠీ విభక్తి కూడా చెప్పవచ్చును. " తస్మై ప్రభవతి సంతాపాదిభ్యః" అను పాణిని సూత్రమందు ప్రభవతి శబ్దముతో సంబంధమున్నప్పుడు " తస్మై " అని చతుర్థీవిభక్తి, ' స ఏషాం గ్రామణీః ' అను పాణిని సూత్రమందు ' గ్రామణీ ' శబ్ద సంబంధమున్నప్పుడు ' ఏషాం ' అని షష్ఠీ విభక్తి ప్రయోగింపబడినవి. ప్రభ్వాది యోగమందు షష్ఠీవిభక్తి కూడా సాధువే అనుటలో ప్రస్తుత సూత్రమే ప్రమాణము. ఈ విధంగా అంగీకరించుటచే ' ప్రభుర్బుభూషుః భువనత్రయస్య ' అను కవి ప్రయోగమందు 'భువనత్రయస్య ' అని షష్ఠీ విభక్తి సాధువైనది. అలాగే ' వషట్ ఇంద్రాయ ' ఇత్యాది స్థలములలో ' వషట్ ' శబ్ద యోగముచే ' ఇంద్ర ' శబ్దమునకు చతుర్థీ వచ్చును.

" నమః స్వస్తి ......... " అను సూత్రమున ' చకారము ' చతుర్థీ విభక్తికి పునర్విధానము కొరకు ప్రయోగింపబడినది. అందువలన ఆశీరర్థ వివక్ష యందు 'చతుర్థీచాశిషి ' అను అపర సూత్రము చేత విధింపబడు షష్ఠీ విభక్తిని కూడా బాధించి, ఈ సూత్రములో చతుర్థీ విభక్తియే వచ్చును.

" స్వస్తి గోభ్యః భూయాత్ " అను ఉదాహరణమందు స్వస్తి శబ్దము ఆశీరర్థమందు ప్రయోగింపబడినది. అయినను ప్రస్తుత సూత్రము ద్వారా చతుర్థీ విభక్తి విధింపగ 'గోభ్యః' అని ఏర్పడినది.

## 53. మన్యకర్మణ్యనాదరే విభాషాఽప్రాణిషు (2-3-17)

**ప్రాణవర్జే మన్యతేః కర్మణి చతుర్థీ వా స్యాత్తిరస్కారే. న త్వాం తృణం మన్యే తృణాయ వా. శ్యనా నిర్దేశాత్తానాదికయోగే న. నత్వాం తృణం మన్యే.**

**(వా)అప్రాణిష్విత్యపనీయ నౌకాకాన్నశుకశృగాలవర్జేష్వితి వాచ్యమ్. తేన ' నత్వాం నావమన్నం వా మన్యే ' ఇత్యత్రాప్రాణిత్వేపి చతుర్థీ న. ' న త్వాం శునే మన్యే ' ఇత్యత్ర ప్రాణిత్వేఽపి భవత్యేవ.**

**మన్యకర్మణ్యనాదరే విభాషాఽప్రాణిషు :** మన్యకర్మణి, అనాదరే, విభాషా, అప్రాణిషు అని పదచ్ఛేదము. ప్రాణివాచకము కాని ' మన ' ధాత్వర్థ కర్మ యందు వికల్పముగా చతుర్థీ విభక్తి తిరస్కారము గమ్యమానమైనప్పుడు వచ్చునని సూత్రార్థము.

' న త్వాం తృణం మన్యే తృణాయ వా ' (నిన్ను గడ్డిపోచగ కూడా నేను తలచుట లేదు ) అను వాక్యమున అనాదరము అనగా తిరస్కారము గమ్యమానమైనందున 'మన ' ధాత్వర్థ కర్మవాచకము అగు తృణ శబ్దమునకు వికల్పముగా చతుర్థీవిభక్తి వచ్చి తృణాయ, తృణం అను రూపద్వయం ఏర్పడినది.

' మన-జ్ఞానే ' అని దివాది గణములో, ' మను-అవబోధనే ' అని తనాది గణములో పఠింపబడినది. సూత్రములో ' మన్య ' అని ' శ్యన్ ' వికరణముతో (శ్యన్ ప్రత్యయం ) నిర్దేశము చేసినందున దివాదిగణ ధాతువునే గ్రహించవలెను. కావున తనాదిగణ " మను" ధాతువు ఉపయోగించినపుడు ' న త్వాం తృణం మన్యే ' అను ఉదాహరణ మందు చతుర్థీ విభక్తి రాదు.

**(వా) " అప్రాణిష్విత్యపనీయ నౌకాకాన్నశుకశృగాలవర్జేష్వితి వాచ్యమ్.** ఈ సూత్రమున ' అప్రాణిషు ' అనుపదమును తీసివేసి ' నౌ ', ' కాక ', ' అన్న ', ' శుక ' , ' శృగాల ' శబ్దములు తప్ప మిగిలిన మన ధాత్వర్థకర్మ వాచకముల కంటే అని చెప్పవలెను. ఇట్లు చెప్పుటవలన ' న త్వాం నావమన్నం వా మన్యే ' అను వాక్యమున నౌ శబ్దము ప్రాణివాచకము కాకపోయిననూ చతుర్థీవిభక్తి రాదు. ' న త్వాం శునే మన్యే ' అనునపుడు ' శ్వన్' శబ్దము ప్రాణివాచకమయినా చతుర్థీ విభక్తి వచ్చును.

## 54. గత్యర్థకర్మణి ద్వితీయాచతుర్థ్యౌ చేష్టాయామనధ్వని (2-3-12)

**అధ్వభిన్నే గత్యర్థానాం కర్మణి ఏతే స్తశ్చేష్టాయామ్.** గ్రామం గ్రామాయ వా



**గచ్ఛతి. చేష్టాయాం కిమ్ ? మనసా హరిం వ్రజతి. అనధ్వనీతి కిమ్ ? పన్థానం గచ్ఛతి. గన్త్రాఽధిష్ఠితేఽధ్వన్యేవాయం నిషేధః. యదా తూత్పథాత్పన్థా ఏవాక్రమితుమిష్యతే తదా చతుర్థీ భవత్యేవ. ఉత్పథేన పథే గచ్ఛతి.**

**గత్యర్థకర్మణి ద్వితీయాచతుర్థ్యౌ చేష్టాయా మనధ్వని :** గత్యర్థకర్మణి, ద్వితీయా చతుర్థ్యౌ, చేష్టాయామ్, అనధ్వని అని పదచ్ఛేదము. అధ్వభిన్నమైన గత్యర్థక ధాతువుల కర్మార్థ మందు ద్వితీయా, చతుర్థీ విభక్తులు చేష్టార్థము గమ్యమానమైనపుడు వచ్చును. "గ్రామం గ్రామాయ వా గచ్ఛతి " అని ఉదాహరణ. గత్యర్థక ధాతువు గమక ధాతువు. గమధాత్వర్థ కర్మ గ్రామము. ఇచ్చట చేష్ట అనగా కదలిక గమ్యమానమైనది. కావున అధ్వభిన్నమైన గ్రామ శబ్దమునకు ద్వితీయా విభక్తి మఱియు చతుర్థీ విభక్తి కూడ వచ్చి గ్రామం, గ్రామాయ అను రూపద్వయ మేర్పడును.

చేష్టార్థ మందే ఈ సూత్రము ప్రవర్తించుటచే " మనసా హరిం వ్రజతి " (మనస్సుతో హరిని పొందుచున్నాడు ) అను స్థలమందు శారీరకమైన చేష్ట ఏమియూ లేనందున కర్మవాచకమైన హరి శబ్దమునకు ద్వితీయా, చతుర్థీ విభక్తులు రెండూ ప్రవర్తించవు. కేవలం తృతీయా విభక్తి మాత్రమే వచ్చును.

అధ్వభిన్నమైన కర్మవాచక శబ్దమునకే ఈ సూత్రము ప్రవర్తించును గావున అధ్వవాచక 'పథిన్ ' శబ్దమునకు ఈ సూత్రము రాదు. గావున ' పన్థానం గచ్ఛతి' అను ప్రయోగమందు ద్వితీయాచతుర్థీ విభక్తులు రెండూ ప్రవర్తించక కేవలం ద్వితీయా విభక్తి మాత్రమే చెప్పబడినది.

గన్త (నడుచువాడు) చేత ఆక్రాంతమైన అధ్వయందే ఈ ' అనధ్వని ' అను నిషేధము ప్రవర్తించును. ఉత్పథము నుండి అనగా అమార్గము (మార్గము కాని మార్గము) నుండి మార్గమును పొందవలెనని కోరినప్పుడు ఈ నిషేధము ప్రవర్తించదు. అచ్చట చతుర్థీ విభక్తి ప్రవర్తించును. కావున 'ఉత్పథేన పథే గచ్ఛతి' అను స్థలమందు పథిన్ శబ్దమునకు చతుర్థీ విభక్తి వచ్చినది. అనగా "ఒక వ్యక్తి ఉజ్జయినీ నగరమునకు వెళ్లవలెనని బయలుదేరి తెలియక ఆ మార్గము నుండి తప్పిపోయి వేరే మార్గమును ప్రవేశించాడు. ఇప్పుడు దానిని విడిచి మరల ఉజ్జయినీ మార్గమును పొందవలెనని కోరుచున్నాడని" భావము. ఇచ్చట 'పథిన్' శబ్దార్థము ఉజ్జయినీ మార్గము గన్తచేత అధిష్ఠితము కాదు కావున 'అనధ్వని' అను నిషేధము ప్రవర్తించక, చతుర్థీ విభక్తి ప్రవర్తించి ' పథే ' అను రూపమేర్పడును.

**చతుర్థీ విభక్తి సమాప్తము**

# అథ పంచమీ విభక్తిః

## 55. ధ్రువమపాయేఽపాదానమ్ (1-4-24)

**అపాయో విశ్లేషః తస్మిన్ సాధ్యే ధ్రువమవధిభూతం కారకమపాదానం స్యాత్.**

**ధ్రువమపాయేఽపాదానమ్ :** ధ్రువమ్, అపాయే, అపాదానమ్ అని పదచ్ఛేదము. అపాయమనగా విశ్లేషము విడివడుట అని అర్థము. ధ్రువమనగా అవధి. ఏదేని వస్తువు నుండి మరొక వస్తువు వేరవతుందని చెప్పినప్పుడు ఆ విశ్లేషమునకు అవధియైన వస్తువు అపాదానసంజ్ఞకమగును. అనగా విశ్లేషము సాధ్యమైనప్పుడు అవధిభూతమగు (నిశ్చలమైనది) కారకము అపాదానసంజ్ఞ కలదియగును.

## 56. అపాదానే పఞ్చమీ (2-3-28)

**గ్రామాదాయాతి. ధావతోఽశ్వాత్పతతి. కారకం కిమ్ ? వృక్షస్య పర్ణం పతతి. (వా) జుగుప్సావిరామప్రమాదార్థానాముపసంఖ్యానమ్.**

**పాపాజ్జుగుప్సతే, విరమతి. ధర్మాత్ప్రమాద్యతి.**

**అపాదానే పఞ్చమీ :** అపాదానే, పఞ్చమీ అని పదచ్ఛేదము. అపాదానార్థమున అపాదానసంజ్ఞకమగు శబ్దమునకు పంచమీ విభక్తి విధింపబడును.

'వృక్షాత్ పర్ణం పతతి' (వృక్షము నుండి ఆకు పడుచున్నది) అనుచోట వృక్షమునకు, ఆకుకు వియోగమ్ కలిగినది. అట్టి వియోగము కల్గినపుడు నిశ్చలముగా ఉన్న అవధిభూత కారకము వృక్షము కావున వృక్ష శబ్దమునకు అపాదాన సంజ్ఞ విధింపబడి, పఞ్చమీ విభక్తి వచ్చి 'వృక్షాత్' అను రూపమేర్పడినది.

**గ్రామాదాయాతి :** ( గ్రామాత్ ఆ యాతి - గ్రామము నుండి వచ్చుచున్నాడు ) గ్రామమునకు వ్యక్తికి వియోగము కలిగినది. ఇచట విశ్లేషమునకు అవధియైనది గ్రామము కనుక గ్రామ శబ్దమునకు అపాదాన సంజ్ఞ, మఱియు పంచమీ విభక్తి కూడ విధించగ, 'గ్రామాత్' అని అయినది.

**ధావతః అశ్వాత్ పతతి :** (పరిగెత్తుచున్న అశ్వము నుండి పడిపోవుచున్నాడు) ప్రస్తుత సూత్రమందలి 'ధ్రువ' శబ్దమునకు అవధియని అర్థమే కాని స్థిరమైనదనే అర్థము కాదు. ఇచట పతన క్రియకు అవధిభూతమైన అశ్వమునకు అపాదాన సంజ్ఞ, పఞ్చమీ



విభక్తి కూడ ప్రవర్తించగా, 'అశ్వాత్' అని సిద్ధించినది.

ఈ సూత్రాధారంగా అవధిభూతమైన కారకమునకే అపాదాన సంజ్ఞ విధింపబడుటచే "వృక్షస్య పర్ణం పతతి" అనుచోట షష్ఠ్యంతోపాత్తమైన 'వృక్ష' శబ్దము కారకము కాదు కావున పఞ్చమీ రాదు.

**(వా) జుగుప్సా విరామ ప్రమాదార్థానాముపసంఖ్యానమ్**

జుగుప్స, విరామ, ప్రమాద అను అర్థముగల ధాతువులతో సంబంధమున్నప్పుడు కూడ అపాదాన సంజ్ఞ ప్రవర్తించునని వార్తికము చెప్పుచున్నది. "పాపాత్ జుగుప్సతే" (పాప విషయమందు అసహ్యించుకొనుచున్నాడు) అను ఉదాహరణలో పాప శబ్దమునకు అపాదాన సంజ్ఞ మఱియు పఞ్చమీ వచ్చి 'పాపాత్' అని అయ్యెను. అట్లే పాపాద్ విరమతి, ధర్మాత్ ప్రమాద్యతి ఇత్యాది ఉదాహరణములు కూడ సిద్ధించును.

## 57. భీత్రార్థానాం భయహేతుః (1-4-25)

**భయార్థానాం త్రాణార్థానాం చ ప్రయోగే భయహేతురపాదానం స్యాత్. చోరాద్బిభేతి. చోరాత్త్రాయతే, భయహేతుః కిమ్ ? అరణ్యే బిభేతి త్రాయతే వా.**

**భీత్రార్థానాం భయహేతుః :** భీత్రార్థానాం, భయహేతుః అని ద్విపదమీ సూత్రము. 'భీ' ధాతువుకు భయము, త్రై ధాతువుకు రక్షణము అని అర్థము. భయార్థకములు, రక్షణార్థకములగు ధాతువులను ప్రయోగించినప్పుడు భయహేతువునకు అపాదానసంజ్ఞ వచ్చును. 'చోరాత్ బిభేతి' అను ఉదాహరణమందు భయార్థక 'భీ' ధాతువు ప్రయోగింపబడినది. కావున భయ హేతువైన 'చోర' శబ్దమునకు అపాదాన సంజ్ఞ, పఞ్చమీ విభక్తి వచ్చినవి. 'చోరాత్ త్రాయతే' అనునపుడు రక్షణార్థక 'త్రై' ధాతువున్నది కావున భయహేతువైన చోర శబ్దమునకు అపాదానసంజ్ఞ, పఞ్చమీ విభక్తి వచ్చినవి.

భయహేతువునకే ఈ సూత్రముచే అపాదాన సంజ్ఞ విధింపబడుట వలన "అరణ్యే బిభేతి, త్రాయతే వా" అను స్థలమందు అరణ్య శబ్దమునకు అపాదాన సంజ్ఞ రాదు.

## 58. పరాజేరసోఢః (1-4-26)

**పరాజేః ప్రయోగే అసహ్యోఽర్థోఽపాదానం స్యాత్. అధ్యయనాత్పరాజయతే. గ్లాయతీత్యర్థః అసోఢః కిమ్ ? శత్రూన్ పరాజయతే. అభిభవతీత్యర్థః.**

**పరాజేరసోఢః** : పరాజేః, అసోఢః అని పదచ్ఛేదము. ' పరా ' అను ఉపసర్గ పూర్వకమైన ' జి ' ధాతువును ఉపయోగించినపుడు అసోఢ పదమునకు అనగా సహించుటకు శక్యము కానిది అనునర్థములో అపాదానసంజ్ఞ వచ్చును.

' అధ్యయనాత్ పరాజయతే ' అధ్యయనము నుండి పరాజయము పొందుచున్నాడని అర్థము. ఇచ్చట అసహ్యపదార్థము అధ్యయనము. దానికి అపాదాన సంజ్ఞ వచ్చినది. ఈ సూత్రముచే అసహ్యపదార్థమునకే అపాదాన సంజ్ఞ విధింపబడుట వలన " శత్రూన్ పరాజయతే ' అనునపుడు పరాజయతే అనునది తిరస్కరించుచున్నాడు అనే అర్థమున వాడబడుటవలన శత్రు శబ్దమునకు అపాదానసంజ్ఞ చెప్పబడలేదు.

## 59. వారణార్థానామీప్సితః (1–4–27)

**ప్రవృత్తివిఘాతో వారణమ్. వారణార్థానాం ధాతూనాం ప్రయోగే ఈప్సితోఽర్థోపాదానం స్యాత్. యవేభ్యో గాం వారయతి. ఈప్సితః కిమ్ ? యవేభ్యో గాం వారయతి క్షేత్రే.**

**వారణార్థానామీప్సితః** : వారణార్థానాం, ఈప్సితః అని పదచ్ఛేదము. 'వారణము' అనగా ప్రవృత్తి విఘాతము అనగా ప్రవర్తించుటకు విఘాతము కలిగించుట అని అర్థము. వారణార్థక ధాతువులు ప్రయోగించినపుడు ఈప్సితమగు అర్థము గలదానికి అపాదాన సంజ్ఞ వచ్చును.

' యవేభ్యో గాం వారయతి ' అను ఉదాహరణమందు ' యవ ' శబ్దమునకు ఈ సూత్రముచే అపాదానసంజ్ఞ వచ్చినది. ఈప్సితమునకే ఈ సూత్రముచేత అపాదానసంజ్ఞ విధింపబడుటచే ' యవేభ్యః గాం వారయతి క్షేత్రే ' అను ఉదాహరణలో క్షేత్రపదమునకు అపాదాన సంజ్ఞ రాదు.

## 60. అన్తర్ధౌ యేనాదర్శనమిచ్ఛతి (1–4–28)

**వ్యవధానే సతి యత్కర్తృకస్యాత్మనో దర్శనస్యాభావమిచ్ఛతి తదపాదానం స్యాత్. మాతుర్నిలీయతే కృష్ణః. 'అన్తర్ధౌ ' కిమ్ ? చోరాన్నదిదృక్షతే. 'ఇచ్ఛతి' గ్రహణం కిమ్? అదర్శనేచ్ఛాయాం సత్యాం సత్యపి దర్శనే యథా స్యాత్.**

**అన్తర్ధౌ యేనాదర్శనమిచ్ఛతి** : అన్తర్ధౌ, యేన, అదర్శనం, ఇచ్ఛతి అని పదచ్ఛేదము. 'అన్తర్ధౌ ' అనగా వ్యవధానమని అర్థము. వ్యవధానముండగా ఎవరు తనని చూడకూడదని కోరుకుంటాడో ఆ వ్యక్తి అపాదానసంజ్ఞక మగును.



' మాతుః నిలీయతే కృష్ణః ' అనగా కృష్ణుడు తనను తల్లి చూడకూడదని తలచి దాగుకొనుచున్నాడు అని అర్థము. మాతృ శబ్దమునకు అపాదానసంజ్ఞ , పంచమీ విభక్తి కూడా చెప్పబడినవి. వ్యవధానమందే ఈ సూత్రము ప్రవర్తించుట వలన " చోరాన్ న దిదృక్షతే ' అనునపుడు అపాదానసంజ్ఞ రాదు. ఈ సూత్రమందు ' ఇచ్ఛతి ' పదమును వాడుటచే అదర్శనము యొక్క ఇచ్ఛ (కోరిక) ఉన్నప్పుడు దర్శనము కలిగినా కూడా ఈ సూత్రము చేత అపాదానసంజ్ఞ ప్రవర్తించును.

## 61. ఆఖ్యాతోపయోగే (1–4–29)

**నియమపూర్వకవిద్యాస్వీకారే వక్తా ప్రాక్సంజ్ఞః స్యాత్. ఉపాధ్యాయాదధీతే. ఉపయోగే కిమ్ ? నటస్య గాథాం శృణోతి.**

**ఆఖ్యాతోపయోగే** : ఆఖ్యాతా, ఉపయోగే అని పదచ్ఛేదము. నియమపూర్వక విద్యా స్వీకారమును ఉపయోగమందురు. ఆఖ్యాత అనగా ' వక్త ' అని అర్థము. ఉపయోగార్థ మందు ఆఖ్యాత (వక్త) కు అపాదానసంజ్ఞ వచ్చును.

' ఉపాధ్యాయాదధీతే ' (ఉపాధ్యాయుని వద్ద అధ్యయనం చేయుచున్నాడు) అను ఉదాహరణమున వక్త యగు ఉపాధ్యాయునకు అపాదానసంజ్ఞ వచ్చును. ఉపయోగార్థ మందే ఈ సూత్రము చెప్పవలెను. కావున ' నటస్య గాథాం శృణోతి ' అనుచోట నట శబ్దమునకు అపాదాన సంజ్ఞ రాదు.

## 62. జనికర్తుః ప్రకృతిః (1–4–30)

**జాయమానస్య హేతురపాదానం స్యాత్. బ్రహ్మణః ప్రజాః ప్రజాయన్తే.**

**జనికర్తుః ప్రకృతిః** : జనికర్తుః, ప్రకృతిః అని పదచ్ఛేదము. ' జని ' శబ్దమునకు 'ఉత్పత్తి' అని, ' జనికర్త ' అనగా ' పుట్టువాడు ' అని అర్థము. ' ప్రకృతి ' శబ్దమునకు ' హేతువు' అని అర్థము. పుట్టుదాని హేతువునకు అపాదానసంజ్ఞ వచ్చును.

' బ్రహ్మణః ప్రజాః ప్రజాయన్తే ' అను వాక్యమున పుట్టువారు ప్రజలు, హేతువు బ్రహ్మ కావున బ్రహ్మ శబ్దమునకు అపాదానసంజ్ఞ వచ్చినది.

## 63. భువః ప్రభవః (1–4–31)

**భవనం భూః భూకర్తుః ప్రభవస్తథా. హిమవతో గఙ్గా ప్రభవతి. తత్ర ప్రకాశతే**

**ఇత్యర్థః.**

**భువః ప్రభవః** : భువః, ప్రభవః అని పదచ్ఛేదము. పూర్వ సూత్రము నుండి " కర్తుః " అను పదము అనువర్తించును. ఆ పదము " భువః " అను పదముతో అన్వయించును, " భు" శబ్దమునకు భవనము, ప్రభవ శబ్దమునకు మొదటి ప్రకాశస్థానమని అర్థము. భవనకర్త యొక్క ప్రథమ ప్రకాశస్థానమునకు అపాదానసంజ్ఞ వచ్చును.

' హిమవతో గంగా ప్రభవతి ' అను స్థలమందు భవనకర్త (ఉండునది) గంగ. గంగ మొదటగా హిమవత్ పర్వతముపై ప్రకాశించుచున్నది. కావున గంగకు ప్రథమ ప్రకాశస్థానమైన హిమవత్ శబ్దమునకు అపాదానసంజ్ఞ వచ్చినది.

**(వా) ల్యబ్లోపే కర్మణ్యధికరణే చ**

**ప్రాసాదాత్ ప్రేక్షతే. ఆసనాత్ ప్రేక్షతే. ప్రాసాదమ్ ఆరుహ్య ఆసనే ఉపవిశ్య ప్రేక్షతే ఇత్యర్థః. శ్వశురాత్ జిహ్రేతి. శ్వశురం వీక్ష్యేత్యర్థః.**

ల్యప్ ప్రత్యయాంత శబ్దమును ప్రయోగించనప్పుడు కర్మకు, అధికరణమునకు కూడ అపాదానసంజ్ఞ వచ్చును.

' ప్రాసాదాత్ ప్రేక్షతే ' – ప్రాసాదమ్ ఆరుహ్య ప్రేక్షతే (మేడపై ఎక్కి చూచుచున్నాడు) అనునపుడు ' ఆరుహ్య ' అను ' ల్యప్ ' అంతముగా గల శబ్దము ప్రయోగింపబడలేదు. కావున కర్మయగు ప్రాసాద శబ్దమునకు అపాదాన సంజ్ఞ విధింపబడినది.

' ఆసనాత్ ప్రేక్షతే ' ( ఆసనే ఉపవిశ్య ప్రేక్షతే – ఆసనమందు కూర్చుని చూచుచున్నాడు) అను స్థలమందు కూడ ' ఉపవిశ్య ' అను ' ల్యప్ ' అన్త శబ్దము ప్రయోగింపబడలేదు. అధికరణమైన ఆసన శబ్దమునకు అపాదానసంజ్ఞ చెప్పబడినది.

' శ్వశురాత్ జిహ్రేతి ' (శ్వశురం వీక్ష్య జిహ్రేతి = మామగారిని చూచి సిగ్గుపడుచున్నాడు) అను ఉదాహరణమందు ' వీక్ష్య ' అను ' ల్యబంత ' శబ్దప్రయోగము లేదు. కర్మయగు శ్వశుర శబ్దమునకు అపాదానసంజ్ఞ వచ్చినది.

**(వా) గమ్యమానాఽపి క్రియా కారక విభక్తీనాం నిమిత్తమ్. కస్మాత్త్వం ? నద్యాః.**

క్రియా వాచక శబ్దమేమీ ఉచ్చరింపబడక, క్రియ గమ్యమానమైనప్పటికిని అది కారక విభక్తులు ప్రవర్తించుటలో నిమిత్తమగును. కస్మాత్ త్వం ? (ఎచ్చటి నుండి



వచ్చితివి) అనునపుడు క్రియ గమ్యమానమగుచున్నది కావున ' కిమ్ ' శబ్దమునకు పంచమీ విభక్తి వచ్చినది. అట్లే " నద్యాః " (నది నుండి వచ్చాను) అనునపుడు కూడ క్రియ గమ్యమానమగుచున్నది. అందుకే నదీ శబ్దమునకు పంచమీ విభక్తి వచ్చినది.

**(వా) యతశ్చాధ్వకాలనిర్మాణం తతః పఞ్చమీ**

దేని నుండి అధ్వ (మార్గమును) మరియు కాలమును కొలిచెదమో అట్టి శబ్దములకు పంచమీ విభక్తి వచ్చును.

**(వా) తద్యుక్తాదధ్వనః ప్రథమాసప్తమ్యౌ**

పంచమ్యంతముతో కూడుకొనియున్న అధ్వ వాచక శబ్దమునకు ప్రథమా, సప్తమీ విభక్తులు విధింపబడును.

**(వా) కాలాత్ సప్తమీ చ వక్తవ్యా**

పంచమ్యంతముతో కూడుకొనియున్న కాలవాచక శబ్దమునకు సప్తమీ విభక్తి వచ్చును.

' వనాత్ గ్రామో యోజనం యోజనే వా ' వనము నుంచి గ్రామము యోజనము దూరంలో ఉన్నది.

' కార్తిక్యాః ఆగ్రహాయణీ మాసే ' కార్తీక పౌర్ణమాసి అవధి గల మాసము తర్వాత మార్గశీర్ష పౌర్ణమాసి అనునవి క్రమముగా ఉదాహరణములు.

## 64. అన్యారాదితరర్తేదిక్ శబ్దాఞ్చూత్తరపదాజాహియుక్తే (2-3-29)

**ఏతైర్యోగే పఞ్చమీ స్యాత్. అన్య ఇత్యర్థగ్రహణమ్. ఇతరగ్రహణం ప్రపఞ్చార్థమ్. అన్యో భిన్న ఇతరో వా కృష్ణాత్. ఆరాద్వనాత్. ఋతే కృష్ణాత్. పూర్వో గ్రామాత్. దిశి దృష్టశ్శబ్దో దిక్శబ్దః. తేన సంప్రతి దేశకాలవృత్తినా యోగేఽపి భవతి. చైత్రాత్పూర్వః ఫాల్గునః. అవయవవాచియోగే తు న, " తస్య పరమామ్రేడితమ్ " ఇతి నిర్దేశాత్. పూర్వం కాయస్య. అఞ్చూత్తరపదస్య తు దిక్ శబ్దత్వేపి " షష్ఠ్యతసర్థ" ఇతి షష్ఠీం బాధితుం పృథగ్గ్రహణమ్. ప్రాక్, ప్రత్యక్ వా గ్రామాత్. ఆచ్, దక్షిణా గ్రామాత్. ఆహి-దక్షిణాహి గ్రామాత్. అపాదానే పఞ్చమీతి సూత్రే ' కార్తిక్యాః ప్రభృతీ ' తి భాష్యప్రయోగాత్ ప్రభృత్యర్థ యోగే పఞ్చమీ. భవాత్ప్రభృతి ఆరభ్య వా సేవ్యో హరిః. ' అపపరిబహిరితి ' సమాసవిధానాత్ జ్ఞాపకాద్బహిర్యోగే పఞ్చమీ. గ్రామాద్బహిః.**

**అన్యారాదితరర్తే దిక్ శబ్దాఞ్చూత్తర పదాజాహియుక్తే** : ఇది ఏకపద సూత్రము. అన్య, ఆరాత్, ఇతర, ఋతే, దిక్ శబ్దః, అఞ్చూత్తర పద, ఆచ్, ఆహి అను ఈ ఎనిమిదింటితో యోగమున్నపుడు పంచమీ విభక్తి వచ్చును.

అన్య శబ్దముచే అన్యార్థక శబ్దములను కూడ గ్రహించవలెను. సూత్రములో ఇతర శబ్దము అన్యార్థక మయిననూ, స్పష్టార్థమై పృథక్ ఉపాత్తమైనది. " అన్యో భిన్న ఇతరో కృష్ణాత్ " అనునది ఉదాహరణ. అన్యార్థక శబ్దములతోనున్న కృష్ణ శబ్దమునకు పంచమీ వచ్చును. అట్లే ' ఆరాత్ వనాత్ ' ' ఋతే కృష్ణాత్ ' ' పూర్వో గ్రామాత్ ' ఇత్యాదులందు కూడ పంచమీ విభక్తి ప్రవర్తించినది.

దిక్ శబ్దముచే ' దిక్ ' విశేష వాచకములగు పూర్వాది శబ్దములు గ్రహింపబడును. ఈ విధముగా చెప్పుటచే దేశకాల వాచకములగు పూర్వాది శబ్దములతో యోగమున్నపుడు కూడా " చైత్రాత్ పూర్వః ఫాల్గునః " మొదలగు వాక్యములందు పంచమీ విభక్తి వచ్చును. పూర్వాది శబ్దములు అవయవవాచకములు అయినచో ఈ పంచమీ విభక్తి రాదు. ఈ విధంగా చెప్పుటలో ' తస్య పరమామ్రేడితమ్ ' అను సూత్రనిర్దేశమే ప్రమాణము. అందువలన ' పూర్వం కాయస్య ' అను స్థలమందు అవయవవాచకమైన పూర్వ శబ్దముతో కలిపి చెప్పినపుడు పంచమీ విభక్తి రాదు.

ప్రాక్, ప్రత్యక్ మొదలగు అఞ్చు ధాతువు ఉత్తరపదముగా గల శబ్దములు దిక్ శబ్దములయిననూ వాటితో ఉపయోగించినపుడు " షష్ఠ్యతసర్థప్రత్యయేన " అను సూత్రముచే పరము గావున షష్ఠీ విభక్తి చెప్పబడినది. దానిని బాధించుటకై ఆఞ్చూత్తరపద యోగమున్నప్పుడు మరల పంచమీ విభక్తి విధింపబడుచున్నది " ప్రాక్ ప్రత్యగ్ వా గ్రామాత్" ఇత్యాది ఉదాహరణములలో.

' ఆచ్ ' ప్రత్యయాంతముతోనున్నప్పుడు ' దక్షిణా గ్రామాత్ ' అని, ' ఆహి ' ప్రత్యయాంతముతోనున్నప్పుడు ' దక్షిణాహి గ్రామాత్ ' అని కూడ పంచమీ విభక్తి సిద్ధించినది.

' అపాదానే పంచమీ ' అను సూత్రభాష్యమున ' కార్తిక్యాః ప్రభృతి ' అని ప్రయోగింపబడుటచే ప్రభృతి అర్థము గల శబ్దములతో కలిపి చెప్పినపుడు కూడా పంచమీ విభక్తి వచ్చును. ' ప్రభృతి ' శబ్దమునకు ' మొదలగు ' అని అర్థము. దీనికి ' భవాత్ ప్రభృది ఆరభ్య వా సేవ్యో హరిః ' అనునది ఉదాహరణము.



" అపపరిబహిరఞ్చవః పఞ్చమ్యా " అను సూత్రము ద్వారా ' బహిః ' శబ్దమునకు పంచమ్యంతముతో సమాసము విధింపబడుటచే " గ్రామాత్ బహిః " అనెడి ఉదాహరణములందు ' బహిః ' శబ్దముతో నుపయోగింపబడిన గ్రామాది శబ్దములకు కూడ పంచమీ వచ్చునని తెలియుచున్నది.

## 65. అపపరీ వర్జనే (1-4-88)

**ఏతౌ వర్జనే కర్మప్రవచనీయౌ స్తః.**

**అపపరీ వర్జనే** : అపపరీ, వర్జనే అని పదచ్ఛేదము. ' కర్మప్రవచనీయాః ' అను అధికార సూత్రము అనువర్తించును. వర్జనార్థ మందు ' అప, పరి ' అనువాటికి కర్మ ప్రవచనీయ సంజ్ఞ వచ్చును.

## 66. ఆఙ్మర్యాదావచనే (1-4-89)

**ఆఙ్ మర్యాదాయాముక్తసంజ్ఞః స్యాత్. వచనగ్రహణాత్ అభివిధౌ అపి.**

**ఆఙ్ మర్యాదావచనే** : ఆఙ్, మర్యాదావచనే అని పదచ్ఛేదము. 'తేన వినా ఇతి మర్యాదా', ' తేన సహ ఇతి అభివిధిః ' హద్దుగా చెప్పుస్థలమందు దానిని విడిచిపెట్టి చెప్పినచో 'మర్యాద ' అని, దానిని కలుపుకొని చెప్పినచో ' అభివిధి ' అని చెప్పబడెను.

' మర్యాద ' అర్థమందు ఆఙ్ కర్మ ప్రవచనీయ సంజ్ఞ కలది యగును. ' ఆఙ్ మర్యాదాయాం ' అని మాత్రమే సూత్రము చెప్పిన సరిపోవుచుండగా, ' వచన ' గ్రహణముచే 'అభివిధి ' అను అర్థమందు కూడా కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చునని తెలుపబడినది.

## 67. పఞ్చమ్యపాఙ్ పరిభిః (2-3-10)

**ఏతైః కర్మప్రవచనీయైర్యోగే పఞ్చమీ స్యాత్. అప హరేః, పరి హరేః, సంసారః, పరిరత్ర వర్జనే. లక్షణాదౌ తు హరిం పరి. ఆ ముక్తేః సంసారః, ఆ సకలాత్ బ్రహ్మ.**

**పఞ్చమ్యపాఙ్ పరిభిః** : పంచమీ, అపాఙ్ పరిభిః అని పదచ్ఛేదము. కర్మప్రవచనీయములైన అప, ఆఙ్, పరి అను వాటితో యోగమున్నప్పుడు పంచమీ విభక్తి విధింపబడును.

అపహారేః, పరిహారేః సంసారః , అనుచోట అప, పరి అను శబ్దములు వర్జనార్థములో (విడిచిపెట్టుట) ప్రయోగింపబడినవి.

హరిని విడిచిపెట్టి సంసారం (జగత్తు) అని అర్థము. లక్షణాద్యర్థక పరిశబ్దముతో నున్నప్పుడు మాత్రము ' హరిం పరి ' ఇత్యాదులందు ద్వితీయా విభక్తియే వచ్చును. మర్యాదార్థకమైన ' ఆఙ్ ' వాడినపుడు " ఆముక్తేః సంసారః " (ముక్తిని విడిచిపెట్టి సంసారము ) అని అభివిధ్యర్థక ' ఆఙ్ ' వాడినపుడు " ఆ సకలాత్ బ్రహ్మ " (సకలము వ్యాపించి బ్రహ్మ ఉండును) అని ఉదాహరణములు.

## 68. ప్రతిః ప్రతినిధిప్రతిదానయోః (1-4-92)

**ఏతయోరర్థయోః ప్రతిరుక్తసంజ్ఞః స్యాత్**

ప్రతిః ప్రతినిధిప్రతిదానయోః అని పదచ్ఛేదము. ప్రతినిధి, ప్రతిదానము ఈ అర్థముల యందు ' ప్రతి ' యనునది కర్మప్రవచనీయ సంజ్ఞ కలది యగును.

## 69. ప్రతినిధిప్రతిదానే చ యస్మాత్ (2-3-11)

**అత్ర కర్మప్రవచనీయైర్యోగే పఞ్చమీ స్యాత్. ప్రద్యుమ్నః కృష్ణాత్ ప్రతి. తిలేభ్యః ప్రతియచ్ఛతి మాషాన్.**

**ప్రతినిధిప్రతిదానే చ యస్మాత్ :** ప్రతినిధిప్రతిదానే, చ, యస్మాత్ అని పదచ్ఛేదము. ఈ సూత్రమందు " యస్మాత్ " అను పదము " యస్య " అను షష్ఠ్యర్థములో ప్రయోగింపబడినది.

దేనితో సంబంధము గలవిగా ప్రతినిధి ప్రతిదానములు వాడబడుచున్నవో ఆ శబ్దమునకు కర్మ ప్రవచనీయములతో యోగమున్నప్పుడు పంచమీ విభక్తి వచ్చును.

ప్రతినిధి అర్థమునకు " ప్రద్యుమ్నః కృష్ణాత్ ప్రతి " (యుద్ధాదుల యందు ప్రద్యుమ్నుడు కృష్ణుడు లాంటివాడు) అని ప్రతిదాన అర్థమునకు " తిలేభ్యః ప్రతియచ్ఛతి మాషాన్ " అని ఉదాహరణములు.

## 70. అకర్తర్యృణే పఞ్చమీ (2-3-24)

**కర్తృవర్జితం యదృణం హేతుభూతం తతః పఞ్చమీ స్యాత్. శతాత్ బద్ధః. అకర్తరి కిమ్ ? శతేన బన్ధితః.**



**అకర్తర్యృణే పఞ్చమీ :** అకర్తరి, ఋణే, పఞ్చమీ అని పదచ్ఛేదము. " హేతౌ " అను సూత్రము అనువర్తించును. కర్తృ సంజ్ఞ లేని హేతుభూతమైన ఋణము ఏది కలదో తద్వాచక శబ్దమునకు పంచమీ విభక్తి వచ్చును.

" శతాత్ బద్ధః " (నూరు సువర్ణాది రూపమైన ఋణముచే బంధింపబడినాడు ) అను ఉదాహరణలో ' శత ' శబ్దమునకు హేతు సంజ్ఞ మాత్రమే కలదు.

' శతేన బన్ధితః ' అను ణ్యంతస్థలమున ' శతం ' నకు హేతుసంజ్ఞతో పాటు కర్తృసంజ్ఞ కూడా ఉండుటచే ఈ సూత్రము కాకుండ, ' హేతౌ ' అను సూత్రము చేత తృతీయా విభక్తి వచ్చును.

## 71. విభాషా గుణేఽస్త్రియామ్ (2-3-25)

**గుణే హేతావస్త్రీలిఙ్గే పఞ్చమీ వా స్యాత్. జాడ్యాత్ - జాడ్యేన వా బద్ధః. గుణే కిమ్ ? ధనేన కులమ్. అస్త్రియాం కిమ్ ? బుద్ధ్యా ముక్తః. ' విభాషా ' ఇతి యోగవిభాగాదగుణే స్త్రియాఞ్చ క్వచిత్. ధూమాదగ్నిమాన్. నాస్తి ఘటోఽనుపలబ్ధేః.**

**విభాషా గుణేఽస్త్రియామ్ :**

విభాషా, గుణే, అస్త్రియామ్ అని పదవిభాగము. ఇచ్చట 'హేతౌ ' అను సూత్రము అనువర్తించును. స్త్రీలింగ మందు కానటువంటి, గుణభూత హేతు వాచక శబ్దమునకు పంచమీ విభక్తి వైకల్పికముగా వచ్చును.

" జాడ్యాత్ జాడ్యేన వా బద్ధః " అనుచోట గుణభూత హేతువాచకము అగు "జాడ్య" శబ్దము స్త్రీలింగము కాదు, కావున పంచమీ విభక్తి వైకల్పికముగా వచ్చినది లేని పక్షములో తృతీయా విభక్తి వచ్చును.

' ధనేన కులమ్ ' అనునపుడు ధన శబ్దము గుణవాచకము కాదు.

' బుద్ధ్యా ముక్తః ' అనుచోట ' బుద్ధి ' శబ్దము స్త్రీ లింగ శబ్దము కావున ఇట్టిచోట్ల ఈ సూత్రము ప్రవర్తించదు.

ఈ సూత్రమందు ' విభాషా ' అని యోగవిభాగము (పృథక్ సూత్రము) చేసెదము కావున గుణవాచకము కానప్పుడు కూడా కొన్నిచోట్ల పంచమీ విభక్తి విధింపబడును. దీనికి ' ధూమాత్ అగ్నిమాన్ ' అనే ఉదాహరణ తీసుకోవచ్చును.

అట్లే స్త్రీలింగమందు కూడా " నాస్తి ఘటోఽనుపలబ్ధేః " ఇత్యాదులందు పంచమీ విభక్తి వచ్చును.

**72. పృథగ్వినానానాభిస్త్ృతీయాఽన్యతరస్యామ్ (2-3-32)**

**ఏభిర్యోగే తృతీయా స్యాత్ పఞ్చమీ ద్వితీయా చ. అన్యతరస్యాం గ్రహణం సముచ్చయార్థమ్. పఞ్చమీద్వితీయే చ అనువర్తేతే. పృథగ్ రామేణ, రామాత్, రామం వా. ఏవం వినా, నానా.**

**పృథగ్వినానానాభిస్త్ృతీయాఽన్యతరస్యామ్** : పృథక్-వినా-నానాభిః, తృతీయా, అన్యతరస్యామ్ అని పదచ్ఛేదము. పృథక్, వినా, నానా అను శబ్దములతో యోగమున్నప్పుడు తృతీయా విభక్తి వికల్పముగ వచ్చును. లేని పక్షములో పంచమీ, ద్వితీయలు చెప్పబడును. ఈ సూత్రమందు అన్యతరస్యాం గ్రహణము సముచ్చయార్థకము. పంచమీ, ద్వితీయా కూడ అనువర్తించినవి. కావున ఈ శబ్దములతో యోగమున్నప్పుడు తృతీయా, పంచమీ, ద్వితీయలు వచ్చునని అర్థము. "పృథక్ రామేణ, రామాత్, రామం వా" "వినా రామేణ, రామాత్, రామం వా" ఇత్యాది ఉదాహరణలు కలవు.

**73. కరణే చ స్తోకాల్పకృచ్ఛ్రకతిపయస్యాసత్త్వవచనస్య (2-3-33)**

**ఏభ్యోఽద్రవ్యవచనేభ్యః కరణే తృతీయాపఞ్చమ్యౌ స్తః. స్తోకేన స్తోకాత్ వా ముక్తః. ద్రవ్యే తు స్తోకేన విషేణ హతః.**

**కరణే చ స్తోకాల్పకృచ్ఛ్రకతిపయస్యాసత్త్వవచనస్య** : కరణే, చ, స్తోకాల్పకృచ్ఛ్రకతిపయస్య, అసత్త్వవచనస్య అని పదచ్ఛేదము. స్తోక, అల్ప, కృచ్ఛ్ర, కతిపయ ఈ నాలుగు అద్రవ్యవాచకములైనప్పుడు కరణార్థమందు వికల్పముగా పంచమీ వచ్చును. అది రానప్పుడు తృతీయా విభక్తి వచ్చును.

"స్తోకేన స్తోకాత్ వా ముక్తః" (కొద్ది ప్రయత్నముతోనే ముక్తుడయినాడు) అని ఉదాహరణ.

ద్రవ్య వాచకమైతే ఈ సూత్రము రాదు కావున " స్తోకేన విషేణ హతః " అను స్థలమందు పంచమీ విభక్తి చెప్పబడలేదు.

**74. దూరాన్తికార్థేభ్యో ద్వితీయా చ (2-3-35)**

**ఏభ్యో ద్వితీయా స్యాత్ చాత్ పఞ్చమీ తృతీయే చ. ప్రాతిపది కార్థమాత్రే విధిరయమ్. గ్రామస్య దూరం దూరాత్ దూరేణ వా, అన్తికమ్, అన్తికాత్ అన్తికేన**



**వా. ' అసత్త్వవచనస్య' ఇత్యనువృత్తేర్నేహ. దూరః పన్థాః.**

**దూరాన్తికార్థేభ్యో ద్వితీయా చ** : దూరాన్తికార్థేభ్యః, ద్వితీయా, చ అని పదచ్ఛేదము.

దూరార్థకములు, అన్తికార్థకములకు ద్వితీయా విభక్తి వచ్చును. సూత్రమందలి చ కారము వల్ల పంచమీ తృతీయలు కూడా గ్రహించవలెను. " గ్రామస్య దూరం దూరాత్ దూరేణ వా " అని ఉదాహరణము.

ఈ సూత్రమందు ' అసత్త్వవచనస్య ' అను పదము అనువర్తించుటచే అద్రవ్యవాచకమైనప్పుడే ప్రవర్తించును. కావున " దూరః పన్థాః " అను చోట ఈ సూత్రము రాదు.

**పంచమీ విభక్తి సమాప్తము**

# అథ షష్ఠీ విభక్తిః

**75. షష్ఠీ శేషే (2-3-50)**

**కారకప్రాతిపదికార్థవ్యతిరిక్తః స్వస్వామిభావాదిసంబన్ధః శేషస్తత్ర షష్ఠీ స్యాత్. రాజ్ఞః పురుషః. కర్మాదీనామపి సమ్బన్ధమాత్రవివక్షాయాం షష్ఠ్యేవ. సతాం గతమ్. సర్పిషో జానీతే. మాతుః స్మరతి. ఏధోదకస్య ఉపస్కురుతే. భజే శంభోశ్చరణయోః. ఫలానాం తృప్తః.**

**షష్ఠీ శేషే** : షష్ఠీ, శేషే అని పదచ్ఛేదము. శేషమనగా చెప్పగా మిగిలినది అని అర్థము. కర్త, కర్మ , కరణ, సంప్రదాన, అపదాన, అధికరణ కారకములు, ప్రథమా విభక్తి విధిలో ప్రాతిపదికార్థము చెప్పబడినవి. వీటికంటే భిన్నమైన స్వస్వామి భావము గల సంబంధము శేషము. ఆ అర్థమందు షష్ఠీ విభక్తి విధింపబడును. " రాజ్ఞః పురుషః " అను ఉదాహరణ మందు రాజునకు పురుషునికి స్వస్వామి భావ సంబంధమున్నది కావున రాజన్ శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చినది. కర్మాదులకు కూడా సంబంధత్వ వివక్ష చేసినచో ద్వితీయాది విభక్తులు రాకుండ, షష్ఠీ విభక్తియే వచ్చును.

' సతాం గతమ్ ' అను స్థల మందు కర్తృరూప శబ్దార్థమైన సత్ నకు కర్తృత్వము గాకుండా సంబంధత్వమును వివక్ష చేసినట్లైతే షష్ఠీ విభక్తి వచ్చి ' సతాం ' అను

రూపమేర్పడినది. అట్లుగాక కర్తృత్వమే వివక్ష చేసినచో తృతీయ వచ్చి " సద్భిః " అను రూపమేర్పడును. ' సర్పిషో జానీతే ' అనునపుడు కరణ రూప ' సర్పిష్ ' శబ్దమునకు సంబంధత్వ వివక్ష చేసిన యెడల షష్ఠీ విభక్తి వచ్చి సర్పిషః అను రూపమేర్పడును. 'మాతుః స్మరతి ' ' ఏధోదకస్య ఉపస్కురుతే ' ' భజే శంభోశ్చరణయోః ' అను ఉదాహరణములందు కర్మ రూప ' మాతృ ' 'ఏధోదక, చరణ' శబ్దములకు సంబంధత్వ వివక్ష చేసిన యెడల షష్ఠీ విభక్తి వచ్చి ' మాతుః ', ఏధోదకస్య, చరణయోః అను రూపము లేర్పడును.

' ఫలానాం తృప్తః ' అనునపుడు కరణరూప " ఫల " శబ్దమునకు సంబంధవివక్ష చేయుట వలన " ఫలానాం " అని రూపమేర్పడును.

## 76. షష్ఠీ హేతుప్రయోగే ( 2-3-26)

**హేతుశబ్దప్రయోగే హేతౌ ద్యోత్యే షష్ఠీ స్యాత్. అన్నస్య హేతోర్వసతి.**

**షష్ఠీ హేతుప్రయోగే** : షష్ఠీ, హేతుప్రయోగే అని పదచ్ఛేదము. " హేతౌ " అను సూత్రము అనువర్తించినది. హేతు శబ్దమును ప్రయోగించినప్పుడు హేతుత్వము ద్యోత్యమయినప్పుడు కూడ షష్ఠీ విభక్తి వచ్చును. ' అన్నస్య హేతోః వసతి ' అనునది ఉదాహరణము.

## 77. సర్వనామ్నస్తృతీయా చ (2-3-27)

**సర్వనామ్నో హేతుశబ్దస్య చ ప్రయోగే హేతౌ ద్యోత్యే తృతీయా స్యాత్ షష్ఠీ చ. కేన హేతునా వసతి. కస్య హేతోః.**

**(వా) నిమిత్త పర్యాయప్రయోగే సర్వాసాం ప్రాయదర్శనమ్**

**కిం నిమిత్తం వసతి ? కేన నిమిత్తేన ? కస్మై నిమిత్తాయ ? ఇత్యాది. ఏవం కిం కారణం ? కో హేతుః ? కిం ప్రయోజనమ్ ? ఇత్యాది. ప్రాయగ్రహణాత్ సర్వనామ్నః ప్రథమాద్వితీయే న స్తః. జ్ఞానేన నిమిత్తేన హరిః సేవ్యః. జ్ఞానాయ నిమిత్తాయ ఇత్యాది.**

**సర్వనామ్నస్తృతీయా చ** : సర్వనామ్నః, తృతీయా, చ అని పదచ్ఛేదము. సర్వనామ శబ్దములతో, హేతుశబ్దము ప్రయోగింపబడినపుడు హేతుత్వము చెప్పినపుడు కూడ



తృతీయా మరియు షష్ఠీ విభక్తులు విధించబడును. " కేన హేతునా వసతి, కస్య హేతోః వసతి " అనునది ఉదాహరణము.

**(వా) నిమిత్త పర్యాయ ప్రయోగే సర్వాసాం ప్రాయదర్శనమ్** : నిమిత్త పర్యాయ శబ్దములను ప్రయోగించినప్పుడు సాధారణముగ అన్ని విభక్తులు విధింపబడును.

" కిం నిమిత్తం వసతి " , " కేన నిమిత్తేన " , " కస్మై నిమిత్తాయ " ఇత్యాదులు ఉదాహరణములు.

అట్లే మిగిలిన విభక్తులు కూడా విధింపబడును. ఈ విధంగా నిమిత్త పర్యాయ శబ్దములగు కారణ శబ్దము, హేతు శబ్దము, ప్రయోజన శబ్దము మొదలగు వాటిని ప్రయోగించినప్పుడు ఈ వార్తికము ఉపయోగపడును.

వార్తికమున ప్రాయ శబ్దమునుపయోగించినందువలన సర్వనామ శబ్దములు కాని వాటికి ప్రథమా ద్వితీయలు రావు.

" జ్ఞానేన నిమిత్తేన " ఇత్యాదులందు తృతీయాది విభక్తులు చెప్పబడినవే కాని, ప్రథమా ద్వితీయలు రాలేదు.

## 78. షష్ఠ్యతసర్థప్రత్యయేన (2-3-30)

**ఎతద్యోగే షష్ఠీస్యాత్. " దిక్ శబ్దేతి " పఞ్చమ్యా అపవాదః. గ్రామస్య దక్షిణతః పురః పురస్తాత్ ఉపరి ఉపరిష్టాత్.**

**షష్ఠ్యతసర్థప్రత్యయేన** : షష్ఠీ, అతసర్థప్రత్యయేన అని పదచ్ఛేదము. అతస్ (అతసుచ్) ప్రత్యయమునకు దిగ్దేశ కాలములు అర్థము చెప్పబడినది. ఆ అర్థము గల ప్రత్యయములతోనున్నప్పుడు షష్ఠీ విభక్తి వచ్చును. " అన్యారాదితరర్తేదిక్శబ్దః " ఇత్యాది సూత్రముచే దిగ్వాచకములతో యోగమున్నప్పుడు ప్రాప్తించిన పంచమీ విభక్తికి ఇది అపవాదము. అనగా దానిని బాధించి ఈ సూత్రము షష్ఠీ విభక్తిని విధించును. " గ్రామస్య దక్షిణతః " ఇత్యాది ఉదాహరణములందు అతసర్థ ప్రత్యయాంతములగు దక్షిణతః, పురః, పురస్తాత్, ఉపరి, ఉపరిష్టాత్ ఇత్యాది శబ్దములతో సంబంధమున్న గ్రామ శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చినది.

## 79. ఏనపా ద్వితీయా (2-3-31)

**ఏనబన్తేన యోగే ద్వితీయా స్యాత్. ఏనపేతి యోగవిభాగాత్ షష్ఠ్యపి. దక్షిణేన గ్రామం గ్రామస్య వా.**

**ఏనపా ద్వితీయా** : ఏనపా, ద్వితీయా అని పదచ్ఛేదము. " ఏనప్ " ప్రత్యయాంతముతో యోగమున్నప్పుడు ద్వితీయా విభక్తి వచ్చును. పూర్వ సూత్రముచే షష్ఠీ విభక్తి విధింపబడుచుండగా దానికి అపవాదము ఈ సూత్రము. కాని ఈ సూత్రములో " ఏనపా" అని యోగవిభాగము చేయుటచే షష్ఠీ విభక్తి కూడా ప్రవర్తించును.

" ఏనప్ " ప్రత్యయాంతమగు " దక్షిణేన " అను శబ్దముతో ఉపయోగించిన గ్రామ శబ్దమునకు ద్వితీయా విభక్తి, షష్ఠీ విభక్తి కూడ విధింపగా "దక్షిణేన గ్రామం గ్రామస్య వా" అని సిద్ధించినది.

## 80. దూరాన్తికార్థైః షష్ఠ్యన్యతరస్యామ్ (2-3-34)

**ఏతైర్యోగే షష్ఠీ స్యాత్ పఞ్చమీ చ. దూరం నికటం గ్రామస్య గ్రామాద్వా.**

**దూరాన్తికార్థైః షష్ఠ్యన్యతరస్యామ్** : దూరానికార్థైః, షష్ఠీ, అన్యతరస్యామ్ అని పదచ్ఛేదము. దూరార్థకములు, మరియు అన్తికార్థములు (సమీప) అగు శబ్దములతో ప్రయోగించిన శబ్దమునకు షష్ఠీ విభక్తి వికల్పముగా వచ్చును. షష్ఠీ విభక్తి రాని పక్షంలో పంచమీ విభక్తి వచ్చును. ' దూరం నికటం గ్రామస్య గ్రామాత్ వా ' అనునది ఉదాహరణ.

## 81. జ్ఞో౽విదర్థస్య కరణే (2-3-51)

**జానాతేః అజ్ఞానార్థస్య కరణే శేషత్వేన వివక్షితే షష్ఠీ స్యాత్. సర్పిషో జ్ఞానమ్.**

**జ్ఞో౽విదర్థస్య కరణే** : జ్ఞః, అవిదర్థస్య, కరణే అని పదచ్ఛేదము. ' విదర్థకము ' అనగా జ్ఞానార్థకము. ' జ్ఞా ' ధాతువు జ్ఞానార్థములో ప్రయోగించనప్పుడు, కరణమునకు శేషత్వ వివక్ష (సంబంధత్వవివక్ష ) చేసినప్పుడు షష్ఠీ విభక్తి విధింపబడును. " సర్పిషో జ్ఞానమ్ " (నెయ్యి కొరకు ప్రవృత్తి) అనునది దీనికి ఉదాహరణము.

## 82. అధీగర్థదయేశాం కర్మణి (2-3-52)

**ఏషాం కర్మణి శేషే షష్ఠీ స్యాత్. మాతుః స్మరణమ్. సర్పిషో దయనమ్. ఈశనం వా.**



**అధీగర్థదయేశాం కర్మణి** : అధీగర్థదయేశాం, కర్మణి అని పదచ్ఛేదము. అధిపూర్వక ' ఇక్ ' ధాతువు స్మరణార్థము. అధీగర్థధాతువులు అనగా స్మరణార్థకములు అని అర్థము.

దయ, ఈశ ధాతువుల కర్మను శేషత్వముతో వివక్ష చేసినప్పుడు షష్ఠీ విభక్తి విధింపబడును.

"మాతుః స్మరణమ్" (తల్లిని స్మరించుట), "సర్పిషః దయనమ్" (నెయ్యిని దానము చేయుట), "సర్పిషః ఈశనమ్" (నెయ్యిని యథేచ్ఛగా వినియోగించుట) ఇత్యాదులు ఇక్కడ ఉదాహరణలు.

## 83. కృఞః ప్రతియత్నే (2-3-53)

**ప్రతియత్నో గుణాధానమ్. కృఞః కర్మణి శేషే షష్ఠీ స్యాత్ గుణాధానే. ఏధోదకస్య ఉపస్కరణమ్.**

**కృఞః ప్రతియత్నే** : కృఞః, ప్రతియత్నే అని పదచ్ఛేదము. ప్రతియత్నమనగా "గుణాధానము" (పరిష్కరించుట) అని అర్థము. కృఞ్ ధాతువుయొక్క కర్మకు శేషత్వ వివక్ష చేసినప్పుడు గుణాధాన రూప అర్థమందు షష్ఠీ విభక్తి విధింపబడును.
దీనికి ఉదాహరణము : "ఏధోదకస్య ఉపస్కరణమ్ " (ఏధస్ అనగా కట్టెలు మరియు ఉదకమును పరిష్కరించుట)

## 84. రుజార్థానాం భావవచనానామజ్వరేః (2-3-54)

**భావకర్తృకాణాం జ్వరివర్జితానాం రుజార్థానాం కర్మణి శేషే షష్ఠీ స్యాత్. చౌరస్య రోగస్య రుజా.**

**(వా) అజ్వరిసంతాప్యోరితి వాచ్యమ్. రోగస్య చౌరజ్వరః చౌర సంతాపో వా. రోగకర్తృకం చౌరసంబన్ధి జ్వరాధికమిత్యర్థః.**

**రుజార్థానాం భావవచనానామజ్వరేః** : రుజార్థానాం, భావవచనానామ్, అజ్వరేః అని పదచ్ఛేదము. రుజా అనగా రోగము, భావము అనగా ధాత్వర్థక్రియ. వచన శబ్దానికి "వక్తీతి వచనః " అను వ్యుత్పత్తిచే కర్త అని అర్థము. భావవచనము అనగా భావము కర్తగా కలిగిన అని అర్థము చెప్పబడినది. జ్వర ధాతువు కంటే భిన్నమైన భావకర్తృకములు

రుజార్థకములు అయిన ధాతువుల కర్మకు శేషత్వ వివక్ష చేసిననపుడు షష్ఠీ విభక్తి విధింపబడును.

" చౌరస్య రోగస్య రుజా " అనునది ఉదాహరణము. రోగము చోరుని బాధతో పీడించుచున్నదని అర్థము.

**అజ్వరిసన్తాప్యోరితి వాచ్యమ్** : జ్వరి, సన్తాపి ధాతువులతో యోగమున్నప్పుడు పై సూత్రము ప్రవర్తించదు అని అర్థము. "రోగస్య చౌరజ్వరః, రోగస్య చౌరసన్తాపః" అనునపుడు రోగకర్తృకమైన చౌర సంబంధి జ్వరాదులని అర్థము. ఇచ్చట చౌరస్య జ్వరః, చౌరస్య సన్తాపః అని ఈ సూత్రము చేత షష్ఠీ విభక్తి కాక, " షష్ఠీ శేషే " అను సూత్రము చేత షష్ఠీ విభక్తి వచ్చును. అనంతరము షష్ఠీతత్పురుష సమాసముతో " చౌరజ్వరః ", "చౌరసన్తాపః" అను రూపములేర్పడినవి. " రుజార్థానాం .......... " అను ప్రస్తుత సూత్రము చేత షష్ఠీ విభక్తి చేసినచో షష్ఠీ తత్పురుష సమాసము చెప్పడము వీలుకాదు. అప్పుడు " ప్రతిపద విధానాత్ షష్ఠీ న సమస్యతే " అను నిషేధముండును.

" రుజార్థానాం ........... " అను సూత్రము చేత కేవల జ్వర ధాతు యోగమందు మాత్రమే ఆ సూత్ర విహిత షష్ఠీరాదని చెప్పబడుచుండగా, ప్రస్తుత వార్తికముచే జ్వర, తప ఈ రెండు ధాతువుల యోగమందు కూడా షష్ఠీ విభక్తి రాదు అని చెప్పబడినది.

## 85. ఆశిషి నాథః (2-3-55)

**ఆశీరర్థస్య నాథతేః శేషే కర్మణి షష్ఠీ స్యాత్. సర్పిషో నాథనమ్. ఆశిషి ఇతి కిమ్? మాణవకనాథనమ్. తత్సంబన్ధినీ యాఞ్చేత్యర్థః.**

**ఆశిషి నాథః** : ఆశిషి, నాథః అని పదచ్ఛేదము. ఆశీరర్థకమైన నాథ ధాతువు కర్మకు శేషత్వ వివక్ష చేసినచో షష్ఠీ విభక్తి వచ్చును. " సర్పిషో నాథనమ్ " (నెయ్యిని కోరుకొనుట) అనునది ఉదాహరణ. నెయ్యి నాకు సిద్ధించుగాక అను ఆశాసనమే ఆశీస్సు. ఆశీరర్థమందే ఈ సూత్రము వచ్చును కావున " మాణవక నాథనమ్ " (మాణవకుని యాచించుట) అను స్థలమందు మాణవక శబ్దమునకు ఈ సూత్రము ద్వారా షష్ఠీ విభక్తి రాదు.

## 86. జాసినిప్రహణనాటక్రాథపిషాం హింసాయామ్ (2-3-56)

**హింసార్థానామేషాం శేషే కర్మణి షష్ఠీ స్యాత్. చౌరస్యోజ్జాసనమ్. నిప్రౌ సంహతౌ విపర్యస్తౌ వ్యస్తౌ వా. చౌరస్య నిప్రహణనమ్, ప్రణిహననమ్, నిహననమ్,**



**ప్రహణనం వా. " నట అవస్కందనే " చురాదిః. చౌరస్యోన్నాటనమ్. చౌరస్య క్రాథనమ్. వృషలస్య పేషణమ్. హింసాయామ్ కిమ్ ? ధానాపేషణమ్.**

**జాసినిప్రహణనాటక్రాథపిషాం హింసాయామ్** : జాసినిప్రహణనాటక్రాథపిషాం, హింసాయామ్ అని పదచ్ఛేదము. హింసార్థకములయిన జాసి, ని ప్రపూర్వక హన, నాట, క్రాథ, పిష ఈ ధాతువుల కర్మకు శేషత్వ వివక్ష చేసినప్పుడు షష్ఠీ విభక్తి విధింపబడును.

" చౌరస్య ఉజ్జాసనమ్ " (చోరుని హింసించుట) అనునది జాసి ధాతువునకు ఉదాహరణము.

ని, ప్ర పూర్వక హన ధాతువు అనగా ని, ప్ర ఇవి సమస్తములు గాని, ప్ర ని అని వ్యుత్క్రమములుగాని, ప్ర, ని అని వేరువేరుగా గాని గల ధాతువు గ్రహింపబడును. చౌరస్య నిప్రహణనం, చౌరస్య ప్రణిహననం, చౌరస్య నిహననం, చౌరస్య ప్రహణనం అని ఉదాహరణలు. సూత్రమునందున్న నాట పదముచే చురాది గణములోని నట అవస్కన్దనే అను ధాతువు ఇక్కడ గ్రహించబడును. " చౌరస్య ఉన్నాటనమ్ " (చోరుని హింసించుట) అనునది ఉదాహరణము. నటనృత్తౌ అను భ్వాది ధాతువు కాదని గ్రహింపవలసినది.

క్రాథ, పిష ధాతువులకు క్రమముగా " చౌరస్య క్రాథనమ్ ", "వృషలస్య పేషణమ్" అని ఉదాహరణములు.

హింసార్థమందే ఈ సూత్రము వచ్చును కావున " ధానాపేషణమ్ " (ధాన్యవిశేషమును పిండిచేయుట) అను స్థలమందు ఈ సూత్రముచేత షష్ఠీ విభక్తి రాదు.

## 87. వ్యవహృపణోః సమర్థయోః (2-3-57)

**శేషే కర్మణి షష్ఠీ స్యాత్. ద్యూతే క్రయవిక్రయవ్యవహారే చానయోస్తుల్యార్థతా. శతస్య వ్యవహరణం పణనం వా. సమర్థయోః కిమ్ ? శలాకావ్యవహారః. గణనేత్యర్థః. బ్రాహ్మణపణనమ్. స్తుతిరిత్యర్థః.**

**వ్యవహృపణోః సమర్థయోః** : వ్యవహృపణోః, సమర్థయోః అని పదచ్ఛేదము. వి, అవ పూర్వక హృ ధాతువు, పణ ధాతువులు తుల్యార్థకములయినపుడు వాటి కర్మకు శేషత్వ

వివక్ష చేసినచో షష్ఠీ విభక్తి వచ్చును. జూదమందు, క్రయ-విక్రయ- వ్యవహారమందు ఈ రెండు ధాతువులు సమానార్థకములు.

" శతస్య వ్యవహరణం పణనం వా " (జూదమును వ్యవహారము చేత కాని, క్రయవిక్రయ వ్యవహారముల చేత గాని శతమును గ్రహించుచున్నాడు) అని ఉదాహరణ. సమానార్థకములయినప్పుడే ఈ సూత్రము వచ్చును గావున " శలాకావ్యవహారః " అను ప్రత్యుదాహరణమందు శలాకా శబ్దమునకు దీని చేత షష్ఠీ విభక్తి చెప్పబడదు. అక్కడ "వ్యవహార " శబ్దమునకు గణన (లెక్కకట్టుట) అని అర్థము. అట్లే " బ్రాహ్మణపణనం " అను ప్రత్యుదాహరణమందు ' పణన ' శబ్దమునకు " స్తుతి " అని అర్థము కావున ఈ సూత్రము చేత బ్రాహ్మణ శబ్దమునకు షష్ఠీ విభక్తి రాదు.

## 88. దివస్తదర్థస్య (2-3-58)

**ద్యూతార్థస్య క్రయవిక్రయరూపవ్యవహారార్థస్య చ దివః కర్మణి షష్ఠీ స్యాత్. శతస్య దీవ్యతి. తదర్థస్య కిమ్ ? బ్రాహ్మణమ్ దీవ్యతి. స్తౌతీత్యర్థః.**

**దివస్తదర్థస్య** : దివః, తదర్థస్య, అని పదచ్ఛేదము. తదర్థమనగా ద్యూతార్థము. క్రమవిక్రయరూప వ్యవహారార్థము గల దివ్ ధాతువు ఉపయోగించినపుడు కర్మవాచక శబ్దమునకు షష్ఠీ విభక్తి విధింపబడును. ' శతస్య దీవ్యతి ' (పాచికలు ఆడుట ద్వారా గాని, క్రయ విక్రయ వ్యవహారము చేత గాని శతమును గ్రహించుచున్నాడు) అని ఉదాహరణ. ఉక్తార్థమందే ఈ సూత్రము ప్రవర్తించును. కావున " బ్రాహ్మణం దీవ్యతి " ( బ్రాహ్మణుని స్తుతించుచున్నాడు) అనుచోట ఈ సూత్రము రాదు.

## 89. విభాషోపసర్గే ( 2-3-59 )

**పూర్వయోగాపవాదః. శతస్య శతం వా ప్రతిదీవ్యతి.**

**విభాషోపసర్గే** : విభాషా, ఉపసర్గే అని పదచ్ఛేదము. ఉపసర్గతో కూడియున్నప్పుడు పూర్వ సూత్రము చేత నిత్యముగా వచ్చే షష్ఠీ విభక్తిని బాధించి ఈ సూత్రము చేత వికల్పముగా షష్ఠీ విభక్తి వచ్చును. షష్ఠీ విభక్తి రానిపక్షమున ద్వితీయా విభక్తి వచ్చును. ఉదా : 'శతస్య శతం వా ప్రతిదీవ్యతి '.

## 90. ప్రేష్యబ్రువోర్హవిషో దేవతాసంప్రదానే (2-3-61)

**దేవతాసంప్రదానేఽర్థే వర్తమానయోః ప్రేష్యబ్రువోః కర్మణః హవిషః**



**వాచకాచ్ఛబ్దాత్ షష్ఠీ స్యాత్. అగ్నయే ఛాగస్య హవిషో వపాయా మేదసః ప్రేష్య అనుబ్రూహి వా.**

**ప్రేష్యబ్రువోర్హవిషో దేవతాసంప్రదానే** : ప్రేష్యబ్రువోః, హవిషః, దేవతాసంప్రదానే అని పదచ్ఛేదము. ప్రేష్య అనగా ప్ర పూర్వక ఇష ధాతువు, బ్రూ ధాతువు కూడ దేవతా సంప్రదానక అర్థమందు చెప్పబడినప్పుడు ఈ రెండు ధాతువుల కర్మరూపమగు హవిర్వాచక శబ్దమునకు షష్ఠీ విభక్తి విధింపబడును. " అగ్నయే ఛాగస్య " ఇత్యాది ఉదాహరణమున హవిస్, వపా, మేదస్ శబ్దములకు షష్ఠీ విభక్తి విధింపబడినది.

## 91. కృత్వోఽర్థప్రయోగే కాలేఽధికరణే (2-3-64)

**కృత్వోఽర్థానాం ప్రయోగే కాలవాచిన్యధికరణే శేషే షష్ఠీ స్యాత్. పఞ్చకృత్వోఽహ్నో భోజనమ్. ద్విరహ్నో భోజనమ్. శేషే కిమ్ ? ద్విరహన్యధ్యయనమ్.**

**కృత్వోఽర్థప్రయోగే కాలేఽధికరణే** : కృత్వోఽర్థప్రయోగే, కాలే, అధికరణే అని పదచ్ఛేదము. " కృత్వసుచ్ " అను ప్రత్యయమునకు క్రియ యొక్క " పౌనఃపున్యము " అర్థము. అటువంటి అర్థముగల ప్రత్యయములను ప్రయోగించినప్పుడు అధికరణ రూపమగు కాలవాచక శబ్దమునకు శేషత్వ వివక్ష చేసినచో షష్ఠీ విభక్తి వచ్చును అని సూత్రార్థము.

" పంచకృత్వః, అహ్నః భోజనమ్ " (ఐదుసార్లు పగటి యందలి భోజనము). " ద్వి అహ్నః భోజనమ్ " (రెండుసార్లు పగటి యందలి భోజనము) ఇత్యాది ఉదాహరణము లందు అహన్ శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చినది. శేషత్వ వివక్ష చేసినప్పుడు అనగా అధికరణత్వమే వివక్ష చేయబడినచో " ద్విః అహని అధ్యయనమ్ " ఇత్యాది వాక్యములందు షష్ఠీ విభక్తి రాదు.

## 92. కర్తృకర్మణోః కృతి (2-3-65)

**కృద్యోగే కర్తరి కర్మణి చ షష్ఠీ స్యాత్. కృష్ణస్య కృతిః. జగతః కర్తా కృష్ణః.**

**(వా) గుణకర్మణి వేష్యతే. నేతా అశ్వస్య స్రుఘ్నస్య స్రుఘ్నం వా. కృతి కిమ్ ? తద్ధితే మా భూత్. కృతపూర్వీ కటమ్.**

**కర్తృకర్మణోః కృతి** : కర్తృకర్మణోః, కృతి అని పదచ్ఛేదము. కృత్ ప్రత్యయముతో యోగమున్నప్పుడు కర్త మరియు కర్మ అర్థములయందు షష్ఠీ విభక్తి విధింపబడును.

ఉదా: " కృష్ణస్య కృతిః " (కృష్ణ కర్తృకమగు సృష్టి) " జగతః కర్తా కృష్ణః " (జగత్తును సృష్టించినవాడు కృష్ణుడు)

**(వా) గుణకర్మణి వేష్యతే** : " కృత్ " ప్రత్యయముతో యోగమున్నప్పుడు గుణకర్మ యందు అనగా అప్రధాన కర్మ యందు షష్ఠీ విభక్తి వికల్పముగా వచ్చునని వార్తికార్థము. ప్రధాన కర్మ యందు మాత్రము ఈ సూత్రముచే నిత్యముగానే షష్ఠీ విభక్తి విధింపబడును.

" నేతా అశ్వస్య స్రుఘ్నస్య స్రుఘ్నం వా " అను స్థలమందు అప్రధాన కర్మ వాచకమగు స్రుఘ్న శబ్దమునకు వికల్పముగా షష్ఠీ విభక్తి చెప్పబడినది. ' కృత్ ' ప్రత్యయ యోగమందే ఈ సూత్రము వచ్చును. కావున " కృతపూర్వీ కటమ్ " అను తద్ధిత (ఇని) ప్రత్యయయోగమందు రాదు.

## 93. ఉభయప్రాప్తౌ కర్మణి (2-3-66)

**ఉభయోః ప్రాప్తిర్యస్మిన్ కృతి తత్ర కర్మణ్యేవ షష్ఠీ స్యాత్. ఆశ్చర్యో గవాం దోహోऽగోపేన.**

**(వా) స్త్రీప్రత్యయయోరకాకారయోర్నాయం నియమః. భేదికా బిభిత్సా వా రుద్రస్య జగతః.**

**(వా) శేషే విభాషా. స్త్రీ ప్రత్యయ ఇత్యేకే. విచిత్రా జగతః కృతిర్హరేః - హరిణా వా. కేచిదవిశేషేణ విభాషామిచ్ఛన్తి. శబ్దానామనుశాసనమాచార్యేణ - ఆచార్యస్య వా.**

**ఉభయ ప్రాప్తౌ కర్మణి** : ఉభయప్రాప్తౌ, కర్మణి అని పదవిభాగము. ఒక వాక్యము నందు కర్త మరియు కర్మ రెండింటికి షష్ఠీ విభక్తి ప్రాప్తించినపుడు కర్మార్థమందే షష్ఠీ విభక్తి వచ్చును. కాని కర్త అర్థమందు రాదు. ఉదా : " ఆశ్చర్యో గవాం దోహో అగోపేన " (గోపభిన్న కర్తృకమగు గో కర్మక దోహము ఆశ్చర్యము) అనునపుడు గోవు కర్మ, అగోపుడు కర్త. ఈ రెండింటికి " కర్తృకర్మణోః కృతి " అను సూత్రము చేత షష్ఠీ విభక్తి ప్రాప్తించగా ప్రస్తుత సూత్రము చేత నియమం విధింపబడినది. గోరూప కర్మవాచక శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చినది. కర్తృవాచక అగోపశబ్దమునకు షష్ఠీ విభక్తి రాకుండా " కర్తృకరణయోః తృతీయా " అను సూత్రము చేత తృతీయా విభక్తి వచ్చినది.

**స్త్రీప్రత్యయయోరకాకారయోర్నాయం నియమః** : స్త్రీ ప్రత్యయములగు అక, అ అను కృత్ప్రత్యయములను ప్రయోగించినప్పుడు పై నియమము వర్తించదు. కర్త మరియు కర్మ రెండు అర్థముల యందు కూడా షష్ఠీ విభక్తి వచ్చును. భేదికా అను ప్రయోగ మందు భిద ధాతువునకు అక (ణ్వుల్) ప్రత్యయము, బిభిత్సా అను ప్రయోగమందు సన్నంతభిద ధాతువునకు అకార ప్రత్యయము చేర్చబడినవి. కావున " భేదికా బిభిత్సా వా రుద్రస్య జగతః " అను ప్రయోగమున కర్తృవాచక రుద్రశబ్దమునకు మరియు కర్మవాచక జగత్ శబ్దమునకు షష్ఠీ విభక్తి ప్రవర్తించినవి.

**శేషే విభాషా** : అక, అ కార ప్రత్యయములకు భిన్న ప్రత్యయములతో యోగమున్నప్పుడు " ఉభయ ప్రాప్తౌ కర్మణి " అను నియమము వికల్పము. ఈ వార్తికము స్త్రీ ప్రత్యయ యోగమందే ప్రవర్తించునని కొందరు చెప్పుచున్నారు.

" విచిత్రా జగతః కృతిః హరేః హరిణా వా " అను వాక్యమున " కృతిః " అను ప్రయోగమందు తి (క్తిన్) అను స్త్రీ ప్రత్యయమున్నది. కర్తృవాచక హరి శబ్దమునకు కూడా వికల్పముగా షష్ఠీ విభక్తి వచ్చినది. కొందరు స్త్రీ ప్రత్యయ యోగమందైననూ, అస్త్రీ ప్రత్యయ భిన్న ప్రత్యయ యోగమందైననూ ఈ వార్తికము వచ్చునని చెప్పుచున్నారు. "శబ్దానుశాసనం ఆచార్యేణ ఆచార్యస్య వా " అను వాక్యమందు " అనుశాసనమ్ " అను ప్రయోగమున " అన " (ల్యుట్) అను ప్రత్యయము స్త్రీ ప్రత్యయము కాదు. అయిననూ కర్తృవాచక " ఆచార్య " శబ్దమునకు వికల్పముగా షష్ఠీవిభక్తి విధింపబడినది.

## 94. క్తస్య చ వర్తమానే (2-3-67)

**వర్తమానార్థస్య క్తస్య యోగే షష్ఠీ స్యాత్. " న లోక ........ " ఇతి నిషేధస్యాపవాదః. రాజ్ఞాం మతో బుద్ధః పూజితో వా.**

**క్తస్య చ వర్తమానే** : క్తస్య, చ, వర్తమానే అని పదచ్ఛేదము. వర్తమానార్థక ' క్త ' ప్రత్యయముతో యోగమున్నప్పుడు షష్ఠీ విభక్తి విధింపబడును. ' నలోకావ్యయ ...... " అను నిషేధమునకు ఇది అపవాదము. " రాజ్ఞాం మతః" ..... ఇత్యాదులందు " మతః " అను ప్రయోగము వర్తమానార్థకము.

## 95. అధికరణవాచినశ్చ (2-3-68)

**క్తస్య యోగే షష్ఠీ స్యాత్. ఇదమేషామాసితం శయితం గతం భుక్తం వా.**

**అధికరణవాచినశ్చ** : అధికరణవాచినః, చ అని పదచ్ఛేదము. అధికరణ వాచక 'క్త' ప్రత్యయముతో యోగమున్నప్పుడు కూడా షష్ఠీ విభక్తి విధింపబడును.

"ఇదమేషామాసితమ్, శయితమ్, గతమ్, భుక్తమ్" అను ఉదాహరణములందు " ఆసితం, శయితమ్ " ఇత్యాది ప్రయోగములు అధికరణవాచక ' క్త ' ప్రత్యయాంతములు.

## 96. న లోకావ్యయనిష్ఠాఖలర్థతృనామ్ (2-3-69)

**ఏషాం ప్రయోగే షష్ఠీ న స్యాత్. లాదేశః-కుర్వన్-కుర్వాణో వా సృష్టిం హరిః. ఉః - హరిం దిదృక్షుః, అలంకరిష్ణుర్వా. ఉక - దైత్యాన్ ఘాతుకో హరిః. (వా) కమేరనిషేధః. లక్ష్మ్యాః కాముకో హరిః. అవ్యయమ్ - జగత్ సృష్ట్వా. సుఖం కర్తుమ్. నిష్ఠా - విష్ణునా హతా దైత్యాః. దైత్యాన్ హతవాన్ విష్ణుః. ఖలర్థః - ఈషత్కరః ప్రపఞ్చో హరిణా. ' తృన్ ' ఇతి ప్రత్యాహారః, " శతృశానచౌ " ఇతి తృశబ్దాదారభ్య ఆ తృనో నకారాత్. శానన్-సోమం పవమానః. చానశ్ - ఆత్మానం మణ్డయమానః. శతృ - వేదమధీయన్. తృన్ - కర్తా లోకాన్.**

**(వా) ద్విషః శతుర్వా. మురస్య - మురం వా ద్విషన్. సర్వోయం కారకషష్ఠ్యాః ప్రతిషేధః. శేషే షష్ఠీ తు స్యాదేవ. బ్రాహ్మణస్య కుర్వన్. నరకస్య జిష్ణుః.**

**న లోకావ్యయ నిష్ఠాఖలర్థతృనామ్** : న, లోకావ్యయనిష్ఠాఖలర్థతృనామ్ అని పదచ్ఛేదము. ల, ఉ, ఉక, అవ్యయ, నిష్ఠా, ఖలర్థ, తృన్ మొదలగునవి ప్రయోగించినపుడు షష్ఠీ విభక్తి రాదు.

1. **లాదేశః** - లా దేశమైన ' శతృ ' ప్రత్యయాంతము ' కుర్వన్ ' అను శబ్దము, లా దేశమైన ' శానచ్ ' ప్రత్యయాంతము ' కుర్వాణః ' అను శబ్దము ప్రయోగింపబడుటచే "కుర్వన్-కుర్వాణః వా సృష్టిం హరిః " అను ఉదాహరణమున ' సృష్టి ' శబ్దమునకు షష్ఠీ విభక్తి రాలేదు.

2. **ఉః** - ' హరిం దిదృక్షుః ' అనునపుడు ' ఉ ' ప్రత్యయము, " హరిం అలంకరిష్ణుః" అనుచోట ఉకారాంత ' ఇష్ణు ' ప్రత్యయము ప్రయోగింపబడినవి. కావున హరి శబ్దమునకు షష్ఠీ విభక్తి చెప్పబడలేదు.

3. **ఉక** - " దైత్యాన్ ఘాతుకో హరిః " అను ఉదాహరణమున ' ఉక ' ప్రత్యయమున్నది కావున ' దైత్య ' శబ్దమునకు షష్ఠీ విభక్తి చెప్పబడలేదు.

**కమేరనిషేధః (వా)** - ' కమ ' ధాతువునకు ' ఉక ' ప్రత్యయము ప్రయోగించినప్పుడు మాత్రము ఈ సూత్రముచేత నిషేధము రాదు. కావున " లక్ష్మ్యాః కాముకో హరిః" అను వాక్యమున ' లక్ష్మీ ' శబ్దమునకు షష్ఠీ విభక్తి వచ్చినది.

4. **అవ్యయమ్** - "జగత్ సృష్ట్వా" అనుచోట 'సృష్ట్వా ' అను అవ్యయము



ప్రయోగింపబడినది. కావున ' జగత్ ' శబ్దమునకు షష్ఠీ విభక్తి చెప్పబడలేదు. " సుఖం కర్తుమ్ " అను స్థలమున " కర్తుమ్ " అనునది కూడ అవ్యయము.

5. **నిష్ఠా** - క్త, క్తవతు అను ప్రత్యయములకే ' నిష్ఠా ' అని పేరు. "విష్ణునా హతా దైత్యాః" అను వాక్యమున ' హతా ' శబ్దము ' క్త ' ప్రత్యయాంతము " దైత్యాన్ హతవాన్ విష్ణుః " అను వాక్యమున ' హతవాన్ ' శబ్దము ' క్తవత్ ' ప్రత్యయాంతము. కావున వరుసగా ' విష్ణు ', ' దైత్య ' అను శబ్దములకు షష్ఠీ విభక్తి చెప్పబడలేదు.

6. **ఖలర్థ** - " ఈషత్కరః ప్రపఞ్చో హరిణా " అను వాక్యమున 'ఈషత్కర ' శబ్దము 'ఖల్' ప్రత్యయాంతము కావున ' హరి ' శబ్దమునకు షష్ఠీ విభక్తి చెప్పబడలేదు. "ఈ జగత్తును సృష్టించుట విష్ణువుకు చాలా సులభము" అని అర్థము. "ఈషద్దుస్సుషు(3-3-126) ఇత్యాది సూత్రము ద్వారా 'ఈ పనిచేయుట సులభము లేదా ఈ పనిచేయుట కష్టము' అను అర్థమున ఖల్ ప్రత్యయము వచ్చును అని తెలియుచున్నది.

7. **తృన్** - ' లటః శతృశానచౌ ' అను సూత్రములోని ' శతృ ' శబ్దమందలి ' తృ ' శబ్దముతో మొదలుకొని ' తృన్ ' అను సూత్రములోని న కారముతో ' తృన్ ' అను ప్రత్యాహారము ఏర్పడినది. కావున ' తృన్ ' ప్రత్యయముతో పాటు ఈ రెండు సూత్రముల మధ్యలో ఉన్న ప్రత్యయములన్నింటిని తృన్ ప్రత్యాహారములో గ్రహించవలెను. " సోమం పవమానః " అనునపుడు ' శానచ్ ' అను ప్రత్యయము, ' ఆత్మానం మండయమానః ' అనునపుడు ' చానశ్ ' ప్రత్యయిము, " వేదమధీయన్ " అనునపుడు ' శతృ ' ప్రత్యయము ' కర్తా లోకాన్ ' అనునపుడు తృన్ ప్రత్యయము ఉన్నవి.

**(వా) ద్విషః శతుర్వా** : ' శతృ ' ప్రత్యయాంత ' ద్విష ' ధాతువుతో యోగమున్నప్పుడు ఈ సూత్రముచేత విధింపబడు నిషేధము వికల్పముగా వచ్చును. ఇక్కడ ఉదాహరణము. ' మురస్య మురం వా ద్విషన్ '. ప్రస్తుత సూత్రముచే విధింపబడు నిషేధము కారక షష్ఠికే కాని, శేష షష్ఠికి కాదు. కావున " బ్రాహ్మణస్య కుర్వన్ ", ' నరకస్య జిష్ణుః' అను వాక్యములందు శేష షష్ఠీ ప్రవర్తించినది.

## 97. అకేనోర్భవిష్యదాధమర్ణ్యయోః (2-3-70)

**భవిష్యత్యకస్య భవిష్యదాధమర్ణ్యార్థేనశ్చ యోగే షష్ఠీ న స్యాత్. సతః పాలకః అవతరతి. వ్రజం గామీ. శతం దాయీ.**

**అకేనోర్భవిష్యదాధమర్ణ్యయోః** : అకేనోః, భవిష్యదాధమర్ణ్యయోః అని పదచ్ఛేదము.

ఆధమర్ణ్యమనగా అప్పు తీసుకొని ఉండుట. భవిష్యదర్థకమైన అక ప్రత్యయముతోనూ, భవిష్యత్తు మరియు ఆధమర్ణ్యము అను ఈ రెండు అర్థములు గల ' ఇన్ ' ప్రత్యయముతోనూ, యోగమున్నప్పుడు షష్ఠీ విభక్తి రాదని ఈ సూత్రార్థము.

" నతః పాలకోఽవతరతి " (సత్పురుషులను పరిపాలించు హరి అవతరించుచున్నాడు), వ్రజం గామీ (శాలకు వెళ్ళబోవువాడు), శతం దాయీ (అప్పుగా తీసుకున్న నూరుని తిరిగి ఇచ్చుచున్నాడు) అనునవి దీనికి ఉదాహరణములు.

## 98. కృత్యానాం కర్తరి వా (2-3-71)

**షష్ఠీ వా స్యాత్. మయా మమ వా సేవ్యో హరిః. కర్తరి ఇతి కిమ్ ? గేయో మాణవకః సామ్నామ్. " భవ్యగేయ ..... " ఇతి కర్తరి యద్విధానాదనభిహితం కర్మ. అత్ర యోగో విభజ్యతే. " కృత్యానామ్ ". " ఉభయప్రాప్తౌ.... " "న" ఇతి చానువర్తతే. తేన నేతవ్యా వ్రజం గావః కృష్ణేన. తతః కర్తరి వా. ఉక్తోఽర్థః.**

**కృత్యానాం కర్తరి వా** : కృత్యానాం, కర్తరి, వా అని పదచ్ఛేదము. ' కృత్య ' ప్రత్యయములతో యోగమున్నప్పుడు కర్త అర్థమందు షష్ఠీ విభక్తి వికల్పముగా వచ్చును. " కర్తృ కర్మణోః కృతి " అను సూత్రముచేత నిత్యముగా ప్రాప్తిస్తుండగా, ప్రస్తుత సూత్రముచేత వికల్పముగా విధింపబడుచున్నది. షష్ఠి రాని పక్షంలో తృతీయా వచ్చును. ఉదా : " మయా మమ వా సేవ్యో హరిః ". కర్త్రర్థమందే ఈ సూత్రము వచ్చును కావున " గేయో మాణవకః సామ్నామ్" అనునపుడు కర్మవాచక సామ శబ్దమునకు ప్రస్తుత సూత్రము చేత వైకల్పిక షష్ఠి రాదు. ఇచ్చట " భవ్యగేయ ..... " అను సూత్రము చేత కర్త్రర్థ మందు యత్ ప్రత్యయము విధింపబడుటచే, కర్మ అభిహితమైనది. కావున " కర్తృ కర్మణోః కృతి " అను సూత్రముచే నిత్యముగా షష్ఠీ విధింపబడును.

ఈ సూత్రమందు " కృత్యానామ్ " అని యోగవిభాగము (పృథక్ సూత్రము) చేయబడుచున్నది. " ఉభయ ప్రాప్తౌ " అని ' న ' అని రెండు పదములు అనువర్తించినవి.

కృత్య ప్రత్యయములతో యోగమున్నప్పుడు కర్తృకర్మ రెండు అర్థములందు ప్రసక్తమయిన షష్ఠీ విభక్తి రాదు. అందువలన " నేతవ్యా వ్రజం గావః కృష్ణేన " అనునపుడు కర్మవాచక వ్రజ శబ్దమునకు, కర్తృవాచక కృష్ణ శబ్దమునకు షష్ఠీ విభక్తి రాదు.

తర్వాత " కర్తరి వా " అను సూత్రం మొదటగా చెప్పబడిన అర్థము ఈ సూత్రమునకు అర్థమని చెప్పవచ్చును.



## 99. తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాఽన్యతరస్యామ్ (2-3-72)

**తుల్యార్థైర్యోగే తృతీయా వా స్యాత్ పక్షే షష్ఠీ. తుల్యః, సదృశః, సమో వా కృష్ణస్య - కృష్ణేన వా. అతులోపమాభ్యాం కిమ్ ? తులా, ఉపమా వా కృష్ణస్య నాస్తి.**

**తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాఽన్యతరస్యామ్** : తుల్యార్థైః అతులోపమాభ్యాం, తృతీయా, అన్యతరస్యామ్ అని పదచ్ఛేదము. తులా, ఉపమా ఈ రెండు శబ్దములకంటే భిన్నమయిన తుల్యార్థక శబ్దములతో యోగమున్నప్పుడు వికల్పంగా తృతీయా విభక్తి వచ్చును. తృతీయా రాని పక్షంలో షష్ఠీ విభక్తి వచ్చును. శేషషష్ఠి నిత్యముగా ప్రాప్తించుచుండగ ఈ సూత్రము చేత తృతీయా వికల్పముగా విధింపబడినది.

" తుల్యః, సదృశః, సమో వా కృష్ణస్య - కృష్ణేన వా " అని ఉదాహరణ. "తులా ఉపమా వా కృష్ణస్య నాస్తి " అను ప్రత్యుదాహరణమందు తులా, ఉపమా శబ్దములతో యోగమున్నందున ఈ సూత్రము విధింపబడలేదు.

## 100. చతుర్థీ చాశిష్యాయుష్యమద్రభద్రకుశలసుఖార్థహితైః (2-3-73)

**ఏతదర్థైర్యోగే చతుర్థీ వా స్యాత్ పక్షే షష్ఠీ. ఆశిషి - ఆయుష్యం చిరంజీవితం కృష్ణాయ కృష్ణస్య వా భూయాత్. ఏవం మద్రం భద్రం కుశలం నిరామయం సుఖం శమ్ అర్థః - ప్రయోజనం హితం పథ్యం వా భూయాత్. ఆశిషి కిమ్ ? దేవదత్తస్య ఆయుష్యమస్తి. వ్యాఖ్యానాత్ సర్వత్ర అర్థగ్రహణమ్. మద్రభద్రయోః పర్యాయత్వాదన్యతరో న పఠనీయః.**

**చతుర్థీ చాశిష్యాయుష్య మద్ర భద్ర కుశల సుఖార్థ హితైః** : చతుర్థీ, చ, ఆశిషి, ఆయుష్య మద్ర భద్ర కుశల సుఖార్థ హితైః అని పదచ్ఛేదము. ఆశీరర్థము గమ్యమానమైనప్పుడు ఆయుష్యాద్యర్థక శబ్దములతో యోగమున్నప్పుడు చతుర్థీ విభక్తి వైకల్పికముగా విధింపబడును. చతుర్థీ రానపుడు షష్ఠీ విభక్తి విధింపబడును. ఉదా : "ఆయుష్యం చిరంజీవితం కృష్ణాయ - కృష్ణస్య వా భూయాత్ ".

అట్లే మద్ర, భద్ర ఇత్యాది శబ్దములతో యోగమున్నప్పుడు కూడా ఈ సూత్రము ఉపయోగించబడును. ఆశీరర్థమందే ఈ సూత్రము చెప్పబడును కావున " దేవదత్తస్య ఆయుష్య మస్తి " అనునప్పుడు ఈ సూత్రము చెప్పబడలేదు. వ్యాఖ్యానమును బట్టి సూత్రములోని ఆయుష్యాది శబ్దములే కాక తదర్థక శబ్దములన్నింటినీ గ్రహించవలెను.

**షష్ఠీ విభక్తి సమాప్తము**

# అథ సప్తమీ విభక్తిః

## 101. ఆధారోఽధికరణమ్ (1–4–45)

**కర్తృకర్మ ద్వారా తన్నిష్ఠక్రియాయాః ఆధారః కారకమ్ అధికరణసంజ్ఞం స్యాత్.**

**ఆధారోఽధికరణమ్** : ఆధారః, అధికరణమ్ అని పదచ్ఛేదము. కర్తృకర్మల ద్వారా కర్తృకర్మల యందున్న క్రియకు ఆధారమగు కారకము అధికరణసంజ్ఞ కలది యగును.

కర్తృకర్మలకే సాక్షాత్తుగా ఆధారముండును కాని క్రియకు ఆధారముండదు. కర్తృకర్మల ద్వారానే క్రియకు ఆధారముండును.

## 102. సప్తమ్యధికరణే చ (2–3–36)

**అధికరణే సప్తమీ స్యాత్. చకారాద్దూరాన్తికార్థేభ్యః. ఔపశ్లేషికో, వైషయికోఽభివ్యాపక శ్చేత్యాధారస్త్రిధా. కటే ఆస్తే. స్థాల్యాం పచతి. మోక్షే ఇచ్ఛా అస్తి. సర్వస్మిన్నాత్మా అస్తి. వనస్య దూరే అన్తికే వా. దూరాన్తికార్థేభ్య ఇతి విభక్తిత్రయేణ సహ చతస్రోఽత్ర విభక్తయః ఫలితాః.**

**(వా) క్తస్యేన్విషయస్య కర్మణ్యుపసంఖ్యానమ్. అధీతీ వ్యాకరణే. అధీతమనేనేతి విగ్రహే " ఇష్టాదిభ్యశ్చ " ఇతి కర్తరీనిః.**

**(వా) సాధ్వసాధు ప్రయోగే చ. సాధుః కృష్ణో మాతరి – అసాధుర్మాతులే.**

**(వా) నిమిత్తాత్కర్మయోగే. నిమిత్తమిహ ఫలమ్. యోగః సంయోగ సమవాయాత్మకః.**

**చర్మణి ద్వీపినం హన్తి దన్తయోర్హన్తి కుఞ్జరమ్ ।**
**కేశేషు చమరీం హన్తి సీమ్ని పుష్కలకో హతః ॥**

ఇతి భాష్యమ్.

**హేతౌ తృతీయాఽత్ర ప్రాప్తా. తన్నివారణార్థమిదమ్. సీమా అణ్డకోశః. పుష్కలకో గన్ధ మృగః. ' యోగ విశేషే ' కిమ్ ? వేతనేన ధాన్యం లునాతి.**

**సప్తమ్యధికరణే చ** : సప్తమీ, అధికరణే, చ అని పదచ్ఛేదము. అధికరణ సంజ్ఞకమగు శబ్దమునకు సప్తమీ విభక్తి వచ్చును. సూత్రములోని ' చ ' అనుదాని వలన పూర్వసూత్రమైన (అష్టాధ్యాయి సంఖ్యానుసారం) ' దూరాంతికార్థేభ్యశ్చ ' – అను దాని



నుండి 'దూరాంతికార్థేభ్యః' అను పదము అనువర్తించి దూరము, అంతికము (సమీపము) అను అర్థము గల పదములకు సప్తమీ విభక్తి వచ్చునని చెప్పబడినది.

ఔపశ్లేషికము, వైషయికము, అభివ్యాపకము అని ఆధారము మూడు విధములు.

1. **ఔపశ్లేషికము** – సంయోగ సమవాయాది సంబంధములచే ఆధారమగు శబ్దము ఔపశ్లేషికము. దేవదత్తః ' కటే ఆస్తే ' (చాపపై కూర్చుంటున్నాడు) స్థాల్యాం పచతి (గిన్నెలో వండుచున్నాడు) ఇత్యాదులు ఉదాహరణములు. వీటిలో కర్త ద్వారా ఔపశ్లేషిక ఆధారము కటము, కర్మ ద్వారా ఔపశ్లేషికము స్థాలి.

2. **వైషయికము** – సంయోగ సమవాయాద్యతిరిక్త సంబంధముచే ఆధారమగునది వైషయికము అనగా విషయముతో సంబంధ కృతమైన ఆధారము అని భావము. " మోక్షే ఇచ్ఛా అస్తి " (మోక్షమందు కోరిక కలదు) అను ఉదాహరణమున మోక్షము సంయోగ సమవాయాది సంబంధముచే కాక విషయతా సంబంధముచే (మోక్ష విషయకమగు ఇచ్ఛ) ఆధారమైనది. కనుక మోక్షము వైషయిక ఆధారము.

3. **అభివ్యాపకము** : ఆధేయము ఆధారమునందలి అవయవములు అన్నింటి వ్యాపించియున్నట్లైతే అది అభివ్యాపకము. అనగా అంతటా వ్యాపించియుండుట అని అర్థము. " సర్వస్మిన్ ఆత్మా అస్తి " (అన్నింటి యందు ఆత్మ కలదు) అను ఉదాహరణమున ఆధేయమగు ఆత్మ, ఆధారమగు సర్వమున వ్యాపించియున్నది కావున ' సర్వము ' అభివ్యాపకాధారము.

ఈ సూత్రముచేత దూరార్థకములు, అన్తికార్థములు (సమీప) అను శబ్దములకు కూడా సప్తమీ విధింపబడినది. కావున ' వనస్య దూరే అన్తికే వా ' అను ప్రయోగము సిద్ధించినది. " దూరాన్తికార్థేభ్యః " అను సూత్రముచే విధింపబడిన ద్వితీయా, పంచమీ, తృతీయా విభక్తులతో కలుపుకొని దూరాన్తికార్థములకు నాలుగు విభక్తులు ఫలించినవి.

**క్తస్యేన్విషయస్య కర్మణ్యుపసంఖ్యానమ్** : ' ఇన్ ' ప్రత్యయాంత విషయమగు క్త ప్రత్యయాంత శబ్దమునకు కర్మార్థమందు సప్తమీ విభక్తి వచ్చును. ' అధీతమనేన ' అను విగ్రహవాక్యమున " ఇష్టాదిభ్యశ్చ " అను సూత్రము చేత కర్త్రర్థమందు ' ఇన్ ' ప్రత్యయము విధించగా 'అధీతీ' అని సిద్ధించినది. ' అధీతీ ' అను శబ్దము ' ఇన్ ' ప్రత్యయాంతము. దాని యొక్క ప్రకృతి అధీత శబ్దము. దానికి కర్మ వ్యాకరణము. కావున ఆ శబ్దమునకు సప్తమీ వచ్చి " అధీతీ వ్యాకరణే " అను ప్రయోగమేర్పడినది.

**సాధ్వసాధుప్రయోగే చ** : ' సాధు ' శబ్దము, ' అసాధు ' శబ్దము ప్రయోగించినపుడు కూడా సప్తమీ విభక్తి వచ్చును. ఉదా : ' సాధుః కృష్ణో మాతరి ' (తల్లి యందు కృష్ణుడు మంచివాడు), " అసాధుః మాతులే " (మేనమామ యందు కృష్ణుడు చెడ్డవాడు).

**నిమిత్తాత్ కర్మయోగే** : ' నిమిత్తము ' అనగా ఫలము. ' యోగము ' అనగా సంయోగ సమవాయాత్మక సంబంధము. కర్మతో యోగము కలిగిన నిమిత్త ' వాచక ' శబ్దమునకు సప్తమీ వచ్చును.

**చర్మణి ద్వీపినం హన్తి దన్తయోర్హన్తి కుఞ్జరమ్ ।**
**కేశేషు చమరీం హన్తి సీమ్ని పుష్కలకో హతః ॥** అనగా

1. **చర్మణి ద్వీపినం హన్తి** : (చర్మము కొరకు వ్యాఘ్రమును చంపుచున్నాడు). ఇచ్చట నిమిత్తము చర్మము. కర్మ వ్యాఘ్రము. ఈ రెండింటికీ అవయవ–అవయవి భావము ఉన్నది కావున సమవాయ సంబంధము. ' చర్మ ' శబ్దమునకు సప్తమీ విభక్తి వచ్చినది.

2. **దన్తయోః హన్తి కుఞ్జరమ్** : (దంతములకై ఏనుగును చంపుచున్నాడు). ఫలవాచకమైన ' దంత ' శబ్దమునకు సప్తమీ విభక్తి వచ్చినది.

3. **కేశేషు చమరీం హన్తి** : (కేశముల కొరకు చమరీమృగమును వధించుచున్నాడు). ఇచ్చట ' కేశ ' శబ్దమునకు సప్తమీ విభక్తి విధింపబడినది.

4. **సీమ్ని పుష్కలకో హతః** : సీమ అనగా అండకోశము, ' పుష్కలకము " అనగా గన్ధమృగము. (సీమ కొరకై పుష్కలకము చంపబడినది). ఇక్కడ ' సీమన్ ' శబ్దమునకు సప్తమీ విభక్తి విధింపబడినది.

"హేతౌ" అను సూత్రము ద్వారా ఇక్కడ హేతువున్నది కావున తృతీయ రావల్సియుండగా ప్రస్తుతవార్తికము దానిని నివారించినది. యోగ విశేషమందే ఈ వార్తికము వచ్చును. కాబట్టి ' వేతనేన ధాన్యం లునాతి' (జీతం కొరకు ధాన్యమును కోయుచున్నాడు) అను వాక్యమున ' వేతన ' శబ్దమునకు తృతీయా వచ్చినది.

## 103. యస్య చ భావేన భావలక్షణమ్ (2–3–37)

**యస్య క్రియయా క్రియాన్తరం లక్ష్యతే తతః సప్తమీ స్యాత్. గోషు దుహ్యమానాసు గతః. (వా) అర్హాణాం కర్తృత్వేఽనర్హాణామకర్తృత్వే తద్వైపరీత్యే చ. సత్సు తరత్సు అసన్త ఆసతే. అసత్సు తిష్ఠత్సు సన్తస్తరన్తి. సత్సు తిష్ఠత్సు అసన్తస్తరన్తి. అసత్సు తరత్సు సన్తస్తిష్ఠన్తి.**



**యస్య చ భావేన భావలక్షణమ్** : యస్య, చ, భావేన, భావలక్షణమ్ అని పదచ్ఛేదము. భావశబ్దమునకు క్రియ అని అర్థము. దేనియొక్క క్రియ చేత మరొక క్రియ తెలియజేయబడుతుందో అట్టి శబ్దమునకు సప్తమీ వచ్చును. " గోషు దుహ్యమానాసు గతః " (దేవదత్తుడు ఎప్పుడు వెళ్ళాడు ? అనే ప్రశ్నకు సమాధానంగా " గోవులను పితుకుచుండగా వెళ్ళాడు" అని అర్థము) ఇచ్చట గోనిష్ఠదోహన క్రియ ద్వారా దేవదత్తుని గమన క్రియ తెలియజేయబడినది. కావున ఈ సూత్రముచేత ' గో ' శబ్దమునకు సప్తమీ వచ్చినది.

**అర్హాణాం కర్తృత్వే అనర్హాణామకర్తృత్వే తద్వైపరీత్యే చ** : (ఏదేని పనిచేయుటకు ఎవరు యోగ్యులో వారు అర్హులు, అట్లు కానివారు అనర్హులు)

1. అర్హులకు కర్తృత్వము వివక్ష చేయబడినపుడు అదే శబ్దమునకు సప్తమీ వచ్చును. అనగా తద్వాచక శబ్దములకు అని అర్థము. " సత్సు తరత్సు అసన్త ఆసతే " (మంచివారు తరించుచుండగా చెడ్డవారు అట్లే ఉన్నారు). ఇచ్చట సత్ పురుషులకు ' తరణ ' (ఈదుట) క్రియా కర్తృత్వము వివక్ష చేయబడినది.

2. అనర్హులకు అకర్తృత్వము (కర్తృత్వాభావము) వివక్ష చేయబడినప్పుడు తద్వాచక శబ్దములకు సప్తమీ వచ్చును. " అసత్సు తిష్ఠత్సు సన్తః తరన్తి " (చెడ్డవారు అట్లే ఉండిపోగా మంచివారు తరించుచున్నారు). ఇచ్చట అనర్హులకు తరణ క్రియ యందు అకర్తృత్వము వివక్షచేయబడినది కావున ' అసత్ ' శబ్దమునకు సప్తమీ వచ్చినది.

3. " తద్వైపరీత్యే చ " అనగా పైన ఉదాహరించిన వాటికి వైపరీత్యము వివక్షితమైనప్పుడు కూడా సప్తమీ వచ్చును.

(క) అర్హులకు అకర్తృత్వము వివక్ష చేయబడినప్పుడు తద్వాచక శబ్దమునకు సప్తమీ వచ్చును. ఉదా : " సత్సు తిష్ఠత్సు అసన్తః తరన్తి " (మంచివారు అట్లే ఉండిపోగా చెడ్డవారు తరించుచున్నారు).

(ఖ) అనర్హులకు కర్తృత్వము వివక్షచేయబడినప్పుడు తద్వాచక శబ్దమునకు సప్తమీ వచ్చును. ఉదా : " అసత్సు తరత్సు సన్తః తిష్ఠన్తి " (చెడ్డవారు తరించుచుండగా మంచివారు అట్లే ఉన్నారు).

## 104. షష్ఠీ చానాదరే (2–3–38)

**అనాదరాధిక్యే భావలక్షణే షష్ఠీసప్తమ్యౌ స్తః. రుదతి – రుదతో వా ప్రావ్రాజీత్.**

**రుదన్తం పుత్రాదికమనాదృత్య సన్యస్తవానిత్యర్థః.**

**షష్ఠీ చానాదరే :** షష్ఠీ, చ, అనాదరే అని పదచ్ఛేదము. అనాదరము అధికముగా భాసించునప్పుడు పూర్వసూత్రోక్త స్థలమున షష్ఠి మరియు సప్తమీ విభక్తులు వచ్చును. "రుదతి రుదతో వా ప్రావ్రాజీత్ " (కొడుకు ఏడుస్తున్నను వానిని లెక్క చేయకుండా సన్యసించెను) అనునప్పుడు రోదన క్రియాజ్ఞాప్యము ప్రవ్రజన క్రియ అనాదరమును తెలుపుతున్నది. కావున ' రుదత్ ' శబ్దమునకు షష్ఠీ మరియు సప్తమీ విభక్తులు రెండూ చెప్పబడ్డాయి.

## 105. స్వామీశ్వరాధిపతిదాయాదసాక్షిప్రతిభూప్రసూతైశ్చ (2-3-39)

**ఏతైః సప్తభిర్యోగే షష్ఠీసప్తమ్యౌ స్తః. షష్ఠ్యామేవ ప్రాప్తాయాం పాక్షికసప్తమ్యర్థం వచనమ్. గవాం గోషు వా స్వామీ. గవాం గోషు వా ప్రసూతః. గా ఏవానుభవితుం జాత ఇత్యర్థః.**

**స్వామీశ్వరాధిపతిదాయాదసాక్షిప్రతిభూప్రసూతైశ్చ** : స్వామి, ఈశ్వర, అధిపతి, దాయాద, సాక్షి, ప్రతిభూ, ప్రసూత ఈ శబ్దములతో యోగమున్నప్పుడు షష్ఠీ మరియు సప్తమీ విభక్తులు వచ్చును.

" షష్ఠీ శేషే " అను సూత్రముద్వారా షష్ఠీవిభక్తి మాత్రమే ప్రాప్తించుచుండగా ప్రస్తుత సూత్రముచే సప్తమీ కూడా వికల్పముగా వచ్చును.

" గవాం గోషు వా స్వామీ " (గో సంబంధి స్వామీ), " గవాం గోషు వా ప్రసూతః " ఇత్యాదులు ఉదాహరణలు.

## 106. ఆయుక్తకుశలాభ్యాం చాసేవాయామ్ (2-3-40)

**ఆభ్యాం యోగే షష్ఠీసప్తమ్యౌ స్తః తాత్పర్యేఽర్థే. ఆయుక్తో వ్యాపారితః. ఆయుక్తః కుశలో వా హరిపూజనే-హరిపూజనస్య వా. ' ఆసేవాయామ్ ' కిమ్ ? ఆయుక్తో గౌః శకటే. ఈషద్యుక్త ఇత్యర్థః.**

**ఆయుక్త కుశలాభ్యాం చాసేవాయామ్ :** ఆయుక్త కుశలాభ్యాం, చ, ఆసేవాయామ్ అని పదచ్ఛేదము. ' ఆసేవ ' అనగా తత్పరత్వము - ఔత్సుక్యము అని అర్థములు. ఆయుక్త, కుశల శబ్దములతో సంబంధమున్నప్పుడు తాత్పర్యార్థమందు షష్ఠీ మఱియు సప్తమీ విభక్తులు రెండును విధింపబడును. ఆయుక్తము అనగా ప్రవర్తింపబడినవాడు



అని అర్థము.

**ఉదా :** " ఆయుక్తః కుశలో వా హరిపూజనే - హరిపూజనస్య వా " (హరి పూజనము నందు ప్రవర్తింపబడినాడు లేదా సమర్థుడు)

ఆసేవార్థమందే ఈ సూత్రము వచ్చును. కావున " ఆయుక్తః గౌః శకటే " (ఎద్దు బండికి కొద్దిగా తగిలింపబడినది. ఆఙ్ శబ్దము ఈషదర్థమున ప్రయోగింపబడినది) అను ప్రయోగమందు తత్పరత్వ రూప అర్థము కనుబడుటలేదు. కావున ఈ సూత్రము రాదు. ఆయుక్త, కుశల శబ్దములతో యోగమున్నప్పుడు వైషయికాధికరణత్వము వివక్షింప చేయబడినప్పుడు సప్తమీ ప్రాప్తించుచున్నది. కాని కేవల సంబంధము వివక్షచేయబడినప్పుడు షష్ఠీ మాత్రమే ప్రాప్తించును. అట్లుకాక ఈ రెండూ విధింపజేయుటకై ఈ సూత్రము ఆరంభింపబడినది.

## 107. యతశ్చ నిర్ధారణమ్ (2-3-41)

**జాతిగుణక్రియాసంజ్ఞాభిః సముదాయాదేకదేశస్య పృథక్కరణం నిర్ధారణం యతస్తతః షష్ఠీసప్తమ్యౌ స్తః. నృణాం నృషు వా ద్విజః శ్రేష్ఠః. గవాం గోషు వా కృష్ణా బహుక్షీరా. గచ్ఛతాం గచ్ఛత్సు వా ధావన్ శీఘ్రః. ఛాత్రాణాం ఛాత్రేషు వా మైత్రః పటుః.**

**యతశ్చ నిర్ధారణమ్ :** యతః, చ, నిర్ధారణమ్ అని పదచ్ఛేదము. ఏ సముదాయము కంటే ఏకదేశము జాతిగుణక్రియా సంజ్ఞలతో వేరుచేయబడునో అట్టి సముదాయవాచక శబ్దమునకు షష్ఠీ మరియు సప్తమీ విభక్తులు విధింపబడును.

1. **జాతిచే పృథక్కరణము :** " నృణాం నృషు వా ద్విజః శ్రేష్ఠః " (మనుష్యులందు బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు) అను వాక్యమున మనుష్య సముదాయము బ్రాహ్మణత్వజాతిచే వేరు చేయబడుచున్నది. కావున ' నృ ' శబ్దమునకు షష్ఠీసప్తములు రెండు ఉపయోగించబడినవి.

2. **గుణముచే పృథక్కరణము :** " గవాం గోషు వా కృష్ణా బహుక్షీరా " (గోవులలో నల్లని గోవు చాలా పాలను ఇచ్చును) అను వాక్యమున గుణము " కృష్ణ " వర్ణముచే గోసముదాయము వేరు చేయబడినది.

3. **క్రియ చేత పృథక్కరణము :** " గచ్ఛతాం గచ్ఛత్సు వా ధావన్ శీఘ్రః " (గమన క్రియ కలిగిన వారిలో పరిగెత్తువాడు శీఘ్రత్వము కలవాడు) అను వాక్యమున ధావన క్రియచే గమనక్రియ వేరు చేయబడినది.

**4. సంజ్ఞ చేత పృథక్కరణము :** " ఛాత్రాణాం ఛాత్రేషు వా మైత్రః పటుః " (శిష్యులలో మైత్రుడు సమర్థుడు) అను వాక్యమున 'మైత్ర' సంజ్ఞచే ఛాత్రసముదాయము వేరు చేయబడినది.

పై నాలుగు ఉదాహరణలలో నిర్ధారణావధిభూతమునకు, నిర్ధార్యమాణమునకు భేదము మరియు అభేదము రెండూ కలవు. ఉదా – "నృణాం నృషు వా ద్విజః శ్రేష్ఠః" అనునపుడు నిర్ధారణ అవధిభూతులగు మనుష్యులకు నిర్ధార్యమాణమగు ద్విజునకు మనుష్యత్వ రూప సామాన్య ధర్మముచే అభేదము. బ్రాహ్మణత్వరూప విశేషణముచే భేదము కలదు.

## 108. పఞ్చమీ విభక్తే (2–3–42)

**విభాగో విభక్తమ్. నిర్ధార్యమాణస్య యత్ర భేద ఏవ తత్ర పఞ్చమీ స్యాత్. మధురాః పాటలీపుత్రకేభ్యః ఆఢ్యతరాః.**

**పఞ్చమీ విభక్తే :** పఞ్చమీ, విభక్తే అని పదచ్ఛేదము. " యతశ్చ నిర్ధారణమ్ " అనునది అనువర్తించును. విభక్తము అనగా విభాగము (భేదము) అని అర్థము. నిర్ధారణావధిభూతములకు, నిర్ధార్యమాణమునకు ఎక్కడ భేదము మాత్రము కలదో (అభేదము ఉండదో) అక్కడ పంచమీ విధింపబడును. " మధురాః పాటలీపుత్రకేభ్యః ఆఢ్యతరాః " (మధురా దేశీయులు పాటలీపుత్ర దేశీయులకంటే మిక్కిలి ధనవంతులు) అను ఉదాహరణలో మధురా, పాటలీపుత్ర వాసులకు భేదమే కాని అభేదము లేదు.

## 109. సాధునిపుణాభ్యామర్చాయాం సప్తమ్యప్రతేః (2–3–43)

**ఆభ్యాం యోగే సప్తమీ స్యాదర్చాయాం, న తు ప్రతేః ప్రయోగే. మాతరి సాధుర్నిపుణో వా. అర్చాయాం కిమ్ ? నిపుణో రాజ్ఞో భృత్యః. ఇహ తత్త్వకథనే తాత్పర్యమ్.**

**(వా) . అప్రత్యాదిభిరితి వక్తవ్యమ్. సాధుర్నిపుణో వా మాతరం ప్రతి పరి అను వా.**

**సాధునిపుణాభ్యామర్చాయాం సప్తమ్యప్రతేః :** సాధునిపుణాభ్యాం, అర్చాయాం, సప్తమీ, అప్రతేః అని పదచ్ఛేదము. 'అర్చ' అనగా పూజ అని అర్థము. సాధు, నిపుణ అను శబ్దములతో యోగమున్నప్పుడు అర్చార్థమందు సప్తమీ విభక్తి వచ్చును. 'ప్రతి' అను శబ్దమును ప్రయోగించనప్పుడు మాత్రమే సప్తమీ ప్రవర్తించును.

" మాతరి సాధుః నిపుణో వా " (తల్లి పట్ల మంచివాడు, సేవయందు కుశలుడు) అను వాక్యమున 'ప్రతి' ప్రయోగింపబడలేదు. పూజార్థము వ్యక్తమగుచున్నది. కావున మాతృశబ్దమునకు సప్తమీ విభక్తి చెప్పబడినది. అర్చార్థమందే ఈ సూత్రము వచ్చును కావున " నిపుణో రాజ్ఞో భృత్యః " (రాజుయొక్క సేవకుడు సమర్థుడు) అను వాక్యమున యథార్థకథనమే వ్యక్తమౌతున్నది కాని పూజార్థము లేదు.

**అప్రత్యాదిభిరితి వక్తవ్యమ్ :** ప్రతి, పరి అను ఈ మూడు ఉపసర్గములను ప్రయోగించినప్పుడు ప్రస్తుత సూత్రముచే సప్తమీ రాదని చెప్పవలసినది. సూత్రకారుడు "ప్రతి" తో యోగము ఉన్నప్పుడే ఈ సప్తమీ రాదని చెప్పగా, వార్తికకారుడు ప్రతి, పరి అను ఈ మూడు శబ్దములతో యోగమున్నప్పుడు కూడా సప్తమీ రాదని చెప్పుచున్నాడు. " సాధుః నిపుణో వా మాతరం ప్రతి పరి అను వా " అను వాక్యమున మాతృశబ్దమునకు సప్తమీ చెప్పబడలేదు.

## 110. ప్రసితోత్సుకాభ్యాం తృతీయా చ (2–3–44)

**ఆభ్యాం యోగే తృతీయా స్యాత్ చాత్సప్తమీ. ప్రసిత ఉత్సుకో హరిణా హరౌ వా.**

**ప్రసితోత్సుకాభ్యాం తృతీయా చ :** ప్రసితోత్సుకాభ్యాం, తృతీయా, చ అని పదచ్ఛేదము ప్రసిత, ఉత్సుక అను శబ్దములతో యోగమున్నప్పుడు తృతీయా, సప్తమీ విభక్తులు వచ్చునని సూత్రార్థము. ఉదా : " ప్రసితః ఉత్సుకో హరిణా హరౌ వా " (హరి యందు ఔత్సుక్యము కలవాడు) అను వాక్యమున హరిణా, హరౌ అని తృతీయా, సప్తమీలు రెండు ఉ పయోగింపబడినవి.

## 111. నక్షత్రే చ లుపి (2–3–45)

**నక్షత్రే ప్రకృత్యర్థే యో లుప్సంజ్ఞయా లుప్యమానస్య ప్రత్యయస్యార్థః తత్ర వర్తమానాత్తృతీయాసప్తమ్యౌ స్తోఽధికరణే. 'మూలేనావాహయేద్దేవీం శ్రవణేన విసర్జయేత్'. మూలే శ్రవణే ఇతి వా. లుపి కిమ్ ? పుష్యే శనిః.**

**నక్షత్రే చ లుపి :** నక్షత్రే, చ లుపి అని పదచ్ఛేదము. 'సప్తమ్యధికరణే చ' అను సూత్రమునుండి మండూక ప్లుతి చే 'అధికరణే' అను పదము అనువర్తించును. నక్షత్రము ప్రకృత్యర్థము కావలెను. " లుప్ " సంజ్ఞచే లోపించిన ప్రత్యయార్థమందు ఆ ప్రకృత్యర్థము ఉన్డాలి. అట్టి శబ్దమునకు అధికరణార్థ మందు తృతీయా సప్తములు

వచ్చును.

ఉదా : " మూలేన ఆవాహయేత్ దేవీం శ్రవణేన విసర్జయేత్ " ('మూలా' నక్షత్ర కాలమున దేవిని ఆవాహన చేయవలెను. శ్రవణ నక్షత్రకాలమున విసర్జన చేయవలెను) ఇచ్చట మూల, శ్రవణలు నక్షత్రవాచకములు. మూల నక్షత్రముతో కూడిన కాలము, శ్రవణ నక్షత్రముతో కూడిన కాలము అను అర్థములో మూల, శ్రవణ నక్షత్ర శబ్దములకు "నక్షత్రేణ యుక్తః కాలః" అను సూత్రముతో తద్ధిత 'అణ్' ప్రత్యయం, ఆ ' అణ్ ' ప్రత్యయమునకు 'లుప్' (లోపము) వచ్చినవి. కావున మూల, శ్రవణ శబ్దములు 'లుప్' ప్రత్యయార్థ వాచకములు అయినవి. " అట్టి కాల మందు " అను రీతిగా అధికరణార్థము కూడ తెలియుచున్నది. కావున మూల, శ్రవణ శబ్దములకు తృతీయా చెప్పినచో మూలేన, శ్రవణేన అని, సప్తమీ వచ్చినచో మూలే, శ్రవణే అని సిద్ధించినవి.

సూత్రములో ' లుపి ' అనుపదము వాడుటచే కేవల నక్షత్రవాచక "పుష్యే శనిః" ఇత్యాదులందు ఈ సూత్రం ప్రవర్తించదు.

## 112. సప్తమీపఞ్చమ్యౌ కారకమధ్యే (2-3-7)

**శక్తిద్వయమధ్యే యౌ కాలాధ్వానౌ తాభ్యామేతే స్తః. అద్య భుక్త్వాఽయం ద్వ్యహే ద్వ్యహాద్వా భోక్తా. కర్తృకర్మశక్త్యోర్మధ్యేఽయం కాలః. ఇహస్థోఽయం క్రోశే క్రోశాద్వా లక్ష్యం విధ్యేత్. కర్తృకర్మశక్త్యోర్మధ్యే అయం దేశః. అధికశబ్దేన యోగే సప్తమీపఞ్చమ్యావిష్యేతే. "తదస్మిన్నధికమ్" ఇతి " యస్మాదధికమ్ " ఇతి చ సూత్రనిర్దేశాత్. లోకే-లోకాత్ వా అధికో హరిః.**

**సప్తమీ పఞ్చమ్యౌ కారక మధ్యే :** సప్తమీపంచమ్యౌ, కారకమధ్యే అని పదచ్ఛేదము. ఈ సూత్రమందు వ్యాఖ్యానమును బట్టి కారకశబ్దమునకు కర్తృ అను అర్థము కాదు. కర్తృత్వాదిశక్తి అని అర్థము. కారకయోః మధ్యం కారకమధ్యం, తస్మిన్ కారకమధ్యే అని విగ్రహవాక్యము.

" కాలాధ్వనోరత్యన్తసంయోగే " అను సూత్రము నుండి ' కాలాధ్వనోః ' అను పదము అనువర్తించును. శక్తిద్వయ మధ్యలో ఏ కాలము, 'అధ్వ' కలదో వాటికి సప్తమీ, పంచమీ విభక్తులు విధింపబడును.

" అద్య భుక్త్వా అయం ద్వ్యహే ద్వ్యహాద్వా భోక్తా " (ఈరోజు భుజించి మరల రెండు రోజుల తర్వాత భుజించును) అను వాక్యమున కర్తృగత కర్తృత్వశక్తుల మధ్యకాలము ద్వ్యహము. కావున ఆ శబ్దమునకు సప్తమీ, పంచమీ విభక్తులు రెండునూ చెప్పబడినవి.

" ఇహస్థోఽయం క్రోశే క్రోశాద్వా లక్ష్యం విధ్యేత్ " (ఇచ్చట నుండి క్రోశము దూరములో ఉన్న లక్ష్యమును బాణముతో ఛేదించును) అను స్థలమందు కర్తృకర్మగత కర్తృత్వ కర్మత్వ శక్తుల మధ్య క్రోశము దూరమనెడు దేశము. కావున 'క్రోశ' శబ్దమునకు పంచమీ, సప్తములు విధింపబడినవి.

"తస్మిన్నధికమ్" అను సూత్రానుసారం ' అధిక ' శబ్దయోగమున సప్తమీ, "యస్మాదధికమ్" అను సూత్రానుసారం ' పంచమీ ' ప్రయోగమును పాణినిమహర్షి చూపెను. దీనివలన " లోకే లోకాద్వా అధికో హరిః " అను ప్రయోగము సిద్ధించును.

## 113. అధిరీశ్వరే (1-4-97)

**స్వస్వామి భావసంబన్ధేఽధిః కర్మ ప్రవచనీయ సంజ్ఞః స్యాత్.**

**అధిరీశ్వరే :** అధిః, ఈశ్వరే అని పదచ్ఛేదము. ఈశ్వర శబ్దముచే స్వస్వామిభావ సంబంధము వివక్ష చేయబడినది. " కర్మప్రవచనీయాః " అను అధికారసూత్రము అనువర్తించినది. స్వస్వామిభావ సంబంధార్థమందు " అధి " అనునది కర్మప్రవచనీయసంజ్ఞ కలదియగును.

## 114. యస్మాదధికం యస్యచేశ్వరవచనం తత్ర సప్తమీ (2-3-9)

**అత్ర కర్మ ప్రవచనీయయుక్తే సప్తమీ స్యాత్. ఉప పరార్ధే హరేర్గుణాః. పరార్ధాదధికా ఇత్యర్థః. ఐశ్వర్యే తు స్వస్వామిభ్యాం పర్యాయేణ సప్తమీ. అధి భువి రామః. అధి రామే భూః. సప్తమీ శౌణ్డైరితి సమాసపక్షే తు రామాధీనా. "అషడక్ష" ఇత్యాదినా ఖః.**

**యస్మాదధికం యస్యచేశ్వరవచనం తత్ర సప్తమీ :** యస్మాత్ , అధికం, యస్య, చ, ఈశ్వరవచనం, తత్ర, సప్తమీ అని పదచ్ఛేదము. " కర్మ ప్రవచనీయ యుక్తే ద్వితీయా " అను సూత్రము నుండి ' కర్మ ప్రవచనీయ యుక్తే ' అను పదము అనువర్తించినది. కర్మ ప్రవచనీయముతో యోగమున్నప్పుడు దేనికంటే ఆధిక్యము చెప్పబడునో, ఎవరికి సంబంధించిన ఐశ్వర్యమును గూర్చి చెప్పబడునో అట్టి శబ్దములకు సప్తమీ విభక్తి వచ్చును. శేషషష్ఠికి ఇది అపవాదము.

" ఉప పరార్ధే హరేః గుణాః " అనునది మొదటి ఉదాహరణము. ' పరార్ధము' అనగా దేనికంటే ఇంక వేరే సంఖ్య ఉండదో అది అని అర్థము. పరార్ధము కంటే హరిగుణములు అధికము అని అర్థము. పరార్ధ శబ్దమునకు సప్తమీ వచ్చినది.

అవధిత్వము సప్తమ్యర్థము. " ఉపోఽధికే చ " అను సూత్రముచే " ఉప " శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ కలదు. " అధి భువి రామః, అది రామే భూః " అనునది రెండవ ఉదాహరణము. " యస్య చ ఈశ్వర వచనం " అనుదానికి రెండు విధముల అర్థము చెప్పవచ్చును.

1. యత్సంబంధి ఈశ్వరుడు చెప్పబడుచున్నాడో ఆ శబ్దమునకు సప్తమీ వచ్చునని అర్థము. భూసంబంధి ఈశ్వరుడు రాముడు కావున ' స్వ ' వాచకము భూ శబ్దమునకు సప్తమీ వచ్చి " భువి " అను రూపమేర్పడినది.

2. యన్నిష్ఠమైన ఐశ్వర్యమును చెప్పెదమో ఆ శబ్దమునకు సప్తమీ వచ్చును అని మరొక అర్థము. రామ నిష్ఠమైన ఈశ్వరత్వమును చెప్పుచున్నాము. కావున 'స్వామి' వాచక ' రామ ' శబ్దమునకు సప్తమీ వచ్చినది.

" అధిరీశ్వరే " అను సూత్రముచే ' అధి ' అను శబ్దమునకు కర్మ ప్రవచనీయ సంజ్ఞ కలదు. ' రామే ' అను సప్తమ్యంతమునకు అధి శబ్దముతో " సప్తమీ శౌణ్డైః " అను సూత్రముచేత సప్తమీ తత్పురుష సమాసము విధింపగా ' రామాధి ' అని కాగా, "అషడక్ష" ఇత్యాది సూత్రముచే రామాధి శబ్దముపై ' ఖ ' ప్రత్యయము, ఈనాదేశము చేయగా ' రామాధీనా ' అని అగును.

## 115. విభాషా కృఞి (1-4-98)

**అధిః కరోతౌ ప్రాక్సంజ్ఞో వా స్యాదీశ్వరేఽర్థే. యదత్ర మామధికరిష్యతి. వినియోక్ష్యత ఇత్యర్థః. ఇహ వినియోక్తురీశ్వరత్వం గమ్యతే. అగతిత్వాత్ "తిఙి చోదాత్తవతి" ఇతి నిఘాతో న.**

**విభాషా కృఞి :** విభాషా, కృఞి అని పదచ్ఛేదము. " అధిరీశ్వరే " అను సూత్రము, "కర్మప్రవచనీయాః" అను అధికార సూత్రము అనువర్తించినవి. ' కృఞ్ ' ధాతువు పరముగా ఉన్నచో ' అధి ' అనుదానికి వికల్పముగా కర్మప్రవచనీయ సంజ్ఞ వచ్చును. " యదత్ర మామ్ అధికరిష్యతి " అను ఉదాహరమున అధికరిష్యతి అనగా వినియోక్ష్యతే



(వినియోగించునో) అని అర్థము. ఎవరైతే ఈ పనియందు నన్ను వినియోగించెదరో ఆజ్ఞాపించెదరో అని అర్థము. ఇక్కడ వినియోగించువారికి ఈశ్వరత్వము తెలియబడుచున్నది. ఇచ్చట ' అధి ' శబ్దమునకు కర్మ ప్రవచనీయ సంజ్ఞచే గతిసంజ్ఞ బాధింపబడుట వలన దానికి " తిఙి చోదాత్తవతి " అను సూత్రముచే నిఘాత స్వరము ప్రవర్తించదు.

ఇతి సప్తమీ విభక్తిః,

ఇతి కారక ప్రకరణమ్.

# అవ్యయీభావసమాస ప్రకరణమ్

పూర్వపదము యొక్క అర్థము ప్రధానముగా గలది అవ్యయీభావ సమాసము. ఈ సమాసమున ఇతర సమాసములవలె విశేష్య నిఘ్న విభక్తి ప్రత్యయములనన్నింటిని తీసుకోకుండా కేవలం అవ్యయము మాత్రమే తీసుకొనబడును కావున దీనికి అవ్యయీభావ సమాసము అనుపేరు పెట్టబడినది. పూర్వపదమైన అవ్యయముచే విశిష్టమైన అర్థము బోధింపబడును కావున " పూర్వపదార్థ ప్రధానః అవ్యయీభావః " అని ఈ సమాసమునకు లక్షణము.

ఉదా – అధిహరి ఈ సమాసపదంలో ' అధి ' అను సప్తమీ విభక్త్యర్థము అవ్యయముచే చెప్పబడుచున్నది. అందువలన ' అధిహరి ' తరువాత సప్తమీ విభక్తి ప్రత్యయము చేర్చవలసిన అవసరంలేదు. అవ్యయీభావ సమాసమును నపుంసకలింగముగా పరిగణింపవలెను. విభక్తి రహిత భాషా పరిణామమునకు ఈ అవ్యయీభావసమాసము ఒక ఉదాహరణగా చెప్పవచ్చును.

## 116. సమర్థః పదవిధిః (2-1-1)

**పదసమ్బన్ధీ యో విధిః స సమర్థాశ్రితో బోధ్యః.**

పదములకు సంబంధించిన విధి సమర్థములైన పదములను ఆశ్రయించి ఉండునని తెలుసుకోవలసినది.

ఒక సుబన్తము మఱొక సుబన్తముతో కలిసినచో అది సమాసమగును. సుబన్తము పదము కావున సమాసాది విధులు (కార్యములు) పదములకు సంబంధించినవి. ఇట్లు

# అథ ఉత్తరార్ధమ్

## అథ తిఙన్తే భ్వాది ప్రకరణమ్

సంస్కృతమున ధాతువు లన్నియు భ్వాదులు, అదాదులు, జుహోత్యాదులు, దివాదులు, స్వాదులు, తుదాదులు, రుధాదులు, తన్వాదులు, క్ర్యాదులు, చురాదులు అని పదిగణములుగ విభజింపబడి యున్నవి :-

భ్వాద్యదాదిర్జుహోత్యాదిర్దివాదిః స్వాదిరేవ చ
తుదాదిశ్చ రుధాదిశ్చ తనుక్ర్యాదిచురాదయః.

ఈ ప్రకరణమున భ్వాదిధాతువుల ప్రక్రియ చూపబడుచున్నది.

లట్, లిట్, లుట్, లృట్, లేట్, లోట్, లఙ్, లిఙ్, లుఙ్, లృఙ్, ఏషు పఞ్చమో లకారశ్ఛన్దోమాత్రగోచరః.

'లట్'మొదలగు పదింటియందును లకార ముండుటచే వీటికి లకారము లని పేరు. ఈ లకారములు కాలాదిబోధనము నిమిత్తము ధాతువునకు చివర చేర్చ బడును. ఇందు ఐదవ లకార మగు 'లేట్' వేదమునందు మాత్రమే ప్రయోగింప బడును. లౌకికభాషలో దాని ప్రయోగము లేదు.

375. లః కర్మణి చ భావేచాఽకర్మకేభ్యః 1.4.69

లకారాః సకర్మకేభ్యః కర్మణి కర్తరి చ స్యురకర్మకేభ్యో భావే కర్తరి చ.

చకారముచే 'కర్తరి కృత్' నుండి 'కర్తరి'అను పదము అనుకర్షింప బడును. 'ధాతోః'అధికారము. లకారములు సకర్మకధాతువులకు కర్మార్థకర్త్రర్థములందును, అకర్మకధాతువులకు భావకర్త్రర్థములందును (చేర్చబడును) వచ్చును.

'ఫలవ్యాపారయోర్ధాతుః' అను న్యాయముచే ధాతువు ఫలమును వ్యాపారమును బోధించును. ఉదాహరణకు:-'పచ్'ధాతువునకు విక్లిత్తికి-అనగా బియ్యము మొదలగునది ఉడికి ఉబుకుటకు-అనుకూల మగు వ్యాపారము (పని), అని యర్థము. అందు విక్లిత్తి ఫలము. ఈ ఫలమునకు ఆశ్రయ మగుదానికి కర్మ యనియు, వ్యాపారమునకు ఆశ్రయ మగుదానికి కర్త యనియు, వ్యాపారమునకు భావ మనియు పేర్లు. పై యుదాహరణమున విక్లిత్తిరూపఫలము అన్నమునం దున్నది గాన అది కర్మ. దాని కనుకూల మగు వ్యాపారము దేవదత్తునియం దున్నది గాన దేవదత్తుడు కర్త. ఆ వ్యాపారము (వండుట) భావము.

ఫలము వ్యాపారము రెండును వేరు వేరు స్థలములం దున్నచో నాధాతువు సకర్మకము. 'పచ్'ధాత్వర్థ మగు ఫలము అన్నమునందును, వ్యాపారము దేవదత్తుని యందును ఉన్నది గాన నిది సకర్మకము. ఫలవ్యాపారములు రెండును ఒకే వ్యక్తియం దున్నచో నది అకర్మకము. 'స్వప్'ధాతువునకు నిద్రించుట యని యర్థము. నిద్రవలన కలుగు సుఖరూప మగు ఫలము, తదనుకూలవ్యాపారము ఈ రెండును దేవదత్తునియందే యున్నవి గాన ఈ ధాతువు అకర్మకము.

ధాతువునకు కర్త్రర్థమున లకారమును జేర్చినచో-అనగా లకారము కర్తను బోధించినచో-కర్తృవాచ్యము(కర్తరి ప్రయోగము)అనియు, కర్మార్థమున జేర్చినచో-అనగా లకారము కర్మను బోధించుచో-కర్మవాచ్యము (కర్మణిప్రయోగము) అనియు, భావార్థమున జేర్చినచో-అనగా లకారము వ్యాపారమును మాత్రము బోధించినచో- భావవాచ్యము (భావే ప్రయోగము) అనియు పేర్లు. 'పచతి' (వండుచున్నాడు) అనునపుడు లకారము వండుచున్న కర్త యగు దేవదత్తుని చెప్పుచున్నది. 'పచ్యతే' (వండబడుచున్నది)అనునపుడు వండబడుచున్న (కర్మ యగు) అన్నాదికమును చెప్పుచున్నది. కావున పై రెండు క్రియలకు వరుసగా కర్తృవాచ్య, కర్మవాచ్యము లని పేర్లు. 'రామేణసుప్యతే' (రామునిచే-రాముడు-నిద్రపోవుట) అనునపుడు లకారము నిద్రించుట యను వ్యాపారమును మాత్రము బోధించుచున్నది గాన నీ క్రియ భావవాచ్యము. ఈ విధముగ లకారములు కర్తృ, కర్మ, భావములను బోధించుచుండును. సకర్మకధాతువులు కర్తృ, కర్మవాచ్యములందును. అకర్మకధాతువులు కర్తృభావవాచ్యములందును ప్రయోగింపబడును.

376. వర్తమానే లట్ 3.2.123

వర్తమానక్రియావృత్తేర్ధాతోర్లట్ స్యాత్. అటావితౌ, ఉచ్చారణ సామర్థ్యాత్ లస్య నేత్త్వమ్. 'భూ' సత్తాయామ్. కర్తృవివక్షాయాం 'భూల్' ఇతి స్థితే-

'ధాతోః' అనునది తృతీయాధ్యాయ సమాప్తివరకు అధికారముగ వచ్చును.

వర్తమానకాలమునకు సంబంధించిన క్రియను (పని) బోధించు ధాతువు కంటె (పరముగ) 'లట్' వచ్చును.

'లట్' లోని అకారటకారములు ఇత్సంజ్ఞకములు. లకారమునకు 'లశక్వతద్ధితే' అను సూత్రముచే (136) ఇత్సంజ్ఞ రాదు. ఏల యన ఇత్సంజ్ఞ చేసిన పక్షమున లకారోచ్చారణమే వ్యర్థమగును. ఇత్సంజ్ఞాప్రయుక్త మగు విశేష కార్యము కూడ ఏదియును లేదు.

'భూ' ధాతువునకు 'ఉండుట' యని యర్థము. దీనికి కర్తృవివక్షలో కర్తృవాచ్యమున పై సూత్రముచే 'లట్' చేసిన పిమ్మట 'భూల్' అని యుండగా-

377. తిప్, తస్, ఝి, సిప్, తస్, థ, మిప్, వస్, మస్, తాఽఽతాం, ఝ, థాసాఽఽథాం, ధ్వమిడ్వహి, మహిఙ్ 3.4.99

ఏతేఽష్టాదశ లాఽఽదేశాః స్యుః.

తిప్, తస్, ఝి, సిప్, తస్, థ, మిప్, వస్, మస్, త, ఆతామ్, ఝ, థాస్, ఆథామ్, ధ్వమ్, ఇట్, వహి, మహిఙ్. అను నీ పదునెనిమిదియు లకారమున కాదేశముగ వచ్చును.

'తిప్' లోని 'తి' మొదలు 'మహిఙ్' లోని 'ఙ్' వరకు ప్రత్యాహారము చేయుటచే ఈ పదునెనిమిది ప్రత్యయములకు 'తిఙ్' లని పేరు. అట్లే పదవదగు 'త' మొదలు చివరి 'ఙ్' వరకు ప్రత్యాహారము చేయుటచే నా తొమ్మిది ప్రత్యయములకును 'తఙ్' లని పేరు.

378. లః పరస్మైపదమ్ 1.4.99

లాదేశాః పరస్మైపదసంజ్ఞాః స్యుః.

లకారస్థానమున వచ్చిన ఆదేశములు పరస్మైపదసంజ్ఞకము లగును. ఈ సూత్రముచే లకారస్థాన వచ్చిన పదునెనిమిది ప్రత్యయములకును పరస్మైపద సంజ్ఞ రావలసి యుండగా:-

379. తఙానావాత్మనేపదమ్ 1.4.100

'తఙ్'ప్రత్యాహారః, శానచ్ కానచౌ చ ఏతత్సంజ్ఞాః స్యుః. పూర్వసంజ్ఞాపవాదః.

'తఙ్'అనునది ప్రత్యాహారము. 'తఙ్'లు 'శానచ్''కానచ్' ప్రత్యయములును ఆత్మనేపదసంజ్ఞకము లగును. ఈ సూత్రము 'లః పరస్మైపదమ్'అను సూత్రమునకు అపవాదము.కావున పరస్మైపదసంజ్ఞను బాధించి తఙాదులకు ఆత్మనేపదసంజ్ఞ మాత్రము లభించును.

లకారములస్థానమున ఈ 'తిఙ్'ప్రత్యయములే కాక 'లిటః కానజ్వా', (831) 'క్వసుశ్చ', (832) 'లటః శతృశానచావప్రథమాసమానాధికరణే'(834) 'లృటః సద్వా', (838) 'తాచ్ఛీల్యవయోవచనేషు చానశ్',అను సూత్రములచే 'కానచ్' 'క్వసు' 'శతృ' 'శానచ్' 'చానశ్'అను ప్రత్యయములు గూడ విధింపబడినవి. ఇవి యన్నియు లాదేశములే.అందు 'తఙ్''కానచ్''శానచ్'లకు ఈ సూత్రముచే ఆత్మనేపదసంజ్ఞ విధింపబడినది.'శానచ్''కానచ్''చానశ్'లలో 'ఆన' అనునది మాత్రమే శేషించును. ఐనను మొదటి రెండిటికే ఈ సూత్రమున 'ఆన' అను పదముచే గ్రహణము,

380. అనుదాత్తఙిత ఆత్మనేపదమ్ 1.3.12

అనుదాత్తేతో ఙితశ్చ ధాతోరాత్మనేపదం స్యాత్,

అనుదాత్త మగు 'అచ్'ఇత్సంజ్ఞకముగా గలదియు,ఙకారేత్సంజ్ఞకమును అగు ధాతువునకు ఆత్మనేపదములు (తఙ్,శానచ్,కానచ్లు) వచ్చును.

'ఏదవృద్ధౌ'మొదలగు ధాతువులు అనుదాత్తేత్కములుగ ధాతుపాఠమున చూపబడినవి 'శీఙ్'మొదలగు కొన్ని ధాతువులకు ఙకారానుబంధము చేర్చబడినది. ఈ రెండు విధములగు ధాతువులకును ఆత్మనేపదప్రత్యయములు చేర్చబడును.

381. స్వరితఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే 1.3.72

స్వరితేతో ఞితశ్చ ధాతోరాత్మనేపదం స్యాత్,కర్తృగామిని క్రియాఫలే.

ఇత్సంజ్ఞక మగు స్వరితము కలదియు, ఇత్సంజ్ఞకమగు ఞకారము కలదియు నగు ధాతువునకు క్రియాఫలము కర్తను చెందునపుడు ఆత్మనేపదప్రత్యయములు వచ్చును.

'యజ దేవపూజాసఙ్గతికరణదానేషు' అను ధాతువునందలి జకారోత్తరవర్తి యగు అకారము స్వరితము, ఇత్సంజ్ఞకము. 'డుకృఞ్ కరణే' అను ధాతువు నందలి ఞకారము ఇత్సంజ్ఞకము. కావున నిట్టి ధాతువులు క్రియాఫలము కర్తకు చెందునపుడు ఆత్మనేపదమున ప్రయోగింపబడును. పరునకు చెందినచో పరస్మైపదమున ప్రయోగింపబడును.

'ఆత్మనేపదము' 'పరస్మైపదము' అను పేర్లు సార్థకములు. ధాతుబోధితమగు ఫలము కర్తకు చెందినచో ఆత్మనేపదము, పరునకు చెందినచో పరస్మైపదము. సంస్కృతమున కొన్ని ధాతువులు నియతముగ ఆత్మనేపదులు, కొన్ని పరస్మైపదులు. అట్టి ధాతువుల విషయమున ఈ నియమమును పూర్తిగ పాటించుట శక్యము కాదు. ఉదాహరణమునకు:- 'ఖాదృ భక్షణే' అను ధాతువు నిత్యము పరస్మైపదమునందు ప్రయోగింపబడును. కాని భుజించుటవలన కలుగు, తృప్తి రూప మగు ఫలము కర్తకే చెందుచున్నది కాని పరునకు కాదు. కాని 'స్వరితేత్'లు 'ఞిత్'లు నగు ధాతువులు మాత్రము ఉభయపదులు గాన వీటిని అర్థానుసారముగా ఆత్మనేపద పరస్మైపదములందు ప్రయోగింపవచ్చును.

382. శేషాత్కర్తరి పరస్మైపదమ్ 1.3.78

ఆత్మనేపదనిమిత్తహీనాద్ధాతోః కర్తరి పరస్మైపదం స్యాత్.

ఇతరవిధమగు-అనగా ఆత్మనేపదప్రత్యయములు వచ్చుటకు నిమిత్తములు లేని-ధాతువునకు కర్త్రర్థమున పరస్మైపదప్రత్యయములు వచ్చును.

పై సూత్రములందు ఆత్మనేపదనిమిత్తములు చూపబడియున్నవి. ధాతువు 'అనుదాత్తేత్'గాని 'ఙిత్'గాని యైనను, ధాతువు 'స్వరితేత్'గాని 'ఞిత్' గాని యై యుండి ఫలము కర్తృగామి యైనను ఆత్మనేపదము వచ్చును. ఈ నాల్గును ఆత్మనేపదనిమిత్తములు. ఈ నాల్గు నిమిత్తములలో నే యొక్కటియులేని ధాతువునకు కర్తృవాచ్యమునందు మాత్రమే. పరస్మైపదప్రత్యయములు వచ్చును. అనగా ఏధాతువునకైనను కర్మవాచ్య,భావవాచ్యములందు ఆత్మనేపదప్రత్యయములు మాత్రమే వచ్చును. భూధాతువునకు ఆత్మనేపదనిమిత్తములలో ఏ నిమిత్తమును లేదు గాన నిది పరస్మైపది.

383. తిఙస్త్రీణి త్రీణి ప్రథమమధ్యమోత్తమాః 1.4.101

తిఙః ఉభయోః పదయోః త్రయస్త్రికాః క్రమాదేతత్సంజ్ఞాః స్యుః.

'లఃపరస్మైపదమ్', 'తఙానావాత్మనేపదమ్' నుండి 'పరస్మైపదమ్' "ఆత్మనేపదమ్" అనువర్తించును పరస్మైపదాత్మనేపద తిఙ్ ప్రత్యయముల మూడేసి ప్రత్యయములకు వరుసగా ప్రథమపురుషమధ్యమపురుషోత్తమపురుషము లని పేరు.

తిఙ్ ప్రత్యయములలో మొదటి తొమ్మిది ప్రత్యయములును పరస్మైపదములు, చివరి తొమ్మిది ప్రత్యయములును ఆత్మనేపదములు. ఈ ప్రత్యయములను మూడు మూడు చొప్పున విభజింపగా పరస్మైపదములు మూడు గణములును, ఆత్మనేపదములు మూడు గణములును అగును. ఈ మూడు త్రికములకును వరుసగా ప్రథమపురుషము మధ్యమపురుషము. ఉత్తమపురుషము అని పేర్లు.

384. తాన్యేకవచనద్వివచనబహువచనాన్యేకశః 1.4.102

లబ్ధప్రథమాదిసంజ్ఞాని తిఙస్త్రీణి త్రీణి ప్రత్యేకమేకవచనాది సంజ్ఞాని స్యుః.

పైసూత్రమునుండి 'తిఙః', 'త్రీణి', త్రీణి'అనువర్తించును. అట్టి— అనగా ప్రథమపురుషాదిసంజ్ఞలు గల ఆ మూడు 'తిఙ్' ప్రత్యయములు ప్రత్యేకము (ఒక్కొక్కటి) ఏకవచనము, ద్వివచనము, బహువచనము అను సంజ్ఞ కలవై యగును.

| | పరస్మైపదములు. | | | ఆత్మనేపదములు. | |
|---|---|---|---|---|---|
| | ఏ. | ద్వి. | బ. | ఏ. | ద్వి. | బ. |
| ప్రథమపురుషము. | తిప్ | తస్ | ఝి | త | ఆతామ్ | ఝ |
| మధ్యమపురుషము. | సిప్ | థస్ | థ | థాస్ | ఆథామ్ | ధ్వమ్ |
| ఉత్తమపురుషము. | మిప్ | వస్ | మస్ | ఇట్ | వహి | మహిఙ్. |

ఎప్పుడే యే పురుషము వచ్చునో నియమము చెప్పబడుచున్నది:-

385. యుష్మద్యుపపదే సమానాధికరణే
స్థానిన్యపి మధ్యమః 1.4.105

తిఙ్వాచ్యకారకవాచిని యుష్మది ప్రయుజ్యమానేఽప్రయుజ్యమానే చ మధ్యమః.

'లః పరస్మైపదమ్' నుండి 'లః'అనువర్తించును. ఒకే అర్థమును బోధించు పదములకు సమానాధికరణము లని పేరు. ఇచట సమానాధికరణము

అనగా 'యుష్మచ్ఛబ్దము' 'తిఙ్'ప్రత్యయము గూడ ఒకే యర్థమును బోధింప వలె నని యర్థము. 'స్థానిని' యనగా 'ప్రస క్తే'అని యర్థము. ప్రయోగింప కున్నను అర్థమును బోధించునది- అనగా 'అప్రయుక్తము'అని యర్థము.

తిఙ్ చే బోధింపబడుచున్న కారకమును బోధించు యుష్మచ్ఛబ్దము ప్రయోగింపబడినను ప్రయోగింపబడకున్నను మధ్యమపురుషము వచ్చును.

లకారము దాని స్థానమున వచ్చిన 'తిఙ్'ప్రత్యయము కర్తృకారకమును గాని కర్మకారకమును గాని బోధించును. యుష్మచ్ఛబ్దము కూడ ఆ కారకమునే బోధించినచో మధ్యమపురుషప్రత్యయములు- 'సిప్,థస్,థ:థాస్,అథామ్,ధ్వమ్' అనునవి- లకారస్థానమున వచ్చును. యుష్మచ్ఛబ్దమును తప్పక ప్రయోగింప వలె నను నియమము లేదు; దాని యర్థము గమ్యమైన చాలును. కావున 'హే రామ । రక్ష'ఇత్యాదులలో అవ్యాప్తిలేదు.

386. అస్మద్యుత్తమః 1.4.107

తథాభూతేఽస్మది ఉత్తమః.

పై సూత్రమునుండి 'సమానాధికరణే', 'ఉపపదే', 'స్థానిని', 'అపి' అనువర్తించును. అట్టి- అనగా 'తిఙ్'చే బోధింపబడుచున్న కారకమును బోధించు అస్మచ్ఛబ్దము ప్రయోగింపబడినను, ప్రయోగింపబడకున్నను లకారస్థానమున ఉత్తమ పురుషము వచ్చును.

387. శేషే ప్రథమః 1.4.108

మధ్యమోత్తమయోరవిషయే ప్రథమః స్యాత్.

మధ్యమోత్తమపురుషముల కవకాశము లేని ఇతరస్థలములందు ప్రథమ పురుషము వచ్చును.

'భూ'ధాతువునకు కర్తృవివక్షయందు వర్తమానమున (భూలట్) 'భూ + ల్'అని యుండగా ప్రథమపురుషైకవచనమున లకారస్థానమున 'తిప్' అను పరస్మైపద 'తిఙ్'ప్రత్యయము వచ్చినది. 'తిప్'లోని పకారమునకు హలన్త్య సూత్రముచే (1) ఇత్సంజ్ఞ- 'భూ తి'అని యుండగా:-

388. తిఙ్ శిత్ సార్వధాతుకమ్ 3.4.113

తిఙః శితశ్చ ధాత్వధికారోక్తాః ఏతత్సంజ్ఞాః స్యుః.

'ధాతోః'అధికారమున విధింపబడిన 'తిఙ్'లును, శకారేత్సంజ్ఞకప్రత్యయములను సార్వధాతుకసంజ్ఞకము లగును.

ఈ సూత్రముచే ధాత్వధికారోక్త మగు 'తి'అనునది సార్వధాతుక మైనది.

390. కర్తరి శప్ 3.1.68

కర్త్రర్థే సార్వధాతుకే పరే ధాతోః శప్.

'సార్వధాతుకే యక్'నుండి 'సార్వధాతుకే'అనియు, 'ధాతోరేకాచో హలాదేః క్రియాసమభిహారే యఙ్'నుండి 'ధాతోః'అనియు అనువర్తించును. కర్త్రర్థక మగు సార్వధాతుకము పర మగునపుడు ధాతువు కంటె (పరముగ) 'శప్'ప్రత్యయము వచ్చును.

'తిఙ్'లు పర మగునపుడు విహితము లగు శబాదులకు వికరణ మను పేరు ప్రాచీనాచార్యప్రోక్తము.

కర్త్రర్థక మగు లకారము స్థానమున వచ్చిన 'తిఙ్'ప్రత్యయములు గూడ కర్త్రర్థకములే గాన 'భూ + తి' యనునపుడు కర్త్రర్థక మగు సార్వధాతుకము పరముగ నున్నది. కావున ధాతువునకు పరముగ 'శప్'ప్రత్యయము వచ్చినది. 'శప్'లోని శకారము 'లశక్వతద్ధితే'అను సూత్రముచేతను (136) పకారము హలన్త్యసూత్రముచేతను (1) ఇత్సంజ్ఞకములు. 'అ'మిగులును. 'భూ + అ + తి'అని యుండ 'యస్మాత్ప్రత్యయవిధి స్తదాదిప్రత్యయే జ్ఞమ్' అను సూత్రముచే (133) 'శప్'పరముగనున్నపుడు 'భూ'అనుదానికి అఙ్గసంజ్ఞ యున్నది గాన:—

390. సార్వధాతుకార్ధధాతుకయోః 7.3.84

అనయోఃపరయోరిగన్తాఙ్గస్యగుణః. అవాదేశః- భవతి, భవతః.

'మిదేర్గుణః'నుండి 'గుణః' అనువర్తించును. 'ఇకోగుణవృద్ధీ' అను పరిభాషచే 'ఇకః' లభించినది. ('గుణ' 'వృద్ధి' పదములచే గుణవృద్ధులను విధించినపుడు స్థాన్యుపస్థాపక మగు 'ఇకః'అను పదము లభించును' అని ఈ సూత్రమున కర్థము). సార్వధాతుకార్ధధాతుకములు పర మగునపుడు 'ఇక్'అంతమున గల అంగమునకు గుణము వచ్చును.

ఈ సూత్రముచే 'భూ'అనుదాని 'ఊః'స్థానమున అలోన్త్యపరిభాషచే[21] గుణము వచ్చి 'భో + అ + తి'అని యున్నది. అవాదేశము-'భవతి' సిద్ధించినది.

ప్రథమపురుషద్వివచనమున 'భూ + తస్'అని యుండగా 'శప్'ప్రత్య

యము-'భూ + అ + తస్'; వెనుకటి వలె గుణావాదేశములు, సకారమునకు రుత్వ విసర్గములు- 'భవతః' సిద్ధించును.

బహువచనమున 'భూ + ఝి' అని యుండగా వెనుకటి వలె శప్, గుణ, అవాదేశములు- 'భవ + ఝి' అని యుండగా:-

391. ఝోఽన్తః 7.1.3

ప్రత్యయావయవస్య ఝస్యాఽన్తాదేశః, 'అతోగుణే'-భవన్తి. భవసి, భవథః. భవథ.

'ఆయనేయీనీయియః ఫఢఖఛఘాం ప్రత్యయాదీనామ్'నుండి 'ప్రత్యయ' అనువర్తించును. ప్రత్యయావయవ మగు ఝకారమునకు 'అన్త్' అను నాదేశము వచ్చును. ఈ సూత్రముచే అన్తాదేశము చేయగా భవ + అన్త్ + ఇ = 'భవ అన్తి' అని యుండగా వకారోత్తరవర్తి యగు అకారమునకును, 'అన్తి'లోని అకారమునకును 'అతో గుణే' అను సూత్రముచే (274) పరరూపము— 'భవన్తి' సిద్ధించును.

మధ్యమపురుషప్రత్యయము లగు 'సి','థస్'.'థ'లు పర మగునపుడు 'భవతి'యందు వలె 'శప్'గుణావాదేశములచే 'భవసి' 'భవథః' 'భవథ' అను రూపములు సిద్ధించును.

బహువచనమున 'మి', 'వస్', 'మస్', ప్రత్యయములను జేర్చిన పిదప వెనుకటి వలె శప్, గుణావాదేశములచే 'భవమి', 'భవవస్', 'భవమస్' అని యుండగా:-

392. అతో దీర్ఘో యఞి 7.3.101

అతోఽఙ్గస్య దీర్ఘో యఞాదౌ సార్వధాతుకే. భవామి, భవావః. భవామః.

స భవతి, తౌ భవతః, తే భవన్తి.

త్వం భవసి, యువాంభవథః యూయంభవథ,

అహం భవామి, ఆవాం భవావః, వయం భవామః.

'తురుస్తుశమ్యమః సార్వధాతుకే'నుండి 'సార్వధాతుకే' అనువర్తించును

'యఞ్' ఆదియందు గల సార్వధాతుకము పర మగునపుడు అదన్తాంగమునకు దీర్ఘము వచ్చును.

ఇచట 'మిప్' మొదలగు యఞ్ మొదట గల సార్వధాతుకములు పర మగునపుడు 'భవ'అను దానికి అంగసంజ్ఞకలదు గాన ఈ సూత్రముచే, అలోఽన్త్య పరిభాషచే (21) వకారోత్తరవర్తి యగు అకారమునకు దీర్ఘము- 'భవామి', 'భవావః,' 'భవామః' అను రూపములు సిద్ధించును.

తచ్ఛబ్దయుష్మచ్ఛబ్దాస్మచ్ఛబ్దములు ఉపపదములుగ నున్నను లేకున్నను ఈ ప్రథమపురుషాదిప్రత్యయములు వచ్చు నను విషయమును సూచించుటకును, అర్థస్పష్టత్వార్థమును 'స భవతి' ఇత్యాదిరూపములు మూలమున చూపబడినవి.

393. *పరోక్షే లిట్* 3.2 115

భూతానద్యతనపరోక్షార్థవృత్తేర్ధాతోర్లిట్ స్యాత్. లస్య తిబాదయః

'భూతే'అని యధికారము. 'అనద్యతనే' లఙ్' నుండి 'అనద్యతనే' అనువర్తించును. భూతము, అనద్యతనము, పరోక్షము నగు అర్థమును బోధించు ధాతువుకంటె 'లిట్' వచ్చును.

గడచిన రాత్రియందలి చివరి యామము (జాము) తోడను, రాబోవు రాత్రియందలి మొదటి యామముతోడను కలసిన దివసమునకు అద్యతన మని పేరు. తద్భిన్నము అనద్యతనము. కావున అనద్యతనభూత మనగా గడచిన రాత్రి యందలి నాల్గవ యామమునకు పూర్వమున నున్నది వందసంవత్సరముల వ్యవధాన మున్నచో పరోక్ష మని కొందరును, వేయి సంవత్సరము లుండవలె నని కొందరును, రెండు రోజు లుండవలె నని కొందరును, మూడు రోజు లుండవలె నని మరికొందరును, గోడ,చాప మొదలగువాటిచే వ్యవహిత మైనను పరోక్ష మని కొందరును చెప్పి నట్లు భాష్యమున గలదు. ప్రయోక్తకు ఇంద్రియగోచరము కాకుండ నుండవలె ననునది మాత్రము సర్వసమ్మతము.

ఈ సూత్రముచే భూధాతువునకు 'లిట్'చేర్చగా, 'భూలిట్'అని యుండ 'లిట్'స్థానమున ఆ యా పురుషవచనాదుల ననుసరించి 'తిప్'మొదలగు ప్రత్యయములు వచ్చును. 'లిట్చ'అను రాబోవు సూత్రముచే (402) లిడాదేశము లగు 'తిఙ్'లకు ఆర్ధధాతుకసంజ్ఞ యుండుటచే 'శప్'రాదు. 'భూ+తిప్'ఇత్యాదివిధమున నుండగా:-

394. *పరస్మైపదానాం ణలతుసుస్ థలథుసణల్వమాః* 3.4.82

లిటస్తిబాదీనాంనవానాం ణలాదయఃస్యుః. భూ అ ఇతి స్థితే.

'లిట స్తయోరేశిరేచ్' నుండి 'లిటః'అనువర్తించును. 'లిట్'కు ఆదేశముగ వచ్చిన 'తిప్' మొదలగు తొమ్మిది పరస్మైపద ప్రత్యయములకును వరుసగా 'ణల్','అతుస్','ఉస్','థల్','అథుస్','అ','ణల్','వ', 'మ', అను తొమ్మిది ఆదేశములు వచ్చును.

ఈ సూత్రముచే 'తిప్'స్థానమున 'ణల్'అనునది సర్వాదేశముగవచ్చును. అందు ణకారలకారములు ఇత్సంజ్ఞకములు. 'భూ + అ'అని యుండగా:-

395. భువో వుగ్ లుఙ్ లిటోః 6.4.88

భువో వుగాగమః స్యాత్ లుఙ్ లిటోరచి.

"అచిశ్నుధాతుభ్రువాం య్వోరియఙువఙౌ" నుండి 'అచి'అనువర్తించును. 'లిఙ్','లిట్'లకు సంబంధించిన అచ్చు పర మగునపుడు 'భూ'ధాతువునకు 'వుక్' అను నాగమము వచ్చును.

ఇచట 'అ'పర మగుటచే వుగామము వచ్చినది. 'వుక్'లోని ఉకారకకారములు ఇత్సంజ్ఞకములు. 'కిత్'అగుటచే 'ఆద్యన్తౌటకితౌ'అను పరిభాషచే (84) 'భూ'అనుదానికి అంత్యావయవముగ వచ్చును. 'భూవ్ + అ' అని యుండగా:-

396. లిటి ధాతోరనభ్యాసస్య 6.1.8

లిటి పరే అనభ్యాసధాత్వవయవస్య ఏకాచః ప్రథమస్య ద్వే స్తః; ఆదిభూతాదచః పరస్య తు ద్వితీయస్య. 'భూవ్ భూవ్ అ' ఇతి స్థితే-

"ఏకాచో ద్వే ప్రథమస్య" "అజాదేర్ద్వితీయస్య"అను అధికారసూత్రములు అనువర్తించును. 'లిట్' పర మగునపుడు అభ్యాసభిన్నమును, ధాత్వవయవమును, ఏకాచ్కమును అగు మొదటి భాగమునకు ద్విత్వము వచ్చును; ఆద్యమగు 'అచ్'కంటె పర మైనయెడల (ధాతువు అజాది యైనపుడు) రెండవ ఏకాచ్క-భాగమునకు ద్విత్వము వచ్చును. అనగా హలాదిధాతువు లైనచో మొదటి ఏకాచ్క- (ఒక'అచ్'తో సహితముగా నున్న) భాగమునకును అజాదిధాతువు లైనచో రెండవ ఏకాచ్క-భాగమునకును ద్విత్వము వచ్చునని యర్థము. ధాతువు సహజముగ ఏకాచ్కమే యైనచో వ్యపదేశివద్భావముచే దానినే ప్రథమభాగముగను ద్వితీయభాగముగను గ్రహించి ద్విత్వము చేయవలెను. ఉదాహరణకు:-హలాదియగు 'చకాస్' ధాతువునందు 'చ''కాస్'అను రెండు ఏకాచ్క-భాగము లున్నవి గాన ఇచట 'చ' అనుదానికి ద్విత్వము వచ్చును. 'నీ' యను హలాదిధాతువు

నందు ఏకాచ్క-భాగము ఒక్కటే యుండుటచే దానినే వ్యపదేశివద్భావముచే ప్రథమైకాచ్క-ముగ పరిగణించి ద్విత్వము చేయవలెను. అజాది యగు 'ఊర్ణు' ధాతువునందు 'ణు'అనునది రెండవ ఏకాచ్క-భాగము గాన దానికి ద్విత్వము చేయవలెను. 'అట్'ధాతువునందు 'అట్' అనునదియే ద్వితీయైకాచ్క- మని భావించి దానికి ద్విత్వము చేయవలెను.

ప్రస్తుతోదాహరణమున 'భూవ్'అనునది ప్రథమైకాచ్క-భాగము గాన దానికి ద్విత్వము- 'భూవ్భూవ్' అని యుండును. వకారము 'భూ' అనుదానికి ఆగమముగ వచ్చినది గాన "యదాగమా స్తద్గుణీభూతా స్తద్గ్రహణేన గృహ్యన్తే" (ఏది దేనికి ఆగమముగ వచ్చినదో అది దాని యంగమై దానితో పాటు గ్రహింప బడును) అను పరిభాష ననుసరించి వకారసహిత ఊగు 'భూ'అనుదానికే ఇచట ద్విత్వము వచ్చును.

397. పూర్వోఽభ్యాసః. 6.1.4.

అత్ర యే ద్వే విహితే, తయోః పూర్వోఽభ్యాససంజ్ఞః స్యాత్.

'ఏకాచో ద్వే ప్రథమస్య'నుండి అనువర్తించిన 'ద్వే'అనునది షష్ఠ్యంతముగ (ద్వయోః) మారును. ఇచట విధింపబడిన రెండింటిలో మొదటిదానికి అభ్యాస మని పేరు.

ఈ సూత్రముచే 'భూవ్ భూవ్'అనుదానిలోని మొదటి 'భూవ్'అనుదానికి అభ్యాససంజ్ఞ.

398. హలాదిః శేషః 7.4.60

అభ్యాసస్యాదిర్హల్ శిష్యతే; అన్యే హలో లుప్యన్తే. ఇతి వలోపే-

'అత్ర లోపోఽభ్యాసస్య'నుండి 'అభ్యాసస్య' అనువర్తించును. అభ్యాస సంబంధి యగు మొదటి హల్లు మాత్రము శేషించును (అనగా) ఇతర హల్లులు లోపించును.

ఈ సూత్రముచే వకారము లోపింపగా 'భూ భూవ్ + అ'అని యుండః-

399. హ్రస్వః 7.4.59

అభ్యాసస్యాఽచో హ్రస్వః స్యాత్.

'అత్ర లోపోఽభ్యాసస్య'నుండి 'అభ్యాసస్య' అనువర్తించును. అభ్యాస సంబంధి యగు 'అచ్చు'నకు హ్రస్వము వచ్చును.

'భుభూవ్ + అ'అని యుండగా:-

400. భవతే రః 7.4.73

భవతే రభ్యాసస్యోకారస్య అః స్యాల్లి టి.

'అత్ర లోపో౽భ్యాసస్య''వ్యథోలిటి'నుండి 'అభ్యాసస్య''లిటి'అనువర్తించును. 'లిట్'పర మగునపుడు భూధాతుసంబంధి యగు అభ్యాసమునందలి ఉకారమునకు అకార మాదేశమగును.

'అలో౽న్త్యస్య'అను పరిభాషచే (21) ఈ అకారము అభ్యాసాన్త్యవర్ణ మగు ఉకారమునకు వచ్చు నని చెప్పబడినది. ఈ సూత్రముచే అత్వము చేయగా 'భ + భూవ్ + అ'అని యుండగా:-

401. అభ్యాసే చర్చ 8.4.54

అభ్యాసే ఝలాం చరః స్యుః, జశశ్చ.

ఝశాం జశః, ఖయాం చరః ఇతి వివేకః. బభూవ,బభూవతుః, బభూవుః.

'ఝలాం జశ్ ఝశి'నుండి 'ఝలాం' అనువర్తించును. పై సూత్రమునందలి 'చ'అను పదముచే 'జశ్'లు కూడ గ్రహింపబడును. అభ్యాసమునందలి 'ఝల్'లకు 'చర్'లను 'జశ్'లను గూడ ఆదేశముగ వచ్చును.

'ఝల్'లు మొత్తము ఇరువదినాలుగు. అందు 'శర్' లగు 'శషస'లకు 'శర్పూర్వాః ఖయః'అను సూత్రముచే (651) లోపము, హకారమునకు 'కుహోశ్చుః' అను సూత్రముచే (456) చుత్వము విధింపబడ నున్నది. ఇక మిగిలిన ఇరువది ''ఝల్''లలో 'ఝశ్'లకు (వర్గతృతీయ చతుర్థవర్ణములకు) 'జశ్'లు (జబగడదలు)ను 'ఖయ్'లకు (ప్రథమద్వితీయవర్ణములకు) 'చర్'లు(చటతపలు)ను, వాటి వర్గముల ననుసరించి ఆదేశముగ వచ్చును.

ఈ సూత్రముచే 'భ'కారమునకు 'బ'కార మాదేశ మగుటచే 'బ + భూవ్ + అ' = 'బభూవ' అను రూపము సిద్ధించినది. ద్వివచనమున 'తస్' ప్రత్యయమునకు 'అతుస్'ఆదేశము. పిమ్మట ప్రక్రియ యంతయు ఏకవచనమునందు వలెనే యుండును- భూ + అతుస్; భూవ్ + అతుస్; భూవ్ + భూవ్ + అతుస్; భూ + భూవ్ + అతుస్; భు + భూవ్ + అతుస్; భ + భూవ్ + అతుస్; బ + భూవ్ + అతుస్ = 'బభూవతుః' అను రూపము సిద్ధించును. ఇట్లే బహువచనమున 'ఝి'కి 'ఉస్'అను నాదేశము చేసిన పిమ్మట భూ + ఉస్;

భూవ్ + ఉస్; భూవ్ + భూవ్ + ఉస్; భూ + భూవ్ + ఉస్; భు + భూవ్ + ఉస్; భ + భూవ్ + ఉస్; బ + భూవ్ + ఉస్ = 'బభూవుః' అను రూపము సిద్ధించును.

మధ్యమపురుషైకవచనమున 'భూ + సిప్' అని యుండగా 'పరస్మై పదానాం'......'అను సూత్రముచే (394) 'థ(ల్)'ఆదేశముచే 'భూ + థ'అని యుండ-

## 402. లిట్ చ 3.4.115

లిడాదేశ స్తిఙార్ధధాతుకసంజ్ఞః.

'తిఙ్ శిత్సార్వధాతుకం' 'ఆర్ధధాతుకం శేషః'నుండి 'తిఙ్' 'ఆర్ధధాతుకం' అనువర్తించును. 'లిట్'కు ఆదేశముగ వచ్చిన 'తిఙ్'ప్రత్యయము ఆర్ధధాతుకమను పేరుకలది యగును. ఈ సూత్రము 'తిఙ్ శిత్సార్వధాతుకం'అను సూత్రముచే రావలసి యున్న సార్వధాతుకసంజ్ఞను బాధించును. 'భూ + థ'అను చోట 'థ'అనునది 'సిప్'అను 'తిఙ్'ప్రత్యయస్థానమున వచ్చి యుండుటచే స్థానివద్భావమున తిఙ్ ప్రత్యయ మగును గాన దీనికి పై సూత్రముచే ఆర్ధధాతుకసంజ్ఞ లభించును.

## 403. ఆర్ధధాతుకస్యేడ్వలాదేః 7.2.35

వలాదేరార్ధధాతుకస్య ఇడాగమః స్యాత్.

బభూవిథ, బభూవథుః, బభూవ, బభూవ, బభూవివ, బభూవిమ.

వలాది యగు ('వల్'మొదట గల) ఆర్ధధాతుకమునకు 'ఇట్' అను ఆగమము వచ్చును.

'ఇట్'అనునది 'టిత్'అగుటచే ఆద్యవయవముగ వచ్చును. 'భూ + ఇథ' అని యుండగా 'భువో వుగ్లుఙ్లిటోః' (395) అను సూత్రముచే 'వుక్'(వ్) ఆగమము- భూవ్ + ఇథ. 'భూవ్'అను దానికి 'లిటి ధాతోరనభ్యాసస్య' అను సూత్రముచే (396) ద్విత్వము. 'హలాదిః శేషః'అను సూత్రముచే (398)అభ్యాసవకారమునకు లోపము. 'హ్రస్వః'అను సూత్రముచే (399) అభ్యాసమునందలి ఊకారమునకు హ్రస్వము. 'భవతేరః' అను సూత్రముచే (400) ఆ ఉకారమునకు అకారము. అభ్యాసభకారమునకు 'అభ్యాసేచర్చ'అను సూత్రముచే (401) జశ్త్వబకారము. 'బభూవిథ' అను రూపము సిద్ధించును. మధ్యమపురుషద్వివ

చన మగు 'థస్'కు 'అథుస్'ఆదేశము, బహువచనప్రత్యయ మగు 'థ'కు 'అ' అను నాదేశము. ఉత్తమపురుషైకవచన మగు 'మిప్'కు 'ణల్'(అ) అను నాదేశము వచ్చుటచే క్రమముగా 'బభూవథుః; బభూవ. బభూవ'అను రూపములు సిద్ధించును. ప్రక్రియ పైన చూపిన విధముగనే యుండును. ఉత్తమపురుష ద్వివచన బహువచనప్రత్యయము లగు 'వస్''మస్'లకు ఆదేశముగ వచ్చిన 'వ' 'మ'లు వలాద్యార్ధధాతుకము లగుటచే ఇడాగము (సూ. 403) వచ్చును గాన 'బభూవివ' 'బభూవిమ' అను రూపములు నిష్పన్న మగును.

## 404. అనద్యతనే లుట్ 3.3.15

భవిష్యత్యనద్యతనేఽర్థేధాతోర్లుట్.

'ధాతోః'అధికారము. 'భవిష్యతి గమ్యాదయః' నుండి 'భవిష్యతి' అను వర్తించును. అనద్యతనభవిష్యత్కాలిక మగు అర్థమును బోధింపవలసి యున్నపుడు ధాతువుకంటె పరముగ 'లుట్' వచ్చును. ఉకారటకారములు ఇత్సంజ్ఞకములు. 'తిప్తస్ఝి'అను సూత్రముచే (377) 'తిఙ్'లు ఆదేశముగ వచ్చును. ప్రథమపురుషైకవచనమున 'భూ + తి'అని యుండగా:-

## 405. స్యతాసీ లృలుటోః 3.1.33

ధాతోః స్యతాసీ ఏతౌ ప్రత్యయౌ స్తః లృలుటోః పరతః. శబాద్యపవాదః. 'లృ'ఇతిలృఙ్లృటోర్గ్రహణమ్.

'తాసి'లోని ఇకారము ఉచ్చారణార్థము. అనగా 'తాస్' మాత్రము మిగులును. 'ధాతోః కర్మణః సమానకర్తృకాదిచ్ఛాయాం వా' నుండి 'ధాతోః' అను వర్తించును 'లృ','లుట్'లు పర మగునపుడు ధాతువుకంటె పరముగ వరుసగా 'స్య' 'తాస్' అను ప్రత్యయములు వచ్చును.

ఈ సూత్రము 'కర్తరి శప్'ఇత్యాది సూత్రములచే రావలసి యున్న 'శప్' మొదలగు వాటిని బాధించును. 'లృఙ్' 'లృట్'అను రెండు లకారములందును 'లృ'అనునది ఉన్నది గాన ఈసూత్రమునందలి 'లృ'అనుదానిచే 'లృఙ్''లృట్' ఈ రెండును గ్రహింపబడును. అనగా 'లృఙ్'పర మగునపుడును 'లృట్'పర మగునపుడును గూడ 'స్య'ప్రత్యయము వచ్చు నని యర్థము.

ఈ సూత్రముచే 'తాస్'ప్రత్యయము చేర్చిన పిమ్మట 'భూ + తాస్ + తి' అని యుండగా:-

## 406. ఆర్ధధాతుకం శేషః 3.4.114

తిఙ్ శిద్భ్యోఽన్యః 'ధాతోః'ఇతి విహితః ప్రత్యయః ఏతత్సంజ్ఞః స్యాత్. ఇట్.

ఇది 'తిఙ్ శిత్సార్వధాతుకం'అను సూత్రము (388)నకు తరువాత వచ్చు సూత్రము. ఆ సూత్రముచే ధాత్వధికారోక్తము లగు 'తిఙ్'లకు 'శిత్'లకు సార్వధాతుకసంజ్ఞ విహితమై యున్నది. ఇక శేషమనగా 'తిఙ్' శిత్'లకంటె భిన్నము లగు ధాత్వధికారోక్తప్రత్యయము లని యర్థము లభించును.

'తిఙ్'లకంటెను 'శిత్'లకంటెను భిన్నమైనదియు, 'ధాతోః'అను పదము నుచ్చరించి విధింపబడినదియు నగు ప్రత్యయము ఆర్ధధాతుకసంజ్ఞ కలది యగును.

ఈ సూత్రము ననుసరించి 'తాస్'అనునది ఆర్ధధాతుకము గాన 'ఆర్ధధాతుకస్యేడ్వలాదేః'అను సూత్రముచే (403) ఇడాగమము. 'భూ + ఇతాస్ + తి'అని యుండగా 'సార్వధాతుకార్ధధాతుకయోః'అను సూత్రముచే (930) 'భూ'లోని ఊకారమునకు గుణముచే ఓకారము, పిమ్మట అవాదేశము వచ్చి 'భవితాస్ + తి'అని యుండగా,-

## 407. లుటః ప్రథమస్య డారౌరసః 2.4.85

లుటః ప్రథమస్య డా, రౌ, రస్ ఏతే క్రమాత్ స్యుః. డిత్వసామర్థ్యాత్ అభస్యాపి టేర్లోపః. భవితా.

లుట్టుప్రథమపురుషప్రత్యయము లగు 'తిప్, తస్, ఝి'లకు వరుసగా 'డా','రౌ','రస్'అనునవి ఆదేశముగ వచ్చును.

'డా'లోని డకారము ఇత్సంజ్ఞకము. 'ఆ'మాత్రము మిగులును. 'తి'కి 'డా'ఆదేశము చేయగా 'భవితాస్ + ఆ'అని యుండును. ఇచట 'డా'ప్రత్యయము స్వాదికప్రత్యయాంతప్రత్యయములలో చేరకుండుటచే 'యచి భమ్'అను సూత్రముచే (165) 'భవితాస్' అనుదానికి భసంజ్ఞ వచ్చుటకు అవకాశము లేదు. భసంజ్ఞ లేదు గాన 'టేః'అను సూత్రముచే (242) టిలోపము వచ్చు నవకాశము లేదు. కాని టిలోపము చేయని పక్షమున ఈ ప్రత్యయమును 'డిత్'గా చెప్పుటకు ఏమియు ప్రయోజనము లేదు. 'ఆ'అనియే చెప్పి యుండవచ్చును. టిలోపము

చేసిననే డి త్వము సార్థక మగును. కావున 'భవితాస్' అనుదానికి భసంజ్ఞ లేకున్నను డా ప్రత్యయమును 'డిత్'గా చెప్పి యుండుటచే తత్సామర్థ్యమున టిలోప మంగీకరింపబడును. ఇట్లు టిలోపముచే 'భవితాస్'లోని 'ఆస్'అనునది లోపింప 'భవిత్ + ఆ' = భవితా'అను రూపము నిష్పన్న మైనది.

ద్వివచన ప్రత్యయ మగు 'తస్' పర మగునపుడు 'భూ + తస్' అని యుండగా 'స్యతాసీల్ృలుటోః'అను సూత్రముచే (405) 'తాస్' ప్రత్యయము— భూ + తాస్ + తస్, ఇడాగమగుణావాదేశములు—'భవితాస్ + తస్' 'తస్'కు 'రౌ' (సూ. 407) ఆదేశము చేయ 'భవితాస్ + రౌ' అని యుండగా-

408. తాసస్త్యోర్లోపః 7.4.50

తాసేర స్తేశ్చ లోపః స్యాత్ సాదౌ ప్రత్యయే పరే.

'సః స్యార్ధధాతుకే'నుండి 'స'అనువర్తించును. ఈ సూత్రము అంగాధికారమున నున్నది. ప్రత్యయము లేనిచో అంగసంజ్ఞ యసంభావ్యము గాన 'ప్రత్యయే' అనునది ఆక్షిప్త మగుచున్నది.

సకారాది ప్రత్యయము పర మగునపుడు 'తాస్'కును, 'అస్'ధాతువునకును లోపము వచ్చును. ఈ సూత్రముచే విహిత మగు లోపము 'అలో న్త్యస్య'అను పరిభాషచే (21) అంత్యవర్ణమునకు కలుగును.

409. రి చ 7.4.51

రాదౌ ప్రత్యయే తథా. భవితారౌ, భవితారః; భవితాసి, భవితాస్థః, భవితాస్థ; భవితాస్మి, భవితాస్వః, భవితాస్మః.

వెనుకటి సూత్రము అనువర్తించును. వెనుకటిసూత్రవ్యాఖ్యానమున చెప్పిన విధముగ 'ప్రత్యయే' అను పద మాక్షిప్త మగును. రేఫ ఆదియందు గల ప్రత్యయము పర మగునపుడు అటులనే యగును- అనగా 'తాస్'కును 'అస్' ధాతువునకును లోపము వచ్చును.

ఈ సూత్రముచే 'భవితాస్'లోని సకారము లోపింప 'భవితారౌ' అను రూపము సిద్ధించును. బహువచనప్రత్యయ మగు 'ఝి'కి 'రస్'ఆదేశము చేయగా (సూ. 407) 'భవితారః' అను రూపము నిష్పన్న మగును. ద్వివచనమునందు వలెనే ప్రక్రియ యుండును. మధ్యమపురుషైకవచనమున 'తాస్'ప్రత్యయేడాగమ గుణావాదేశములచే 'భవితాస్ + సి'అని యుండగా 'తాసస్త్యోర్లోపః'అను సూత్ర

ముచే (408) 'తాస్'లోని సకారము లోపింప 'భవితాసి' అను రూపము సిద్ధించును. 'థస్','థ','మి(ప్)','వస్','మస్'లు పర మగునపుడు' తాస్ప్రత్యయేడాగమగుణావాదేశములచే వరుసగా 'భవితాస్థః', 'భవితాస్థ', 'భవితాస్మి', 'భవితాస్వః', 'భవితాస్మః' అను రూపములు సిద్ధించును.

## 410. లృట్ శేషే చ. 3.3.13

భవిష్యదర్థాద్ధాతోః లృట్, క్రియార్థాయాం క్రియాయాం సత్యాం అసత్యాం చ. స్యః, ఇట్- భవిష్యతి, భవిష్యతః, భవిష్యన్తి, భవిష్యసి, భవిష్యథః, భవిష్యథ, భవిష్యామి, భవిష్యావః, భవిష్యామః.

'ధాతోః'అధికారము. 'భవిష్యతి గమ్యాదయః'నుండి 'భవిష్యతి' అను వర్తించును. 'తుమున్ణ్వులౌ క్రియాయాం క్రియార్థాయామ్' అను వెనుకటి సూత్రమున క్రియార్థక క్రియ ఉపపదముగా నున్నపుడు భవిష్యదర్థకధాతువునకు 'తుమున్''ణ్వుల్' ప్రత్యయములు విధింపబడినవి. ఒక క్రియను ప్రయోజనముగ నుద్దేశించి చేసిన మరి యొక క్రియకు క్రియార్థక క్రియ యని పేరు. ఉదా:- 'పఠితుం యాతి' (చదువుకొనుటకు వెళ్ళుచున్నాడు) అనునపుడు యానక్రియకు ప్రయోజనము పఠనక్రియ కావున యానక్రియ క్రియార్థక క్రియ. ఈ సూత్రమున 'శేషే చ' అనగా 'ఇట్టి క్రియార్థక క్రియ లేని స్థలమునందు కూడా'అని యర్థము. అనగా క్రియార్థక క్రియ ఉన్నను లేకున్నను అని యర్థము సిద్ధించును. క్రియార్థక క్రియ ఉపయుక్తమైనను కాకున్నను భవిష్యదర్థవాచక మగు ధాతువుకంటె పరముగ 'లృట్' వచ్చును.

ఇందలి ఋకారటకారము లిత్సంజ్ఞకములు. లకారస్థానమున తిబాది ప్రత్యయములు వచ్చును. ప్రథమపురుషైకవచనమున 'భూ + తి'అని యుండగా 'స్యతాసీ లృలుటోః'అను సూత్రముచే (405) ధాతువునకు పరముగ 'స్య'ప్రత్యయము. 'ఆర్ధధాతుకం శేషః'అను సూత్రముచే (406) నిది ఆర్ధధాతుకసంజ్ఞము గాన 'ఆర్ధధాతుకస్యేడ్వలాదేః'అను సూత్రముచే (403) ఇడాగమము- 'భూ + ఇస్య + తి'. 'సార్వధాతుకార్ధధాతుకయోః'అను సూత్రముచే (390) ఊకారమునకు గుణము. పిమ్మట అవాదేశము. 'ఆదేశప్రత్యయయోః'అను సూత్రముచే (150) 'స్య'యందలి సకారమునకు మూర్ధన్య (షకారా)దేశము. 'భవిష్యతి' అను రూపము సిద్ధించినది. ఇతరరూపములందు గూడ 'భవిష్య'అను నంతవరకు ప్రక్రియ ఇటులనే యుండును. ఇతరప్రక్రియ లట్టునందు వలె ఉండును.

భవిష్యదర్థమున 'లుట్','లృట్'అను రెండు లకారములు చెప్పబడినవి. అందు 'లృట్'సామాన్యముగ భవిష్యదర్థమును బోధించునపుడు ఉపయోగింపబడును. 'లుట్'అనద్యతనభవిష్యదర్థమునందు (రాబోవు అర్ధరాత్రివరకును గల కాలము అద్యతనభవిష్యత్తు. దాని పిమ్మట వచ్చు భవిష్యత్తు అనద్యతనభవిష్యత్తు) ఉపయోగింపబడును. ఉదాహరణకు 'రాముడు రేపు సాయంకాలము వెళ్ళగలడు' అనునపుడు ఇది అనద్యతన భవిష్యత్తు గాన 'రామః శ్వః సాయం గన్తా'అని లుట్టును మాత్రమే ఉపయోగింపవలెను. అట్లే "రాముడు నేడు సాయంకాలము వెళ్ళగలడు' అను నపుడు ఇది అద్యతనభవిష్యత్తు గాన లుట్టు నుపయోగింపరాదు. భవిష్యత్సామాన్యబోధక మగు లృట్టునే ప్రయోగింపవలెను. 'రాముడు రాగలడు'అను నపుడు ఎపుడు వచ్చునో నిశ్చితము కాదు కావున ఇట్టి స్థలములందు కూడ 'రామః ఆగమిష్యతి'అని లృట్టునే ప్రయోగించవలెను.

## 411. లోట్చ 3.3.162

విధ్యాద్యర్థేషు ధాతోర్లోట్.

'విధినిమన్త్రణామన్త్రణాధీష్టసంప్రశ్నప్రార్థనేషు లిఙ్' అను దీనివెనుక సూత్రముచే (427) విధ్యాద్యర్థములందు 'లిఙ్'విహితమై యున్నది. ఈ సూత్రమున "లోట్టుకూడ వచ్చును"అని చెప్పుటచే 'విధి' మొదలగు నర్థముల ను బోధింపవలసి నపుడు ధాతువుకంటె పరముగ 'లోట్ వచ్చును' అను నర్థము సిద్ధించినది.

విధి, నిమంత్రణము, ఆమంత్రణము, అధీష్టము, సంప్రశ్నము, ప్రార్థన అను నీ యారింటియందును అంతర్గతముగ ప్రేరణ మున్నది. భృత్యాదులను ఏదైన కార్యమును చేయుటకు ఆజ్ఞాపించుట విధి. దీనిని భృత్యాదులు అతిక్రమింపజాలరు. అవశ్యకర్తవ్య మగు కార్యమున (పరీక్షాలిఖనాది కార్యమున) శిష్యాదులను నియోగించుట నిమంత్రణము. నిమంత్రణము అధికారపూర్వకముగ చేయబడకున్నను ఇందు కూడ అనివార్యత్వము కలదు. 'నీ వీలువెంబడిని చేయవచ్చును'అనునట్లు సూచించుచు ప్రేరేపించుట అమంత్రణము. వివాహాదిశుభకార్యములకై ఆహ్వానించు నపుడు ఆ యాహూతుడు రావచ్చును, రాక పోవచ్చును. ఇది అమంత్రణము. గౌరవార్హు లగు వారిని సత్కారపూర్వకముగ ప్రేరేపించుట అధీష్టము. 'భవాన్ మమ పుత్రం అధ్యాపయతు' ఇత్యాదులు ఇందుల కుదాహరణము. ఈ కార్యము చేయుదునా లేక ఆకార్యము చేయుదునా అని ఆలోచించి

నిర్ధారణ చేయుట సంప్రశ్న. 'కిం భోః వ్యాకరణం భవానధీయీత' ఇత్యాదు ఉదాహరణము. ప్రార్థన మనగా సవినయముగా యాచించుట. ఈ ఆరు అర్థము లందును 'లోట్'ను గాని 'విధిలిఙ్'ను గాని ప్రయోగింపవచ్చును.

412. ఆశిషి లిఙ్ లోటౌ 3.3.173

(ఆశిష్యపి లిఙ్ లోటౌ స్తః. ఆశీః అప్రాప్తప్రాప్తీచ్ఛా)

'లిఙ్','లోట్'లు ఆశీరర్థమునందు గూడ వచ్చును. లేనిది కావలె నని కోరుటకు ఆశీస్సు అని పేరు.

ఈ యాశీరర్థమున లోట్టునందు ప్రథమపురుషైకవచనమధ్యమపురుషైక వచనములందు మాత్రము విశేషరూపము ఉండును. 'లిఙ్'నందు అన్ని రూప ములును మార్పు చెందును. దీనికి 'ఆశీర్లిఙ్' అను ప్రత్యేకనామధేయమ ప్రసిద్ధము.

భూధాతువునకు విధ్యాద్యర్థములందు 'లోట్' చేర్చిన పిదప (ఓకారటకా రములిత్సంజ్ఞకములు) లకారస్థానమున తిఙాదులు వచ్చును. ప్రథమైకవచనమున 'భూ + తి'అని యుండగా 'తి'సార్వధాతుకము గాన ధాతుప్రత్యయములకు నడుమ 'శప్'వచ్చును (సూ. 389). పిమ్మట గుణము (సూ. 390) అవాదేశము చేయ 'భవ + తి'అని యుండగా:-

413. ఏరుః 3.4.86

లోట ఇకారస్య ఉః. భవతు.

ఏః, ఉః. 'లోటో లఙ్వత్'నుండి 'లోటః'అనువర్తించును. 'ఏః'అనునది 'ఇ'అనుదాని షష్ఠ్యేకవచనము. "లోట్ యొక్క ఇకారమునకు ఉకారమాదేశ మగును."

స్థానివద్భావముచే 'తి'అనునది 'లోట్'గాన దీని 'ఇ'కారమునకు ఉకారా దేశము చేయ 'భవతు'అను రూపము సిద్ధించినది.

414. తుహ్యోస్తాతఙ్ఙాశిష్యన్యతరస్యామ్ 7.1.35

ఆశిషి తుహ్యోః 'తాతఙ్' వా. పరత్వాత్ సర్వాదేశః. భవతాత్,

ఆశీరర్థమున 'తు' 'హి'అను వాటికి 'తాతఙ్' అను నాదేశము వికల్ప ముగ వచ్చును.

'తాతఙ్'లో చివర నున్న ఙకారము దాని వెనుకనున్న అకారము ఇత్సంజ్ఞకము లగుటచే 'తాత్' అనునది మాత్రము మిగిలి యుండును. ఇది ఙిత్తు గాన 'ఙిచ్చ'అను సూత్రముచే (46) అంతాదేశముగా రావలసి యున్నది. కాని ఈ ఆదేశమున అనేకవర్ణము లున్నవి గాన 'అనేకాల్ శిత్సర్వస్య' అను సూత్రము (45) ననుసరించి సర్వాదేశముగ వచ్చును. 'అనేకాల్ శిత్సర్వస్య' అనునది 'ఙిచ్చ'కంటె పరము గాన 'విప్రతిషేధే పరం కార్యమ్' (113)అను పరిభాషచే దానిని బాధించును.

ఇట్లు 'తు' అనుదానికి 'తాత్' అనునది సర్వాదేశముగ వచ్చుటచే 'భవతాత్' అను రూపము ఆశీరర్థమున వైకల్పికముగ వచ్చును. తాతఙాదేశము రాని పక్షమున ఆశీరర్థమున గూడ 'భవతు'అనియే ప్రయోగింపవచ్చును.

## 415. లోటో లఙ్వత్ 3.4.85

లోటస్తామాదయః సలోపశ్చ.

'లోట్'కు 'లఙ్'కు వలె కార్యములు వచ్చును. అనగా 'లఙ్'కు వలె లోట్టునకు గూడ (రాబోవు సూత్రములచే చెప్పబడు) తామాద్యాదేశములు, సకారలోపమును వచ్చును.

## 416. తస్ థస్ థమిపాం తాంతంతామః 3.4.101

ఙితశ్చతుర్ణాం తామాదయః క్రమాత్ స్యుః. భవతామ్, భవన్తు.

'నిత్యం ఙితః'నుండి 'ఙితః'అనువర్తించును. "ఙిత్తులగు లకారముల (లఙ్,లిఙ్,లుఙ్,లృఙ్ల) 'తస్','థస్','థ','మిప్' ప్రత్యయములకు 'తాం', 'తం','త''అమ్',అను నాదేశములు క్రమముగా వచ్చును".

ప్రథమపురుషద్వివచనమున 'శప్'గుణావాదేశములు చేసిన పిమ్మట 'భవ + తస్'అని యుండగా 'లోట్'కు లఙ్ కార్యములు అతిదిష్టమైనవి గాన పై సూత్రముచే 'తస్'కు 'తామ్' అను నాదేశము చేయుటచే 'భవతామ్' అను రూపము సిద్ధించినది.

బహువచనమున లట్ ప్రథమపురుషబహువచనమునందు వలె 'భవన్తి' అను రూపము నిష్పన్నమైన పిమ్మట 'ఏరుః' అను సూత్రముచే (413) ఇకారమునకు ఉత్వము చేయ 'భవన్తు' అను రూపము సిద్ధించును.

మధ్యమపురుషైకవచనమున 'భవ + సి' అని యుండగా:-

## 417. సేర్హ్యపిచ్చ 3.4.101

లోటః సేర్హి*,సోఽపిచ్చ.

సేః,హి,అపిత్,చ. 'లోటో లజ్వత్' నుండి 'లోటః'అనువర్తించును. "లోట్ యొక్క 'సి'అనుదానికి 'హి' అను నాదేశము వచ్చును.ఈ 'హి'అను నది పకారేత్సంజ్ఞకము కాదు."

ఇచట 'సిప్'అనునది పకారేత్సంజ్ఞకము.దాని స్థానమున నాదేశముగ వచ్చు 'హి' అనునది గూడ స్థానివద్భావముచే పకారేత్కము కావలసి యుండ 'అపిచ్చ' అనుటచే ఈ పిత్త్వము నిషేధింపబడినది.ఇట్లు నిషేధించుటచే 'సార్వధాతుకమపిత్' (పకారేత్కము కాని సార్వధాతుకము జిత్తువంటి దగును) అను సూత్రముచే (503) 'హి'కి జిద్వద్భావ ముండును.కావున జిత్త్వప్రయుక్తమగు గుణనిషేధాదికార్యములు లభించును గాన 'స్తుహి' ఇత్యాదులందు 'సార్వధాతుకార్ధధాతుకయోః' (390) అను గుణము రాదు.ఇదియే అపిత్త్వ విధాన ప్రయోజనము.

ఇచట 'సి'అనుదానికి 'హి'ఆదేశము చేసిన పిమ్మట 'భవ + హి'అని యుండగా:-

## 418. అతో హేః 6.4.105

అతః పరస్య హేర్లుక్. భవ, భవతాత్, భవతమ్, భవత.

'చిణో లుక్' నుండి 'లుక్'అనువర్తించును. "హ్రస్వాకారముకంటె పర మగు 'హి'కి లోపము వచ్చును." ఈ సూత్రముచే 'హి'లోపింపగా 'భవ' అను రూపము సిద్ధించినది. ఈ సూత్రమును బాధించి 'తుహ్యోస్తాతఙ్ఙాశిష్యన్యతరస్యామ్'అను సూత్రముచే (413) వైకల్పికముగ తాతఙాదేశము వచ్చిన పక్షమున 'భవతామ్' అను రూపము సిద్ధించినది.

ద్వివచనబహువచనములందు 'థస్', 'థ'లకు వరుసగా 'తమ్' 'త'లు ఆదేశముగ వచ్చుటచే(సూ.416) 'భవతమ్''భవత'అను రూపములు నిష్పన్నమైనవి.

ఉత్తమపురుషైకవచనమున 'భవ + మి'అని యున్నపుడు 'మిప్'కు 'అమ్'ఆదేశము రావలసి యుండగా(సూ.416)-

### 419. మేర్నిః 3.4.89

లోటో మేర్నిః స్యాత్.

'లోటోలజ్వత్' నుండి 'లోటః' అనువర్తించినది. " 'లోట్'యొక్క 'మి'అనుదానికి 'ని'వచ్చును".

ఈ సూత్రముచే 'ని'ఆదేశము చేసిన పిమ్మట 'భవ + ని' అని యున్నది.

### 420. ఆడుత్తమస్య పిచ్చ 3.4.92

లోడుత్తమస్య ఆట్ స్యాత్, పిచ్చ. భవాని. హిన్యోరుత్వంన; ఇతోచ్చారణసామర్థ్యాత్.

"లోట్టుయొక్క ఉత్తమపురుషమునకు 'ఆట్' అను నాగమము వచ్చును, ఈ యాగమము పకారేత్క మగును."

'ఆట్'అనునది 'టిత్' అగుటచే ప్రత్యయమునకు ఆద్యవయవముగ వచ్చును.పిత్త్వమును అతిదేశించుటచే గుణాదులు వచ్చుటకు అభ్యంతర ముండదు ఈ సూత్రముచే 'ఆట్' చేర్చిన పిమ్మట 'భవ + ఆని' అని యుండగా సవర్ణదీర్ఘముచే 'భవాని'అను రూపము సిద్ధించును.

'హి''ని'అనువాటి ఇకారమునకు 'ఏరుః'అను సూత్రముచే (413) ఉత్వము రావలసి యున్నది.కాని ఉత్వము చేయు పక్షమున 'హి','ని'అని ఇకారాంతాదేశములను చెప్పుటలో ప్రయోజనమే యుండదు 'హు''ను' అను ఉకారాంతాదేశములనే చెప్పి యుండవచ్చును.కావున ఇకారోచ్చారణ సామర్థ్యముచే ఉత్వము రాదు.

### 421. తే ప్రాగ్ధాతోః 1.4.80

తే గత్యుపసర్గసంజ్ఞకాః ధాతోః ప్రాగేవ ప్రయోక్తవ్యాః.

'ఉపసర్గాః క్రియాయోగే','గతిశ్చ'అను సూత్రములను చెప్పిన ప్రసంగమున నీ సూత్రము పఠింపబడినది గాన 'తే'అనగా 'గత్యుపసర్గములు'అని యర్థము. "ఆ గతిసంజ్ఞకములను,ఉపసర్గసంజ్ఞకములను ధాతువునకు మొదట ప్రయోగింపబడవలెను."

ఈ సూత్రము ననుసరించి 'ప్ర'అను నుపసర్గను 'భవాని'అనుదానికి మొదట చేర్చుటచే 'ప్ర + భవాని'అని యుండును.

### 422. అని లోట్ 8.4.16

ఉపసర్గస్థాన్నిమిత్తాత్పరస్య లోడాదేశస్య 'అని'ఇత్యస్య నస్య ణః స్యాత్.

'ఉపసర్గాదసమాసేపి' నుండి 'ఉపసర్గాత్' 'రషాభ్యాంనోణఃసమానపదే' అను సూత్రమును అనువర్తించును. 'అని''లోట్'అనునవిలు షష్ఠ్యంత పదములు. "ఉపసర్గయందున్న నిమిత్తము (రేఫషకారముల) కంటె పరమును 'లోట్'స్థానీయమును అగు 'అని'యందలి నకారమునకు 'ణ'కార మాదేశ మగును.

ఈ సూత్రముచే ణత్వము చేయగా 'ప్రభవాణి' అను రూపము సిద్ధించును. 'ప్రభవాని' అనునది ఏకపదము కాదు గాన "అట్కుప్వాఙ్నుమ్ వ్యవాయేపి'అను సూత్రము (138) ప్రవర్తింపకుండుటచే ఈ సూత్రము చెప్పవలసి వచ్చినది.

వా. *దురః షత్వణత్వయోరుపసర్గత్వప్రతిషేధో వక్తవ్యః.*

దుస్థితిః, దుర్భవాని.

షత్వణత్వములు చేయవలసి యున్నపుడు 'దుర్' అను దాని ఉపసర్గత్వమునకు నిషేధము చెప్పవలెను; అనగా 'దుర్'అనునది ఉపసర్గగా పరిగణింపబడదు.

'దుర్ + స్థితిః'అనునపుడు స్థాధాతుసకారమునకు 'ఉపసర్గాత్సునోతి, సువతి, స్యతి, స్తౌతి, స్తోభతి, స్థా, సేనయ, సేధ, సిచ, సఞ్జ, స్వఞ్జామ్' అను సూత్రముచే షత్వము రావలసి యున్నది.ఇట్లే 'దుర్ + భవాని' అనునపుడు 'ని'అనుదాని నకారమునకు 'అని లోట్'అను సూత్రముచే (422) ణత్వము రావలసి యున్నది.ఈ షత్వణత్వములు రెండును 'దుర్'అను ఉపసర్గను నిమిత్తముగ చేసికొని వచ్చుచున్నవి. కాని ఈ వార్తికము షత్వణత్వములు చేయనున్నపుడు 'దుర్'అనునది ఉపసర్గగా పరిగణింపబడదు అని చెప్పుచున్నది. 'దుర్'కు ఉపసర్గత్వము లేనిచో ఉపసర్గత్వప్రయుక్త మగు షత్వణత్వములు రావు గాన 'దుఃస్థితిః'. (రేఫకు'ఖరవసానయోర్విసర్జనీయః' (సూ.93) అని విసర్గము) 'దుర్భవాని'అను రూపములు సిద్ధించును.

వా. అన్తశ్శబ్దస్యాఙ్కివిధిణత్వేషూపసర్గత్వం వాచ్యమ్.

అన్తర్భవాణి.

అఙ్,కివిధి, ణత్వముల విషయమున 'అన్తర్'అను శబ్దమునకు ఉపసర్గత్వము చెప్పవలెను.

'అంతర్' అనునది ప్రాదులలో పఠింపబడలేదు కావున దీనికి 'ఉపసర్గాః క్రియాయోగే'అను సూత్రముచే (35) ఉపసర్గసంజ్ఞ లభింప కుండుటచే ఈ వార్తికము దానికి పై మూడు సందర్భములందును ఉపసర్గసంజ్ఞను విధించుచున్నది.

'అంతర్ + భవాని'అనునపుడు 'అంతర్' అనుదానికి ఈ వార్తికముచే ఉపసర్గసంజ్ఞ లభించినది గాన 'ఆని లోట్'అను సూత్రముచే (422) ణత్వము వచ్చి 'అన్తర్భవాణి'అను రూపము సిద్ధించును.

'అఙ్'కు ఉదాహరణము:- 'ధా'ధాతువునకు 'అంతర్' అను ఉపసర్గము ఉపపదముగా నుండుటచే 'ఆతశ్చోపసర్గే'అను సూత్రముచే (3.3.106) 'అఙ్' ప్రత్యయము వచ్చి 'అన్తర్ధా'అను రూపము సిద్ధించును. (అష్టాధ్యాయిలో 'ఆతశ్చోపసర్గే'అను రెండు సూత్రములున్నవి. మొదటిది (3.1.36) 'క'ప్రత్యయ విధాయకము, రెండవది (3.3.106) 'అఙ్'విధాయకము.)

'కి'కి ఉదాహరణము:- పై ధాతువునకే 'ఉపసర్గే ఘోః కిః' అను సూత్రముచే (865) 'కి'ప్రత్యయము చేయ 'అన్తర్ధిః' అను రూపము సిద్ధించినది.

ద్వివచనబహువచనములందు 'భవ + వస్' 'భవ + మస్'అని యుండగా 'ఆడుత్తమస్య పిచ్చ'అను సూత్రముచే (420) ఆడాగమము,సవర్ణదీర్ఘముచేయ 'భవావస్''భవామస్'అని యుండును.

423. నిత్యం ఙితః 3.4.99

సకారాన్తస్య ఙిదుత్తమస్య నిత్యం లోపః

'అలోన్త్యస్య' ఇతి సలోపః- భవావ, భవామ.

'స ఉత్తమస్య'అను సూత్రము, 'ఇతశ్చ లోపః'మంది 'లోపః' అను పదము అనువర్తించును "ఙిత్తుల సకారాన్త మగు ఉత్తమపురుషమునకు నిత్యముగ లోపము వచ్చును".

'వైతోఽన్యత్ర' అను వెనుకటి సూత్రమునుండి 'వా' అనునది అను వర్తింపకుండుటకై 'నిత్యం' అని చెప్పబడినది.

'అలోఽన్త్యస్య' అను పరిభాషచే (21) ఈ లోపము అంత్య మగు సకారమునకు వచ్చును 'లోట్' కూడ 'లోటో లఙ్వత్' అను అతిదేశముచే (416) 'ఙిత్' గాన సకారము లోపించి 'భవావ' 'భవామ' అను రూపములు నిష్పన్నమైనవి.

## 424. అనద్యతనే లఙ్ 3.2.111

అనద్యతన భూతార్థవృత్తేర్ధాతో ర్లఙ్ స్యాత్.

'ధాతోః' 'భూతే' అని అధికారములు. అనద్యతనభూత కాలమునకు సంబంధించిన అర్థమును బోధించు ధాతువుకంటె 'లఙ్' వచ్చును. అనగా గడచిన అర్ధరాత్రికి పూర్వమున నున్న భూతము అనద్యతనభూతము. ఈ అనద్యతనత్వము స్పష్టముగ తెలియునపుడు 'లఙ్'ను ప్రయోగింపవలెను. సామాన్య భూతార్థమున 'లుఙ్'ను ప్రయోగింపవలెను. ఉదాహరణమునకు:- 'హ్యః అహం భాగ్యనగరీం అగచ్ఛమ్' (నేను నిన్న భాగ్యనగరమునకు వెళ్ళితిని) ఇత్యాదిస్థలములందు అనద్యతనభూతకాలము గావున 'లఙ్'నే ప్రయోగింపవలెను కాని 'లుఙ్'ను ప్రయోగింపరాదు.

భూధాతువునకు అనద్యతనభూతార్థమున 'లఙ్' చేర్చిన పిదప 'భూ + లఙ్' అని యుండ:-

## 425. లుఙ్ లఙ్ లృఙ్ క్ష్వడుదాత్తః 6.4.71

ఏష్వఙ్గస్యాట్.

'అఙ్గస్య' అధికారము. 'లుఙ్' 'లఙ్' 'లృఙ్'లు పరమగునపుడు అంగమునకు 'అట్' అను ఉదాత్త మగు ఆగమము వచ్చును.

'అట్' టిత్తు గాన 'ఆద్యంతౌ టకితౌ' అను సూత్రముచే (84) 'భూ' అను అంగమునకు ఆద్యవయవముగ వచ్చును. 'అభూ + లఙ్' అని యుండగా లకార స్థానమున తిబాది ప్రత్యయము లాదేశములుగ వచ్చును. ('ఙ' 'ఙ్'లు ఇత్సంజ్ఞకములు). ప్రథమైకవచనమున 'తి(ప్)' ప్రత్యయము వచ్చిన పిమ్మట లట్టునందు వలె శప్, గుణావాదేశములచే 'అభవతి' అని యుండగా:-

426. ఇతశ్చ 3.4.100

జితో లస్య పరస్మైపదమికారాన్తం యత్, తదన్తస్య లోపః.

| | | |
|---|---|---|
| అభవత్, | అభవతామ్, | అభవన్, |
| అభవః, | అభవతమ్, | అభవత, |
| అభవమ్, | అభవావ, | అభవామ. |

'లస్య' అధికారము. 'ఇతశ్చ లోపః పరస్మైపదేషు' నుండి 'లోపః' 'పరస్మైపదేషు' అను పదము లనువర్తించును. 'నిత్యం జితః'నుండి 'జితః' అనువర్తించును. " 'జిత్'అగు లకారము యొక్క స్థానమున ఆదేశముగ వచ్చిన ఏ ఇకారాంత పరస్మైపద ప్రత్యయము కలదో దాని అంతమునకు (ఇకారమునకు) లోపము వచ్చును"

ఈ సూత్రముచే 'తి'యందలి ఇకారము లోపించుటచే 'అభవత్' అను రూపము సిద్ధించును. ద్వివచనమున అడాగమము చేసిన పిమ్మట వెనుకటి వలెనే 'తస్'ప్రత్యయ, శప్, గుణావాదేశములు వచ్చుటచే 'అభవతస్'అని యుండ 'తస్థస థమిపాం తాంతంతామః'అను సూత్రముచే (416) 'తస్'కు 'తామ్' ఆదేశము-'అభవతామ్'అను రూపము సిద్ధించినది. ఇట్లే అన్ని రూపము లందును అడాగమ, శప్, గుణావాదేశములు వచ్చును.

బహువచనమున లట్టునందువలె ప్రక్రియ చేయుటచే 'అభవన్తి'అని యుండ 'ఇతశ్చ' అను సూత్రముచే (426) ఇకారలోపము-'అభవన్త్'-'సంయోగాన్తస్యలోపః'అను సూత్రముచే (20) తకారలోపము-'అభవన్' అనురూపము సిద్ధించినది.

మధ్యమపురుషైకవచనమున 'అభవ + సి' అని యుండ 'సి'యందలి ఇకారమునకు లోపము (సూ.426), సకారమునకు రుత్వవిసర్గములు- 'అభవః' అను రూప మేర్పడినది. ద్వివచనమున 'అభవ + థస్' అని యుండగా 'థస్'కు 'తమ్'ఆదేశము (సూ.416)-'అభవతమ్' అను రూపము సిద్ధించినది. బహువచనమున 'అభవ + థ'అని యుండగా 'థ'కు 'త'ఆదేశము (సూ416) 'అభవత'అని యగును.

ఉత్తమపురుషైకవచనమున 'అభవ + మి'అని యుండగా 'మి'కి 'అమ్' ఆదేశము (416)-'అభవ + అమ్' అని యుండ 'అతోగుణే' అను సూత్రముచే (274) పరరూపము-'అభవమ్'అను రూపము సిద్ధించును. ద్వివచనబహువచన

ములందు 'అభవ + వస్' 'అభవ + మస్' అని యుండగా 'అతో దీర్ఘో యఞి' అను సూత్రముచే (392) దీర్ఘము, 'నిత్యంఙితః' అను సూత్రముచే (423) సకారలోపము చేయ 'అభవావ' 'అభవామ' అను రూపములు సిద్ధించినవి.

427. విధినిమన్త్రణామన్త్రణాధీష్టసంప్రశ్నప్రార్థనేషు లిఙ్ 3.3.161

ఏష్వర్థేషు ధాతోర్లిఙ్.

"విధిమొదలగు నర్థములందు ధాతువుకంటె 'లిఙ్' వచ్చును". విధ్యాది పదముల యర్థము 411వ సూత్రము వ్యాఖ్యానమున చెప్పబడినది.

428. యాసుట్ పరస్మైపదేషూదాత్తో ఙిచ్చ 3.4.103

లిఙః పరస్మైపదానాం యాసుట్ ఆగమః, ఉదాత్తః. ఙిచ్చ.

'లిఙః సీయుట్' నుండి 'లిఙః' అనువర్తించును. "లిఙ్ యొక్క పరస్మైపదప్రత్యయములకు 'యాసుట్' అను నాగమము వచ్చును. అది ఉదాత్తముగను 'ఙిత్' గను ఉండును."

భూధాతువునకు విధ్యాద్యర్థములందు 'లిఙ్' ('ఇ' 'ఙ్' లు ఇత్సంజ్ఞకములు) చేర్చిన పిదప తిఙ్ప్రత్యయములు ఆదేశమగును. ప్రథమపురుషైకవచనమున 'శప్' గుణావాదేశములచే 'భవతి' అని యుండగా 'ఇతశ్చ' అను సూత్రముచే (426) ఇకారలోపము-'భవత్' అని యుండును. ఇపుడు పై సూత్రముచే 'త్' అను దానికి యాసుడాగమము. 'యాసుట్' లోని ఉకారటకారము లిత్సంజ్ఞకము లగుటచే 'యాస్' అనునది మాత్రము మిగులును. టిత్తుగాన ఆద్యవయవముగ వచ్చును-'భవ + యాస్త్' అని యుండగా:-

429. లిఙః స లోపోऽనన్త్యస్య 7.2.79

సార్వధాతుకలిఙో ఽనన్త్యస్య సస్య లోపః. ఇతి ప్రాప్తే-

'స' అనునది లుప్తషష్ఠీక మగు పదము. 'రుదాదిభ్యః సార్వధాతుకే' నుండి అనువృత్త మగు 'సార్వధాతుకే' అనునది షష్ఠ్యంతముగ మారును. "సార్వధాతుక మగు 'లిఙ్' యొక్క అంత్యము కాని సకారము లోపించును"

ఇచట 'తి' అనునది 'లిఙ్' స్థానమున వచ్చినది గాన స్థానివద్భావముచే 'లిఙ్' గా పరిగణింపబడును. 'యాస్' అనునది అట్టి 'త్' అనుదానికి అవయవముగ చేరినది గాన 'యదాగమాస్తద్గుణీభూతాస్తద్గ్రహణేన గృహ్యన్తే' (ఏవి